
లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

జూలై 2021 రూ.10/-








## సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇవ్వాలి.. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం ఉచితంగా అందించాలి





## మానవ వనరుల అభివృద్ధితో పీవీ కృషిని కొనసాగిద్దాం



Government of Telangana
Sri PV Narasimha Rao Centenary Celebrations Committee
Department of Language and Culture
Telangana Sahitya Akademi
Presents
Screening of Episodes from Documentary Series



P V: Change with Continuity




# మానవ వనరుల అభివృద్ధితో పీవీ కృషిని కొనసాగిద్దాం

మన దేశంలో ఆర్థిక సరళీకరణ 30 ఏళ్ల మైలురాయిని చేరుకుంటోంది. విశ్వాసంతోనో, అవగాహనతోనో భారత్ 1991లో ఆర్థిక సంస్కరణల్ని ప్రారంభించలేదు. విధిలేని పరిస్థితుల్లోనే మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో అనుకోకుండా ప్రధానమంత్రిగా తనకు లభించిన అవకాశాన్ని పీవీ నరసింహారావు అద్భుతమనదగ్గ రీతిలో సద్వినియోగం చేశారు. పరిమిత పరిధిలోనే అపరిమిత స్థాయి కృషి చేశారు. కీలక సంధిదశలో భారతదేశాన్ని సరైన కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. అంతా ప్రధానమంత్రి చుట్టూనే ఈ సంస్కరణలు జరగలేదు. సమష్టి కృషిలా ఆ కర్తవ్యాన్ని నిర్వహించారు. మంత్రివర్గంలోనివారు, అధికారులు సహా సంబంధిత బాధ్యులంతా ఇది తమ పని అనుకుని చేశారు. పీవీతోపాటు ఈ చారిత్రక కృషిలో భాగస్వాములైన డాక్టర్ మన్మోహన్ సింగ్ తదితరులు పరిమితుల మధ్య కూడా తక్షణ ప్రయోజనాల కోసం వెంపర్లాడకుండా వ్యవస్థీకృత కృషి చేశారు. అందుకే ప్రధాని పదవి నుంచి పీవీ దిగిపోయినా సంస్కరణలు అంతర్ధానం కాలేదు. ఆ తర్వాతి ప్రభుత్వాలు సంస్కరణల్లో కొన్నిటికి కొర్రీలు పెట్టినా, అన్నిటినీ కొనసాగించకపోయినా.. సంస్కరణల ప్రక్రియనయితే తిరగదోడలేదు. ఇండియాలో ఇదో అద్భుతం. సంస్కరణలపై ఇంటాబయటా రాజకీయ నేతలను, ముఖ్యమంత్రులను ఒడుపుగా, ఓపిగ్గా, ప్రజాస్వామ్యయుతంగా, ఫెడరల్ స్ఫూర్తితో పీవీ ఒప్పించారు. 30 ఏళ్ల క్రితం.. భారత్ వంటి ఓ నిరుపేద దేశంలో.. సోషలిజం, సామ్యవాదాలకు విపరీత వ్యాఖ్యానాలని ఇచ్చిన సమాజంలో.. అసమానతలు, కులాలు మతాలున్న సమాజంలో.. ఏ రకమైన అస్థిరత్వం లేకుండా కార్మిక సంఘాల్లో, సొంతపక్షంలో, విపక్షంలో, ప్రజలందరిలోనూ ఏకాభిప్రాయాన్ని అలవోకగా నింపాదిగా సాధించి చట్టబద్ధరీతిలో ఇలాంటి సంస్కరణల్ని సాధించటం సాదాసీదా విషయం కాదు. ఎంతో జీనియస్ కావాలి. పాలనా కళను పీవీ నుంచి నేటి తరం నేర్చుకోవాలి. ఇంత శాంతియుతంగా ఇంత పెద్దమార్పును, బలమైన ప్రభుత్వం లేకుండా తెచ్చే ప్రయత్నం ప్రపంచంలో మరే దేశంలోనూ జరగలేదు. ఆర్థిక సంస్కరణలు కావచ్చు, విదేశీ వ్యవహారాలు కావచ్చు, అణ్వాయుధాల వంటి సంచలన విషయాలు కావచ్చు.. నా పేరు కన్పించాలని తపించకుండా, నా దేశం కోసం కొన్ని లక్ష్యాలు నెరవేరాలనే ఉద్దేశంతో నిరాడంబరంగా వెనకాల ఉంటూ సంయమనాన్ని పాటించి కీర్తిని వేరేవారికిచ్చి... సమాజంలో భయాందోళనలు లేకుండా చేసి... అద్భుతమైన చాతుర్యాన్ని, దూరదృష్టిని, దేశభక్తిని ప్రదర్శించారాయన! అంచనాలకు మించి విజయం సాధించారు. ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు సాధించిన విజయాల్ని ఆయన కంటే ఎక్కువ ప్రజాదరణ, బలమైన ప్రభుత్వం ఉన్న నాయకులు కూడా సాధించలేదంటే అతిశయోక్తి కాదు. అయితే పీవీ కృషి ఇప్పటికీ అసంపూర్ణంగా ఉంది. నరసింహారావు ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చిన మానవ వనరుల అభివృద్ధి వైఫల్యాన్ని ఆయన తర్వాత 1996 నుంచి వచ్చిన ప్రభుత్వాలు కూడా పరిష్కరించే ప్రయత్నం లేదు. పీవీ అసంపూర్ణ కృషిని కొనసాగించాల్సిన, ఆర్థిక సంస్కరణల ఫలాల్ని చిట్టచివరి పౌరురాలు కూడా అందుకునేలా చేయాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది. ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను అందించటం, పేదరికాన్ని తొలగించటం మన లక్ష్యం కావాలి. తాత్కాలిక తాయిలాలు, అసంబద్ధ ఉచితాల నుంచి.. మానవ వనరులను అభివృద్ధి చేసే నాణ్యమైన ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాల తొలగింపు ఎజెండా వైపు మనం మళ్లాలి. మన కంటే చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో అధికార వికేంద్రీకరణ ఎక్కువగా ఉంది, స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉన్నాయి. కేంద్రీకృత పాలన నుంచి మన దేశంలో అధికారాన్ని వికేంద్రీకరించాలి. పీవీ నరసింహారావుగారి శతజయంతి వేళ నిజమైన నివాళి ఇదే.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

(పీవీ శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాల కమిటీ, తెలంగాణ సాహిత్య అకాడమీ నిర్వహించిన 'పీవీ: ఛేంజ్ విత్ కంటిన్యుయిటీ' డాక్యుమెంటరీ సిరీస్ ప్రసారం సందర్భంగా చర్చా కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. వీడియోని జేపీ సోషల్ మీడియా ఖాతాల్లో చూడవచ్చు)

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 24 | సంచిక 07 | జూలై 2021

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




మన యూనివర్సిటీ పూర్వ విద్యార్థట!
ఆరేళ్లుగా ఉద్యోగం లేక
మన ఐడియానే ఫాలో అవుతున్నాడు!!


కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# విద్యారంగంలో కొత్త సవాళ్లు

కరోనా మహమ్మారి తెచ్చిపెట్టిన పెను సవాళ్లతో ప్రపంచవ్యాప్తంగా విద్యారంగం సతమతమవుతోంది. మూడోవేవ్ ముప్పు పొంచి చూస్తున్న నేపథ్యంలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నది. విద్యాసంస్థల్ని తెరవడానికి ప్రభుత్వాలు తటపటాయిస్తున్నాయి. అడ్మిషన్లు, బోధన, పరీక్షలు వంటి సాధారణ విద్యా ప్రక్రియలు తీవ్ర అవరోధాలను, అంతరాయాల్నీ ఎదుర్కుంటున్నాయి. భారతదేశంలో దాదాపు 32కోట్ల మంది విద్యార్థులు తరగతి గదులకు దూరం అయ్యారు. ప్రపంచవ్యాప్తంగా వీరి సంఖ్య 150కోట్ల వరకూ ఉంటుందని యునెస్కో అంచనా వేసింది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని, భౌతికదూరం పాటించడం కోసం తరగతి గదుల్లో జరిగే ప్రత్యక్ష బోధనను రద్దు చేయడం తప్పనిసరి అయ్యింది. ప్రత్యక్ష బోధనకు ప్రత్యామ్నాయంగా డిజిటల్, ఆన్‌లైన్ బోధనాభ్యసన ప్రక్రియల వైపునకు విద్యారంగాన్ని మరలించే ప్రయత్నం ప్రారంభం అయ్యింది. టీవీ, రేడియో, కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ వంటి సాధనాల సహాయంతో బోధనాభ్యసన ప్రక్రియ కొనసాగించారు. అయితే డిజిటల్ ఆన్‌లైన్ బోధన అరకొరగానే ఉందని గత విద్యాసంవత్సర అనుభవం తేటతెల్లం చేసింది.

అమెరికాలో డిజిటల్ బోధన ప్రభావాన్ని అధ్యయనం చేసిన మెకెన్సీ సంస్థ అక్కడి పిల్లలు అభ్యసనంలో ఆరు నుండి ఎనిమిది నెలల వెనుకబాటులో ఉన్నారని వెల్లడించింది. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం డిజిటల్ విద్య పెద్దగా ప్రభావం చూపలేకపోతే వెనుకబడిన దేశాల్లో పిల్లలకు జరిగే నష్టాన్ని సులువుగానే అంచనా వేయవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో గత విద్యా సంవత్సరంలో దాదాపు 120 రోజుల పాటు ప్రత్యక్ష తరగతులు నిర్వహించారు. మిగిలిన రోజుల్లో డిజిటల్ బోధనను కొనసాగించారు. పరీక్షలను రద్దు చేయడంతో పిల్లల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయడం సాధ్యం కాలేదు. సాధారణ పరిస్థితుల్లోనే మన పిల్లల భాషా, గణిత సామర్థ్యాలు అంతంత మాత్రంగా ఉంటున్నాయన్న సంగతి తెలిసినదే. ప్రస్తుత ప్రత్యేక పరిస్థితుల్లో పిల్లల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయగల సామర్థ్యం మన విద్యా యంత్రాంగానికి లేదు. దాంతో డిజిటల్ విద్య ప్రభావం ఎంతో చెప్పలేని పరిస్థితి తలెత్తింది.

విద్యారంగ సమస్యల్ని అధ్యయనం చేసే ప్రథమ్ వంటి స్వచ్ఛంద సంస్థలు విడుదల చేసిన నివేదికలు మనకు అందుబాటులో ఉన్నాయి. జాతీయ నమూనా సర్వే, పాఠశాల విద్యాశాఖ సేకరించే గణాంకాలు, యునెస్కో అధ్యయనాలు కరోనా తెచ్చి పడేసిన పలురకాల వ్యత్యాసాల గురించి చర్చించాయి. కొత్త సవాళ్లను కొత్త పద్ధతుల్లో ఎదుర్కోవాలని సూచించాయి!

విద్యార్థుల లింగ, వయో, ప్రాంతీయ, జాతి, మతం, భాష, ఆర్థిక, అసమానతలు కరోనా కాలంలో మరింత పెరిగాయని యునెస్కో 'జెమ్-2020' నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. 209 దేశాల్లో నిర్వహించిన ఒక అధ్యయనంలో అల్పాదాయ దేశాలు పిల్లల విద్యావసరాలను నిర్లక్ష్యం చేసినట్లు వెల్లడయ్యింది. దాదాపు 40శాతం దేశాల్లో బడుల మూసివేత వల్ల పిల్లలు చదువుకు దూరమయ్యారనీ, వారిలో ఎందరు తిరిగి బడిలోకి వస్తారో చెప్పలేమని యునెస్కో పేర్కొన్నది.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో 5-19 వయోవర్గంలో 75శాతం మంది గత సంవత్సరం నమోదు కాలేదని, అందులో బాలికలే ఎక్కువ ఉన్నారని వెల్లడయ్యింది. వలసల కారణంగానూ, అభివృద్ధి పేరున జరిగిన విధ్వంసం కారణంగానూ పేదల కుటుంబాల పిల్లలు బడికి దూరమయ్యారని కూడా వెల్లడయ్యింది.

మన దేశంలో కేవలం పదిశాతం చేతుల్లో 76శాతం సంపద పోగుపడిందని చెప్పిన ఆక్స్‌ఫామ్ అధ్యయనం 'విద్యారంగంలో ఆర్థిక అసమానతలు పిల్లల సామర్థ్యాలను దెబ్బతీస్తున్నాయని' స్పష్టం చేసింది. మనదేశంలో డిజిటల్ విద్య అవాస్తవికమైన కల్పనగా మిగిలిపోతున్నది. 75శాతం విద్యార్థులు డిజిటల్ విద్యను అందుకోవడంలో రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. కంప్యూటర్లు 8శాతం ఇళ్లలోనే ఉన్నాయి. నెట్ సదుపాయం గ్రామీణ ప్రాంతాల్లో 15శాతం గృహాలకే ఉంది. నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండే గృహాల సంఖ్య 47శాతం మాత్రమే. ఇంటర్నెట్ అందుబాటులో ఉన్న కుటుంబాల సంఖ్య తక్కువ అనుకుంటే వాటిలో 50శాతం గృహాలకు సిగ్నల్ బలహీనంగా ఉండటంతో ప్రయోజనం నెరవేరడం లేదు. జార్ఖండ్‌లో గత సంవత్సరం విద్యార్థుల అభ్యసనం అంతకుముందు సంవత్సరం కంటే 40శాతం దిగజారిందని ఒక అధ్యయనం వెల్లడించింది.

ఈ పరిస్థితుల్లో విద్యారంగ సమస్యల్ని కొత్త పద్ధతుల్లో పరిశీలించాల్సి ఉంది. తరగతి గదుల ప్రత్యక్ష బోధనకు ప్రత్యామ్నాయం లేనప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త అవకాశాలను అన్వేషించాలి. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు, ప్రైవేటు రంగం, స్వచ్ఛంద సంస్థలు ఒక సమీకృత ప్రయత్నం చేయాలి. పిల్లలందరూ విద్యారంగంలో కొనసాగడానికి అనువుగా వ్యత్యాసాలు లేని బహుళ పద్ధతులు రూపకల్పన చేయాలి. ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల భాగస్వామ్యం కొనసాగేటట్లు చూడాలి.

డి. సోమసుందర్

# సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇవ్వాలి..

## అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం ఉచితంగా అందించాలి!






కొవిడ్-19 వ్యాధి బారిన పడినవారు జనాభా శాతం లెక్కన చూస్తే భారత్‌లో తక్కువే కావచ్చు.. కానీ రెండో దశ తర్వాత ఆ మహమ్మారి దుష్ప్రభావం తాకని వారెవరూ దేశంలో లేరంటే అతిశయోక్తి కాదేమో. మనకు బాగా తెలిసినవారు మరణించటమో, మనమో, మనకు దగ్గరివారో కొవిడ్ బారినపడి ఆస్పత్రి ఖర్చుల వల్ల ఆర్థికంగా అల్లకల్లోలమవటమో, కొవిడ్ నుంచి కోలుకున్నా తర్వాతి సమస్యలు ఎదుర్కొంటూండటమో, ఉపాధి అవకాశాలు కోల్పోవటమో, ఆదాయాలు తగ్గటమో, కొత్త పద్ధతుల్లో పనిచేయాల్సి రావటంతో ఒత్తిడినెదుర్కోవటమో, మానసిక సమస్యలో.. ఇలా ఏదోకరకంగా కరోనా మనందరినీ తాకింది. మొదటి దశలో మరణాలు భయపెడితే, రెండో దశ పరిణామాలు మృత్యు భయాన్ని మించి ఎంతో మానసిక వేదన, బాధను కలిగించాయి. ఆర్థిక కల్లోలం రెండు దశల్లోనూ తీవ్రంగానే కొనసాగింది. ఈ విషాదాల్లోనూ పెనువిషాదాలు కొన్ని ఉన్నాయి. కొంతమంది పిల్లలు తల్లినీ తండ్రినీ కోల్పోవటం, వారిలో కొందరు ఆదుకునేవారెవరకూ లేని అనాథలుగా మారటం కదిలించే విషాదం. కొవిడ్ రెండో అల ఉధృతంగా సాగుతున్నా సరే ఈ సవాలుపై సమాజం చొరవగా స్పందించింది.

కొన్నిచోట్ల ప్రభుత్వాల కంటే మిన్నగా కొవిడ్ బాధితులకు సహాయ సహకారాలనందించిన యువత, ఇతర పౌరులు.. అనాథ పిల్లలకు తక్షణ సాయం అందించేందుకు ముందుకొచ్చారు. ఇంకొందరు ఆ పిల్లల్ని దత్తత తీసుకుంటామని ప్రకటించారు.

తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లలెందరోనన్న దృష్టి కొవిడ్ మొదటి దశలో పెద్దగా కలగలేదుగానీ రెండో దశలో మాత్రం సమాజాన్ని కదిలించింది. దీంతో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్పందించనారంభించాయి. మధ్యప్రదేశ్ ప్రభుత్వం కొవిడ్ వల్ల అనాథలైన పిల్లలకు నెలకు రూ.5,000 పింఛను, ఉచిత స్కూలు, కాలేజీ చదువులు అందిస్తామని ప్రకటించింది. ఆ పిల్లలు బంధువుల వద్ద ఉండే అవకాశాలు లేకుంటే, ఉచిత రేషను, సురక్షిత వసతి కూడా ఏర్పాటు చేస్తోంది. పిల్లలకు 24 ఏళ్లు వచ్చే వరకూ ఆ మద్దతు కొనసాగుతుంది. మార్చి 1 నుంచి జూన్ 30 వరకు కొవిడ్ ద్వారా కాకుండా ఇతర కారణాల వల్ల తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లలకు కూడా ఈ సహాయాన్ని ఎంపీ ప్రభుత్వం అందిస్తోంది. ప్రయివేటు వ్యక్తులకు కూడా ఇందులో భాగస్వామ్యం కల్పించే స్పాన్సర్‌షిప్ పథకాన్ని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రారంభించింది. కొవిడ్ అనాథ పిల్లల్లో ఒకరి బాగోగులు చూడటానికి నెలకు రూ.2,000 ఎవరైనా సాయంగా అందించవచ్చు. అలాగే కరోనా కారణంగా తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లలకు బ్యాంకులో రూ.10 లక్షలు తక్షణమే ఫిక్సడ్ డిపాజిట్ చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. పిల్లలకు 25 ఏళ్లు వయసొచ్చాక ఆ మొత్తం వారికి అందజేస్తారు. అయితే వైపరీత్యాలలో దోపిడీ అవకాశాల్ని వెతుక్కునే దుష్టశక్తుల కదలికలు కన్పించటం, మీడియా ఆ విషయాల్ని విస్తృతంగా ప్రచారం చేయటం, న్యాయస్థానం కూడా ఆదేశాలు జారీ చేయటంతో యూనియన్ ప్రభుత్వం కూడా వేగంగా స్పందించింది. కొవిడ్ వల్ల తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లల భవిష్యత్తుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. పీఎం కేర్స్ పేరుతో సేకరించిన నిధుల నుండి వారిని ఆదుకోవాలని, అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహమ్మారి వల్ల తల్లిదండ్రులు మరణించిన పిల్లలు ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షల కార్పస్ నిధిని కేటాయిస్తామని ప్రకటించింది. వారి చదువులు పూర్తయ్యేదాకా ఉచిత విద్యను అందిస్తారు. ఈ చిన్నారులు పెద్దయ్యాక.. 18-23 ఏళ్ల మధ్య కార్పస్ ఫండ్ నుంచి నెలకు కొంత మొత్తంలో స్టయిఫండ్‌గా అందచేస్తారు. వారికి 23 ఏళ్లు వచ్చాక ఫండ్

మొత్తాన్ని సొంత అవసరాలకు లేదా ఉపాధికి తీసుకోవచ్చు. ఈ పిల్లలందరికీ ప్రాథమిక విద్యను ఉచితంగా అందజేస్తారు. వారికి కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఒకవేళ ప్రయివేటు స్కూళ్లలో చదువుకుంటుంటే, పీఎం కేర్స్ నిధుల నుంచే విద్యాహక్కు చట్టం నిబంధనల మేర ఫీజుల్ని చెల్లిస్తారు. యూనిఫారాలు, పుస్తకాలకు డబ్బు ఇస్తారు. హైస్కూలు చదువునూ ఉచితంగా అందచేస్తారు. నవోదయ స్కూళ్లు, జాతీయస్థాయి ప్రభుత్వ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, పబ్లిక్ స్కూళ్లలో చదువుకునేందుకు అవకాశం కల్పిస్తారు. సంరక్షకుని వద్ద ఉండి చదువుకునేవారికి ఫీజులు చెల్లిస్తారు. పుస్తకాలు, యూనిఫారాలను ఉచితంగా సరఫరా చేస్తారు. ఆ తర్వాత వృత్తి విద్యను, ఉన్నతవిద్యను చదవాలనుకుంటే అందుకు కూడా స్కాలర్‌షిప్పుల రూపంలో ఫీజులకు ఆర్థికసాయాన్ని అందిస్తారు. వృత్తి విద్య కోర్సులు చదువుకునేందుకు విద్యారుణం తీసుకుంటే వడ్డీని పీఎం కేర్స్ నుంచే చెల్లిస్తారు. చిన్నారులందరికీ ఆయుష్మాన్ భారత్ లేదా ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకాన్ని వర్తింపచేస్తారు. దీనివల్ల వీరందరికీ రూ.5 లక్షల ఆరోగ్యబీమా వర్తిస్తుంది. ఈ పిల్లలకు 18 ఏళ్లు నిండే వరకు ఆరోగ్య పథకాలకు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాలను పీఎం కేర్స్ నుంచి చెల్లిస్తారు. ఇదే సమయంలో ఇంకొన్ని రాష్ట్రాలు కూడా సహాయాల్ని ప్రకటించాయి. కర్ణాటక, గుజరాత్, అసోం ప్రభుత్వాలు ప్యాకేజీలు ప్రకటించాయి. యూపీ సర్కారు నెలకు రూ.4 వేలు అందజేస్తామని తెలిపింది. కరోనాతో తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరినీ కోల్పోయిన బాలికలకు పెళ్లి సమయంలో రూ.1.01 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. హర్యానా ప్రభుత్వం కూడా పిల్లలకు 18 ఏళ్లు వచ్చే దాకా నెలకు రూ.2,500 ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. సంరక్షకులు లేనివారిని గురుకులాల్లో చేర్పిస్తామని, అలాంటి వారి పేరిట రికరింగ్ డిపాజిట్ తెరిచి నెలకు రూ.1,500 జమ చేస్తామని తెలిపింది. బాలికలు పెళ్లి చేసుకునే సమయానికి రూ.51,000 అదనపు సాయాన్ని ప్రకటించింది. కర్ణాటక ప్రభుత్వం నెలకు రూ.3,500 సాయంతోపాటు ఆడపిల్లల పెళ్లికి రూ.లక్ష ఇస్తామని తెలిపింది. తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లల పేరిట రూ.5 లక్షలు డిపాజిట్ చేయాలని, డిగ్రీ వరకు ఉచిత విద్యను అందించాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి పిల్లలకు ఉచిత విద్యనందిస్తామని, అనాథ ఆశ్రమాల్లో కాకుండా బయట ఉండాలనుకునే పిల్లలకు ప్రతి నెలా రూ.3,500 ప్రతి నెలా 18 ఏళ్లు నిండేవరకూ సాయం అందిస్తామని త్రిపుర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణలో కూడా మహిళా శిశు సంక్షేమ శాఖ ఇటువంటి చిన్నారుల భద్రతకు చర్యలు ప్రారంభించింది. వారిక తక్షణ పునరావాస సౌకర్యం, ఆహార, ఆర్థిక సహాయాల్ని అందిస్తోంది. పిల్లల చదువుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా ఇందులో కలిసి వస్తున్నారు.

ఇలా తల్లిదండ్రుల్ని కోల్పోయిన వారి సంఖ్య ఎంతో స్పష్టంగా తెలియకపోయినా, కరోనా మొదటి దశ నుంచి ఇప్పటివరకు అనాథ పిల్లలు లేదా తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరిని కోల్పోయిన వారి సంఖ్య వేలల్లో ఉంటుందని బాలల హక్కుల పరిరక్షణ జాతీయ సంఘం (ఎన్‌సీపీసీఆర్) సమర్పించిన నివేదిక, ఇతర కొన్ని సంస్థల గణాంకాలను బట్టి తెలుస్తుంది. ఎన్‌సీపీసీఆర్ నివేదిక కరోనా వల్లే కాకుండా మరణాలు ఏ కారణంగా జరిగినా పరిగణలోకి తీసుకుంది. చాలాచోట్ల కొవిడ్ మృతుల నమోదు సక్రమంగా లేదన్న సమాచారం నేపథ్యంలో ఇది అవసరం కూడా. ఈ లెక్కల్లోకి రాని బాధిత పిల్లలు కూడా భారీ సంఖ్యలో ఉంటారనే అంచనాల నేపథ్యంలో, అటువంటి వారిని కూడా వెతికిపట్టుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, బాలల సంక్షేమ కమిటీల ద్వారా జల్లెడ పట్టాలి. బాలల మానసిక పరిణతి దృష్ట్యా దీర్ఘకాలిక చర్యలతోపాటు తక్షణ ఉపశమనం, సాయం మీద కూడా ఎక్కువ దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి కంటే బడి మేలు అనే తప్పని పరిస్థితుల్లో మినహాయిస్తే.. తల్లిదండ్రులకు దూరంగా చిన్న వయసులో పేరున్న గురుకుల పాఠశాలల్లో అయినా పిల్లల్ని చదివించటం వల్ల పిల్లల్లో ఉద్వేగ ప్రజ్ఞ, కుటుంబ బాంధవ్యాలు, సామాజిక సంబంధాల్లో ఆరోగ్యకరమైన వికాసం లోపించే అవకాశముందని విశ్లేషణలు చెబుతున్నాయి. కాబట్టి అనాథ బాలల పట్ల తగు జాగ్రత్తలతో సరైన వాతావరణముండేలా విధానాలు రూపొందించి అమలు చేయాలి. ఈ పిల్లలకు యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు, సమాజం అందిస్తున్న తక్షణ, దీర్ఘకాల సాయం పూర్తిస్థాయిలో సక్రమంగా అందాలని, వీరిలో ఏ ఒక్కరికీ జీవితం పట్ల నిరాశ, సమాజం పట్ల ద్వేషం కలగదని, అందరూ ఆరోగ్యకరమైన రీతిలో వికసిస్తారని ఆశిద్దాం. కానీ సమస్య ఈ వేలమందికి లేదా ఇంకొందరికే పరిమితం కాదు.

కోట్లమంది జీవితాలు కరోనా తాకిడికి చిగురుటాకుల్లా వణికిపోయాయి. వారందరి పిల్లల శక్తిసామర్థ్యాలు వికసించటంపైనా ఈ దుష్ప్రభావం ఉంటుంది. కొవిడ్ వల్ల 3 కోట్ల మంది పైగా మధ్యతరగతివారు పేదరికంలోకి జారిపోయారు. తొలి లాక్‌డౌన్ ఆర్థిక కష్టాలు, ఆరోగ్య ఖర్చులభారం నుండి కోలుకోకముందే.. ప్రజారోగ్యం, వ్యాక్సిన్ల అందుబాటు పట్ల పాలకుల నేర సమాన నిర్లక్ష్యం వల్ల ఒక్కసారిగా విరుచుకుపడిన రెండో దశ కరోనా వల్ల పేదరికం సునామీలా పెరిగింది. 2020లో లాక్‌డౌన్ వల్ల దేశవ్యాప్తంగా పది కోట్ల మంది ఉపాధి కోల్పోగా, జూన్ నాటికి సుమారు కోటిన్నర మంది గతంలో తాము చేసిన పనులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. లాక్‌డౌన్‌కు ముందు 2020 జనవరి నాటికి నలుగురు సభ్యులున్న కుటుంబంలో తలసరి ఆదాయం రూ.5,989గా ఉంటే, అక్టోబర్ నాటికి రూ.4,979కి పడిపోయిందని అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయ నివేదిక వెల్లడించింది. లాక్‌డౌన్‌కి ముందు క్రమం తప్పకుండా వేతనాలు పొందినవారిలో సగం మంది ఆ తర్వాత అసంఘటిత రంగంలో

చేరారు. లాక్‌డౌన్‌కి ముందు ఉద్యోగ భద్రతతోపాటు క్రమం తప్పకుండా వేతనాలు పొందినవారిలో 30 శాతం మంది లాక్‌డౌన్ తర్వాత స్వయంఉపాధి వెతుక్కోగా, మరో 9 శాతం మంది నామమాత్రపు వేతనం లభించే ఉద్యోగాల్లో చేరారు. విద్య, సేవా రంగాలలో ఉన్నవారు ఉపాధి కోసం వ్యవసాయం, భవన నిర్మాణ రంగాల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. అత్యుత్తములు చేరాల్సిన రంగాల్లో ఒకటిగా భావించే ఉపాధ్యాయ వృత్తిలో ఉండాల్సిన అంకితభావం వీరిలో పలువురికి ఇప్పటికే ఇంకిపోయింది. ఆదాయమే తొలి ప్రాధాన్యంగా ఉపాధి అవకాశాల వైపు చూస్తున్నారు. కరోనా కాలంనాటికే పేదలుగా ఉన్నవారి పరిస్థితయితే మరీ దయనీయంగా మారింది. 2020 ఏప్రిల్, మే నెలల్లో దాదాపు 20 శాతం నిరుపేదలు పూర్తిగా తమ ఆదాయాన్ని కోల్పోయారు. మహిళా కార్మికుల్లో 47 శాతం శాశ్వతంగా ఉపాధిని కోల్పోయారు. దేశంలో 50 కోట్ల మంది శ్రమశక్తి ఉంటే, వారిలో 45 కోట్ల మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారు. లాక్‌డౌన్‌కు ముందున్న పరిస్థితులతో పోలిస్తే కనీస వేతనం (రోజుకు రూ.375) కంటే తక్కువ పొందే వారి సంఖ్య లాక్‌డౌన్ తర్వాత 23 కోట్లకు చేరటంతో అసంఘటిత రంగంలోని వారు దుర్భర పరిస్థితుల మధ్య జీవనపోరాటం చేస్తున్నారు. ఈ పరిణామాలు గ్రామీణ ప్రాంతంలో 15 శాతం, పట్టణ ప్రాంతాల్లో 20 శాతం పేదరికం పెరిగేట్లు చేశాయని నివేదిక అంచనా వేసింది. కొవిడ్‌తో ఉపాధి అవకాశాలతోపాటు 90 శాతం కార్మికుల ఆదాయాలు తగ్గటం, మరో పది శాతం శాశ్వతంగా ఉపాధిని కోల్పోవటంతో జాతీయాదాయం (జీడీపీ)లో శ్రామికశక్తి వాటా 2019-20 రెండో త్రైమాసికంలో ఉన్న 32.5 శాతం నుంచి 2020-21 రెండో త్రైమాసికం నాటికి 27 శాతానికి పడిపోయింది. ఏదోక పని, తక్కువ వేతనాలతో సర్దుకోవాల్సి రావటంతో కార్మికుల నెలవారీ సగటు ఆదాయాల్లో 17 శాతం మేర తగ్గుదల ఏర్పడింది. పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలనందిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్‌ఎంఈ)ల్లో పలు సంస్థలు మూద్దామా, కొనసాగిద్దామా అనే రీతిలో ఊగిసలాడుతున్నాయి. వీటన్నిటికీ తోడు ఆరోగ్య వ్యయం. కేవలం ఆరోగ్య ఖర్చులు భరించలేక దేశంలో ఏటా 5 కోట్ల మందికి పైగా పేదలుగా మారటం ఒక విషవలయంగా కొనసాగుతూ వస్తోంది. కరోనా కాలంలో ఈ విషవలయం బాధితులు అనేకరెట్లు పెరిగారు.

కొవిడ్ తొలి దశ దాదాపు 80 శాతం మంది ప్రజల ఆదాయాల్ని ప్రతికూలంగా ప్రభావితం చేసింది. రెండో దశలో వచ్చిన కరోనాలో తీవ్రత ఉన్నా కఠిన గంపగుత్త లాక్‌డౌన్‌లు లేనందున ఆర్థికంగా మొదటి దశలోలా మరీ ఎక్కువ నష్టం కలిగించదన్న అంచనాలున్నప్పటికీ, నష్టం గణనీయంగానే ఉంటుందని పరిణామాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే గతేడాది కంటే ఎనిమిది శాతం దాకా కుంగి 2020-21లో స్థిర ధరల వద్ద రూ.134.09 లక్షల కోట్లు ఉంటుందనుకున్న దేశ జీడీపీ.. మహమ్మారి రెండో దశ వల్ల మరింత కుంగనుంది. ఉపాధి పరంగా ఈ దశ తీవ్ర ప్రభావం చూపిందని గణాంకాలు చెబుతున్నాయి. రెండో దశ తీవ్రత ఎక్కువగా ఉన్న మే మాసంలో నిరుద్యోగిత రేటు కొవిడ్ వైరస్ వేగంతో పోటీపడుతూ 14 శాతాన్ని దాటింది. దాదాపు 2 కోట్ల మంది ఈ నెలలో ఉద్యోగాలు కోల్పోయినట్లు భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షక సంస్థ (సీఎంఐఈ) అంచనా వేసింది. వీరిలో పలువురికి ఆ తర్వాత ఉపాధి లభించినా కూడా కరోనాకు ముందున్న స్థాయి ఆదాయం సమకూరటం వెంటనే సాధ్యం కాదు. తక్కువ ఆదాయానికి తోడు పెరిగిన నిత్యావసర ఖర్చులు వీరికి జీవితాల్ని దుర్భరం చేస్తున్నాయి. 90-97 శాతం కుటుంబాల వాస్తవ ఆదాయం క్షీణించిందని సీఎంఐఈ తెలిపింది.

గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్‌ను మించి శ్రామిక శక్తి సరఫరా, పట్టణ ప్రాంతాల్లో కొన్ని రంగాల్లో, పెద్ద సంస్థల్లో మినహాయించి డిమాండ్ పుంజుకోకపోవటం ఆదాయాల తగ్గుదల నుంచి కోలుకోవటానికి అవరోధాలుగా ఉన్నాయి. క్రమంగా డిమాండ్ పుంజుకున్నా కూడా ప్రజల ఉత్పాదక శక్తి పరంగా కూడా రెండో దశ దీర్ఘకాలిక దుష్ప్రభావం చూపే అవకాశముందని అంచనా. ఉపాధి కలిగినవారి శారీరక, మానసిక శక్తిపై, తద్వారా ఉత్పాదకతపై కొవిడ్ ప్రభావాన్ని బేరీజు వేయటం వంటివి తెమలటానికి, దిద్దుబాటు చర్యలకు సమయం పట్టవచ్చు.

ఈ నేపథ్యంలో కోట్లాది మంది పిల్లల భవిష్యత్తు అవకాశాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయి. తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లల స్థాయిలో వీరి పట్ల సానుభూతి, ఇతర చర్యలు అక్కర్లేదు.. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, నెలవారీ పింఛన్లు, సురక్షిత చర్యలు వంటివి వీరికి ఇవ్వనక్కర్లేదు.. కానీ కొవిడ్ కారణంగా ఉపాధి, ఆదాయ అవకాశాలు కోల్పోయిన లేదా తగ్గినవారి పిల్లలందరికీ సరైన రీతిలో ఎదిగే అవకాశాలకు ఇతరత్రా తోడ్పాటు లేకుంటే, రాబోయే కాలంలో ఈ దేశం పెను ఆర్థిక, సామాజిక కల్లోలాన్నే చూస్తుందనటంలో సందేహం లేదు.

కొవిడ్ తదనంతర పరిస్థితుల్ని ఎదుర్కోవటానికి కొత్త ఆలోచనలు చేయటం అవసరమని విశ్లేషకులు, పౌర సమాజ నేతలు కొందరు సూచిస్తున్నారు. ఇది పూర్తిగా స్వాగతించాల్సిన విషయం. తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో సంక్షేమం పేరుతో ప్రభుత్వ పథకాలు పేదరికాన్ని ఎలా కొనసాగిస్తున్నాయో, కోట్లాది ప్రజలను ఎలా విఫలం చేస్తున్నాయో కొవిడ్‌తో సంబంధం లేకుండా లోక్‌సత్తా తొలి నుంచీ చెబుతోంది. సంక్షేమానికి, అభివృద్ధికి వైరుధ్యంలేని నిర్దిష్ట ఎజెండాను సూచిస్తూ వస్తోంది.

కొత్త ఆలోచనలు అంటూ సంక్షేమానికి ఇప్పుడిస్తున్న నిర్వచనం పరిధిలోనే కొన్ని కార్యక్రమాలు చేపట్టి కొవిడ్ దుష్ప్రభావాల్ని ఎదుర్కొన్నామని ప్రచారం చేసుకునే ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలి. అలా చేస్తే ప్రజల్ని మరోసారి దగా చేయటమే అవుతుంది. సంక్షేమానికి నిర్వచనం మార్చాలి. కొవిడ్ బాధితుల్ని ఆదుకునేందుకు తక్షణ సాయంగా నగదు,

ఆహారధాన్యాలు వంటివి వీలైనంత ఎక్కువగా, వేగంగా అందిస్తూనే, ఉపాధి హామీ వంటి కార్యక్రమాల్ని అమలు చేస్తూనే వారి జీవితాల నుంచి కొవిడ్ విషాద, చేదు ప్రభావాలను తొలగించగల చర్యల్ని ప్రారంభించాలి. ఇందుకు పాత తరహా సంక్షేమం పనికిరాదు. ప్రతి బిడ్డకూ నాణ్యమైన, ప్రపంచంలో ఎవరితోనైనా పోటీపడే శక్తినిచ్చే పాఠశాల విద్యను (12వ తరగతి వరకు) ఉచితంగా అందించటం – ఆ తర్వాత పైచదువుల పట్ల ఆసక్తి ఉంటే స్కాలర్‌షిప్పులు, రాయితీలు, సులభ రుణాల రూపంలో ప్రభుత్వం తోడ్పాటునందించటం, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని ఉచితంగా అందించటం.. సంక్షేమంలో భాగం కావాలి. వైద్య చికిత్సల వల్ల తల్లిదండ్రులు పేదరికంలోకి జారిపోకుండా ఉంటేనే, పిల్లలకచదువులో, ఎదుగుదలలో అండగా నిలవగలుగుతారు కాబట్టి.. మొత్తం కుటుంబంలోని వారందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి. బతకటానికి కూడా ప్రభుత్వాన్ని అర్థించేవారుగా కాకుండా, ప్రజాస్వామ్యంలో ప్రభువుల్లా ప్రజలు తలెత్తుకునే ఎదిగేలా మానవ వనరుల అభివృద్ధి నూతన సంక్షేమ విధానం కావాలి.

ఇప్పుడున్న సంక్షేమంలో తాత్కాలిక తాయిలాలు, ప్రలోభపెట్టే పంచుళ్లు తప్ప నాణ్యమైన విద్య, ఆరోగ్యాలకు అవకాశం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనే ఉదాహరణగా తీసుకుందాం. జగన్ బాబు రెండేళ్ల పాలనపై మే 30, 2021న వైకాపా అగ్రనేతలు ప్రకటనలు విడుదల చేశారు. తమ ఎన్నికల మేనిఫెస్టోలోని 129 వాగ్దానాలకు గాను 107 వాగ్దానాల్ని (94.5%) పూర్తిగా అమలు చేశామని, మరో 15 వాగ్దానాల అమలు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయని, కేవలం 7 వాగ్దానాలు మాత్రమే ఇంకా చేయాల్సి ఉన్నవని అందులో తెలిపారు. ఈ వాగ్దానాల అమలులో భాగంగా ప్రత్యక్షంగా రూ.95,528.50 కోట్లు, పరోక్షంగా రూ.36,197.05 కోట్లు, మొత్తంగా రూ.1,31,725.55 కోట్లు ప్రజలకు బదిలీ చేసినట్లు తెలిపారు. వీటిలో విద్యాపథకాలు కూడా ఉన్నాయి. జగనన్న అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యాదీవెన ఇలా ఓ అరడజను పథకాలున్నాయి. మన దేశ విద్యారంగంలో ప్రధాన సమస్య పాఠశాల విద్య అధ్వాన్నంగా ఉండటమే కాబట్టి, ఆ పునాది అంశాన్నే తీసుకుందాం. జగనన్న అమ్మఒడికి రూ.13,022.93 కోట్లు, జగనన్న విద్యాకానుకకి రూ.647.85 కోట్లు ప్రజలకు ఇచ్చినట్లు చెప్పారు. అయితే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచికపై ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన 2020–21 నివేదికలో.. నాణ్యమైన విద్యలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 19వ స్థానంలో నిలిచింది. నాణ్యమైన విద్యకు 11 అంశాలు ప్రామాణికంగా స్కోరును కేటాయించారు. ఆంధ్రప్రదేశ్‌కి 50 పాయింట్లు వచ్చాయి. గతేడాది (2019–20) నివేదికలో 52 పాయింట్లతో 18వ స్థానంలో నిలవగా.. ఈసారి 19వ స్థానానికి దిగింది. నాణ్యమైన విద్యలో 100 పాయింట్లకు కేరళ 80 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. నీతి ఆయోగ్ నివేదిక రాకముందే.. విద్యారంగంలో ప్రామాణిక కృషి చేస్తున్న కొందరు రాజకీయ ఉద్యమకారులు, పౌర సమాజ నేతలు ఆంధ్రప్రదేశ్‌లో విద్యాప్రమాణాల గురించి హెచ్చరించారు.

విద్యకి డబ్బివ్వటం తప్పు కాదు.. కానీ నాణ్యమైన విద్యను అందించకుండా విద్య పేరుతో ప్రజలకు డబ్బు ఇవ్వటం వల్ల ఉపయోగమేంటి? దాన్ని పందేరం, ఓట్ల కోసం ప్రజాధనం దుర్వినియోగం అంటే తప్పేంటి? నిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాఠశాల విద్య కోసం ఒక్కో విద్యార్థి మీద చేస్తున్న ఖర్చు అమ్మ ఒడి, నాడు–నేడు వంటివన్నీ కలుపుకుంటే.. ఏడాదికి సుమారు రూ.85,000 ఉంటుంది. ఒక మంచి ప్రయివేటు స్కూలులో విద్యార్థి కోసం తల్లిదండ్రులు కట్టే ఫీజుకి ఇది రెండు మూడు రెట్లు ఎక్కువ. అయినా పిల్లల్లో అత్యధికులకు మాత్రం నాణ్యమైన చదువు లభించటం లేదు. ఈ పంచుడు సంక్షేమాన్ని ఇప్పటికైనా మానవ వనరుల అభివృద్ధి సంక్షేమంగా మార్చాలి.

మరోవైపు వైఎస్ జగన్ ప్రభుత్వం అనుత్పాదక రీతిలో ఇలా పంచిన డబ్బంతా ఒక్క కరోనా ఆరోగ్య ఖర్చుల దెబ్బకే కొట్టుకుపోయింది. ఉచితాలు ఊడబొడుస్తాయని భ్రమించినవారు ఆస్పత్రి ఖర్చులకు అదనంగా అప్పులు కూడా చేయాల్సి రావటంతో అలో మంటున్నారు.

ఉచితాల్ని, పరిమితమైన ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింప చేస్తూ ఇదే అద్భుతమైన పాలన అని నమ్మించాలనుకుంటే ఏం జరుగుతుందో కరోనా కొన్ని నెలల్లోనే చూపింది. ఈ విపత్తు రాకముందే మేల్కొనే విజ్ఞతను, పాలనా, రాజకీయ దూరదృష్టిని పాలకులు ప్రదర్శించకపోవటం వల్ల ప్రజల్లో పలువురు వైద్య చికిత్సల కోసం ఆస్తుల్ని కూడా అమ్ముకున్నారు. నివారించదగ్గ మరణాలు చోటుచేసుకున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో అనుత్పాదకంగా డబ్బులు పందేరం చేయటం వల్ల ఆరోగ్యానికి తగినన్ని నిధుల్ని కేటాయించకపోవటం, కేటాయించినవాటిని కూడా సక్రమంగా వినియోగించకపోవటం వల్ల ఈ పెను నష్టం సంభవించింది. కాస్త అటూఇటుగా తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వానికి, పలు ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలకు కూడా ఇదే విశ్లేషణ వర్తిస్తుంది (రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో ప్రభుత్వ పథకాలు, శాఖల క్రియాశీలతపై యువ నిపుణులతో క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన, విశ్లేషణ చేయించనున్నట్లు తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ ప్రకటించారు. నివేదికలోని అంశాలు తమ అభీష్టానికి వ్యతిరేకంగా ఉంటే స్వీకరిస్తారో, లేదా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సద్విమర్శలను తోసిపుచ్చినట్లు చేస్తారో వేచి చూడాలి). అందువల్లే.. కొందరు సామాజిక రచయితలు చెప్పినట్లు, దేశంలో వందేళ్ల క్రితం స్పానిష్ ఫ్లూలో చోటుచేసుకున్న పలు విషాద దృశ్యాలు కొవిడ్ కాలంలోనూ కనిపించాయి. కరోనా పాఠాల నేపథ్యంలోనైనా ప్రతి సంక్షేమ పథకాన్నీ పునస్సమీక్షించాలి, పునర్నిర్వచించాలి.

నూతన సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఇంతకుముందే చెప్పుకున్నట్లు ప్రధానంగా ప్రతి బిడ్డకూ పాఠశాల స్థాయి వరకూ నాణ్యమైన విద్యను, ప్రతి కుటుంబానికీ ఏ స్థాయిలోనైనా, ఏ జబ్బుకైనా మంచి ప్రమాణాల ఆరోగ్యాన్నీ ఉచితంగా అందించాలి. ప్రభుత్వ, ప్రయివేటు అని తేడా లేకుండా ఎక్కడ చదివినా, ఎక్కడ వైద్యం తీసుకున్నా ఆ బాధ్యత ప్రభుత్వానిదే. కులం, మతం, ప్రాంతం, డబ్బుతో ప్రమేయం లేకుండా అందరికీ ఇలా నాణ్యమైన పాఠశాల విద్య, ఆరోగ్యం అందించే ఏర్పాటు వల్ల సమాజం మీద చాలా భారం తగ్గుతుంది. ఇది పూర్తిగా ఆచరణసాధ్యం. పాఠశాల విద్యలో ప్రభుత్వ – ప్రయివేటు భాగస్వామ్యం అమలుకు ఒక పరిష్కారాన్ని ఇప్పటికే లోక్‌సత్తా జేపీ సూచించారు. మంచి విద్యను అందించే ప్రయివేటు పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నెలకు రూ.1000 – 1500 అందించే ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు వనరుల సమస్య లేకుండా కూడా మార్గం చూపారు.

ప్రభుత్వం ఈ పని చేయగలిగితే.. కొవిడ్ సమయంలో, కొవిడ్ రాకముందు కూడా అనాథలైనవారు, ఎటువంటి ఆదరణకు నోచుకోనివారు, నిరుపేదలు, తక్కువ ఆదాయం ఉన్నవారు, కష్టపడి పంట పండించినా నష్టాల్లో నలిగిపోతున్న కోట్లాది మంది రైతులు.. ఇలా అందరూ హాయిగా ఊపిరి పీల్చుకోగలుగుతారు. వీధి బాలల్ని, బాలయాచకుల్ని సంస్కరించటానికి, భ్రష్టుపట్టిన అనాథ బాల శరణాలయాల్ని ప్రక్షాళన చేయటానికి మార్గం ఏర్పడుతుంది. బాలకార్మికుల్ని (దేశంలో ఇప్పటికే కోటి మందికి పైగా బాలకార్మికులున్నారని, కొవిడ్ కారణంగా రాబోయే కాలంలో వీరి సంఖ్య పెద్దఎత్తున పెరిగే ప్రమాదముందని అంతర్జాతీయ కార్మిక సంస్థ, యూనిసెఫ్ నివేదిక తెలియజేస్తోంది) కూడా డ్రాపవుట్లు లేకుండా విద్యావ్యవస్థలో భాగస్వాముల్ని చేసే అవకాశం ఏర్పడుతుంది. ఇతరత్రా కొన్ని ప్రోత్సాహకాలు, చర్యలతోపాటు అర్థమయ్యేలా పాఠాలు చెప్పటం, ఈ చదువుతో ఉపాధికి గ్యారంటీ ఉంటుందనే నమ్మకం కలగటం వల్ల బాల కార్మికులు స్కూళ్లలో చేరటంతోపాటు మధ్యలో మానేయటం గణనీయంగా తగ్గుతుంది. ఉన్నత విద్య కూడా బలోపేతమవుతుంది. ప్రజల మధ్య రిజర్వేషన్ల పేరుతో వైషమ్యాలు తగ్గుతాయి. పేదరికం కారణంగా ఉన్నత విద్యకు ఎటువంటి ఆటంకం లేకుండా చేసే బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకోవాలి. ప్రజలకు ఆరోగ్య వ్యవస్థ పట్ల కూడా భరోసా ఉంటే, విద్య, ఆరోగ్య వ్యయాలు ఆదా అవుతుంటే ఆర్థిక కలాపాల్లో కూడా చురుకుగా పాల్గొనటంతోపాటు పెరుగుదలకు దోహదం చేస్తారు. కష్టంలో ఉన్న ఇతరులను ఆదుకోవటానికి చొరవ చూపుతారు. ఇలాంటి స్వచ్ఛంద కార్యకర్తలతోపాటు.. విద్య, ఆరోగ్యంలో ప్రభుత్వం ఇచ్చే రాయితీలు తీసుకోకుండా తమ వంతు సాయం అందించాలనుకునేవారి సేవలను కూడా ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంటే అనేకరెట్లు మెరుగైన ఫలితాలు ఈ రంగాల్లో సాధ్యమవుతాయి. కస్తూరి రంగన్ కమిటీ ద్వారా విద్యావేత్తలు, నిపుణులు ఇచ్చిన సూచనలతో ఇటీవల వచ్చిన జాతీయ నూతన విద్యావిధానం కూడా ఇందుకు అవకాశం కల్పిస్తుంది. దాతలు, పౌర సమాజం, తల్లిదండ్రులు, వ్యక్తుల పాత్రను వ్యవస్థీకృతంగా పెంచే సవివరమైన ఏర్పాటు నూతన విద్యావిధానంలో చేశారు. విద్యావ్యవస్థలో నాణ్యత కేవలం ప్రభుత్వాల వల్ల అయ్యే పని కాదు. క్రమక్రమంగా మనందరం కూడా భాగస్వాములం కావాలి.

జాతీయాదాయంలో కేవలం 1 శాతం అదనంగా కేటాయిస్తే, ప్రాథమిక వైద్యాన్ని పటిష్ఠపరుస్తూ, పెద్దాస్పత్రులను అభివృద్ధి చేస్తూ వ్యక్తిగత ఆర్థికభారం లేకుండా ప్రతి ఒక్కరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించే సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని కూడా లోక్‌సత్తా జేపీ తాజాగా రూపొందించి ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, పౌర సమాజం, ప్రజల ముందుంచుతున్నారు.

ఈ నేపథ్యంలో, సంక్షేమం పేరుతో దుబారా అయ్యే వ్యయాలకంటే చాలా తక్కువ ఖర్చుతో.. విద్యలో అయితే ఇప్పుడు చేస్తున్న ఖర్చుతోనే.. అందరికీ నాణ్యమైన పాఠశాల విద్యను, మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించవచ్చు. సాంకేతికత ఇందులో అందివచ్చే పెద్ద వనరు. జాతీయస్థాయి ప్రభుత్వం, రాష్ట్రాల ప్రభుత్వాలు కలసికట్టుగా ఇందుకు కదలాలి. మన దేశంలో నిరుపేద తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు బాగా చదువుకోవాలని నోరు కట్టుకుని, ఖర్చులు తగ్గించుకుని ఫీజులు చెల్లిస్తున్నారు. ప్రజల బలహీనతల్ని కాకుండా, వారి సానుకూలతల్ని, భవిష్యత్తుకు ఉపయోగపడే ఆకాంక్షల్ని పట్టించుకునే నాయకత్వ సామర్థ్యాన్ని పాలకులు ప్రదర్శించాలి. వీటినేమీ అదనంగా చేయాల్సిన పనులుగా భావించనక్కర్లేదు. ఆధునిక ప్రజాస్వామ్యంలో రాజ్యవ్యవస్థ చేయాల్సిన పనుల్లో ప్రజలందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం ఆర్థికభారం లేకుండా అందించటం కూడా భాగం. ఈ బాధ్యతల్లో ప్రభుత్వాల వైఫల్యం వల్ల కరోనా రాకముందే మన అభివృద్ధిలోని డొల్లతనం, మన ఆర్థిక వ్యవస్థలోని అసమర్థత బయటపడుతూ వస్తున్నాయి. మనం కళ్లు మూసుకుని పట్టించుకోలేదంతే. విద్య, ఆరోగ్యంలో అధ్వాన్నంగా ఉండటంతో మన ఆర్థిక సామర్థ్యం వికసించటం లేదు. తాజాగా స్విట్జర్లాండ్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ (ఐఎండీ) 64 దేశాల మధ్య రూపొందించిన ఆర్థిక పోటీ సామర్థ్యం సూచీలో ఆరోగ్యం విషయంలో మన దేశం అట్టడుగున 64వ స్థానంలో ఉండగా, విద్యలో 59వ స్థానంలో ఉంది. కొవిడ్ వైరస్ పేద, ధనిక తేడా చూపించకపోయినా.. ప్రభుత్వాల విధానాల వైఫల్యం వల్ల, సంక్షేమం పేరుతో తప్పుడు ప్రాథమ్యాల వల్ల పేద, దిగువ మధ్యతరగతివారే ఎక్కువ నష్టపోయారు, ఆర్థిక అంతరాలు ఇంకా ప్రస్ఫుటమయ్యాయి.

విద్య, ఆరోగ్యాలను మెరుగుపరచటంలో భాగంగా చేపట్టే మౌలిక వసతుల కల్పనను వికేంద్రీకృతంగా ఇతర రంగాలకు కూడా పర్యావరణహితంగా విస్తరిస్తే ఉపాధి అవకాశాలు కూడా

## మానవాభివృద్ధి సూచీలో భారత్‌కు 131వ స్థానం

**మానవాభివృద్ధి సూచీలో భారత్ గతంతో పోలిస్తే ఒక స్థానం కిందకు పడిపోయి 189 దేశాలతో కూడిన జాబితాలో 131వ స్థానానికి పరిమితమైంది. ఆయా దేశాల్లో ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలను విశ్లేషించటం ద్వారా ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) రూపొందించిన తాజా నివేదికలో నార్వే అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా ఐర్లాండ్, స్విట్జర్లాండ్, హాంకాంగ్, ఐస్‌లాండ్ ఉన్నాయి. భారత్ కంటే కాస్త మెరుగ్గా భూటాన్ 129వ స్థానంలో నిలిచింది. బంగ్లాదేశ్ (133), నేపాల్ (142), పాకిస్థాన్ (154) మన దేశం కంటే వెనుకంజలో ఉన్నాయి. 2019లో భారత్‌లో సగటు జీవితకాలం 69.7 ఏళ్లుగా ఉన్నట్లు మానవాభివృద్ధి నివేదిక తెలిపింది. ఈ విలువ బంగ్లాదేశ్‌లో 72.6 ఏళ్లు, పాకిస్థాన్‌లో 67.3 ఏళ్లుగా ఉన్నట్లు వెల్లడించింది. 2018 సూచీలో భారత్ 130వ స్థానంలో ఉంది. సమాజంలో అసమానతలు, రాజకీయ-ఆర్థిక వ్యవస్థల్లో బలహీనతలను కరోనా మహమ్మారి స్వల్పకాలంలోనే ఎత్తిచూపిందని యూఎన్‌డీపీ నివేదికలో వ్యాఖ్యానించింది.**

## ప్రతి ముగ్గురు బాలకార్మికుల్లో ఒకరు నిరక్షరాస్యులే

మనదేశంలో ఏడు నుంచి 14 ఏళ్ల మధ్య వయసు చిన్నారుల్లోని ప్రతి ముగ్గురు బాలకార్మికుల్లో ఒకరు నిరక్షరాస్యులని చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై) సంస్థ గతంలో తేల్చింది. దాదాపు 14లక్షలమంది బాలకార్మికులు కనీసం తమ పేరు కూడా రాయలేరని తెలిపింది. ఇది ఏడాదిలో ఆరు నెలలకన్నా ఎక్కువకాలం పనిచేసే చిన్నారులకు సంబంధించిన చేదునిజమని పేర్కొంది. ఏడాదిలో ఆరు నెలలకన్నా తక్కువకాలం పనిచేసే కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండే వారి విషయంలోనూ పరిస్థితి ఇంతకన్నా మెరుగ్గాలేదని తెలిపింది. ఈ విభాగంలో దాదాపు 20లక్షలమంది చిన్నారులు తమ చదువును ఫణంగా పెడుతున్నారని తెలిపింది.

- బీహార్‌లోని బాలకార్మికుల్లో 45శాతం మందికి చదువు రాదు. రాజస్థాన్, జార్ఖండ్‌లో 40శాతం మందిది ఇదే పరిస్థితి
- ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల్లోని బాలకార్మికుల్లో 38శాతం మంది నిరక్షరాస్యులు
- మధ్యలో బడి మానేసినవారు ఉద్యోగాలు పొందకుండా ఉండటానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ చిన్నారులు పెరిగి పెద్దయ్యాక.. భద్రమైన ఉద్యోగాలు లేకపోవటంతో పేదరిక విషవలయంలో చిక్కుకుపోతారు

పెరుగుతాయి. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వ నిధుల్ని వినియోగిస్తే అప్పులు తెచ్చినా అవి సద్వినియోగమవుతాయి. లేకుంటే కరోనా వల్ల ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొనే క్రమంలో తెచ్చే అప్పులు కూడా దుర్వినియోగమయ్యే ప్రమాదముంది. ప్రభుత్వం పన్నుల ద్వారా వచ్చే డబ్బుని, రుణాల ద్వారా తెచ్చే నిధుల్ని పూర్తిగా ఉత్పాదక రంగాలకు వినియోగించాలి. కొవిడ్ సమస్య సద్దుమణిగి ఆర్థిక వ్యవస్థ గాడిలో పడినా, పాత ఉద్యోగాల స్థానంలో కొత్తవి వచ్చినా ఈ నూతన విధానాలను అమలు చేస్తేనే వ్యక్తిగత, దేశ సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతాయి. తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్న ఆర్థిక అంతరాలు అదుపులోకి వస్తాయి. విదేశాలకు తరలిపోవాలనుకునేవారి సంఖ్య కూడా తగ్గుతుంది.

మన దేశం నుంచి విదేశాలకు వెళ్లి ఘనవిజయాలు సాధిస్తున్నవారిని చూసి గర్వపడుతూ కూర్చున్నా, అయ్యో అని విలపించినా, వాళ్లు తిరిగి వచ్చి స్వదేశంలో సేవ చేయాల్సిందనే అనే మితిమీరిన జాతీయవాదాన్ని వినిపించినా లాభం లేదు. మన దేశంలో అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, సుపరిపాలనా విధానాలు ఉంటే ఇక్కడ్నుంచి పెద్దగా మేధాసంపద తరలిపోదు, వెళ్లినా నష్టముండదు.

తాత్కాలిక పథకాల్ని, రాయితీల్ని హేతుబద్ధీకరించటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే రాజకీయ భయం ప్రభుత్వాలకు ఉండవచ్చు. స్థానిక ప్రభుత్వాల్ని బలోపేతం చేసి సమర్థవంతంగా పనిచేయించటం ఇందుకు సరైన విరుగుడు. తనకు లభిస్తున్న రాయితీల కంటే ఎన్నో రెట్లు మెరుగైన లాభం కొత్త సంక్షేమ విధానం ద్వారా తనకు చేకూరుతుందన్న విశ్వాసం ప్రజలలో పాదుకొనటానికి ఇంటి ముందు ప్రభుత్వం, కంటి ముందు పాలన ఎంతో ఉపయోగపడతాయి.

కొవిడ్ తీవ్రత నుంచి వేగంగా కోలుకోగల సామర్థ్యం, అవకాశాలు భారతదేశానికి ఉన్నాయి. కానీ పాలకులు కొత్త కోణంలో ఆలోచిస్తూ విధానాల్లో సంస్కరణలు అమలు చేస్తేనే అది సాధ్యమవుతుంది. బాధితుల్లో అవసరమైన వారికి తక్షణ సాయాల్ని, ఉద్దీపనల్ని అందిస్తూనే.. సంక్షేమానికి పాత నిర్వచనాల్ని మార్చి విద్య, ఆరోగ్యం, ఉపాధి, ఆదాయాల పెరుగుదల, మానవ వనరుల చుట్టూ సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణహితంగా కొత్తగా నిర్వచించటం, సంక్షేమానికి – అభివృద్ధికి వైరుధ్యాలు లేకుండా చేయటం యువత భవిష్యత్తుకే కాదు, పార్టీలు, నేతల రాజకీయ భవిష్యత్తుకి కూడా ఎంతో అవసరం.

# భారత్‌లో సగం మంది బాలలు బహుముఖీన పేదరికంలో

మనదేశంలోని మొత్తం బాలల్లో సగం మంది విద్య, ఆరోగ్యం వంటి కీలక సేవలు సక్రమంగా అందక బహుముఖీన పేదరికంలో మగ్గుతున్నారని 2017లో ఓ అధ్యయనం వెల్లడించింది. హింస ముప్పును ఎదుర్కొంటున్నారని తెలిపింది. 'బాలల పేదరిక నిర్మూలన' సాధనలో ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు ఎదురవుతున్న సవాళ్లపై బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం 103 చిన్న, మధ్యస్థాయి దేశాలపై అధ్యయనం నిర్వహించింది. కేవలం ఆదాయం ఆధారంగా కాకుండా విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలను పరిగణలోకి తీసుకుంటూ అంతర్జాతీయ బహుముఖీన పేదరిక సూచీ ఆధారంగా ఈ మదింపు చేశారు. 103 దేశాల మొత్తం జనాభాలో పిల్లలు 34శాతం ఉన్నారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్నవారందరినీ పిల్లలుగానే పరిగణలోకి తీసుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ నివేదిక ప్రకారం.. దక్షిణాసియాలోని ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లోనే పేదల సంఖ్య ఎక్కువ. భారత్, పాకిస్తాన్ సహా 36 దేశాల్లో మొత్తం పిల్లల్లో కనీసం సగం మంది బహుముఖీన పేదలే.

# నెలకు రూ.1,000 - 1,500 పేద తల్లిదండ్రులకు అందించాలి, రిటైరయ్యే టీచర్ల వల్ల మిగిలే డబ్బును ఇటు మళ్లిస్తే చాలు: జేపీ



భారతదేశంలో మొత్తం ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో సుమారు 24 కోట్ల మంది పిల్లలు చదువుతున్నారు. ఇందులో దాదాపు 45-50 శాతం మంది ప్రయివేటు స్కూళ్లలో ఉన్నారు. గత 10-15 సంవత్సరాలలో ప్రభుత్వ స్కూళ్లపై లక్షల కోట్లు ఖర్చు పెట్టగా, వాటిల్లో పిల్లల సంఖ్య 20% మేర తగ్గింది, ప్రైవేటు స్కూళ్లలో పెరిగింది. డబ్బున్నవాళ్లు ప్రైవేటు స్కూళ్లలో పూర్వమే చేరారు. మరి కొత్తగా గత కొన్నేళ్లలో ఆ స్కూళ్లలో చేరిందెవరు? పేదలు. చాలామంది శక్తికి మించి ఖర్చు పెట్టి తమ పిల్లలేమన్నా బాగుపడతారేమోనన్న ఆశతో ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రైవేటా, ప్రభుత్వమా అని ఆలోచించటం సరికాదు ప్రభుత్వానికి. విద్యలో బిడ్డ కేంద్రంగా ప్రభుత్వ ఆలోచన ఉండాలి. బిడ్డకి మంచి చదువు వస్తున్నదా లేదా? అన్నదే ప్రధానాంశం కావాలి. ప్రభుత్వమా, ప్రయివేటా అని చూడకూడదు. ఆ స్కూళ్లలో ప్రమాణాల మీద దృష్టి పెట్టాలి. అలాగే పేదల పిల్లలు గతిలేక ప్రైవేటు స్కూళ్లకి వెళున్నప్పుడు వారికి ప్రభుత్వ సాయం అందటం అవసరం. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో బిడ్డ మీద ఏడాదికి రూ.80,000 - 90,000 ఖర్చు పెడుతున్నారు. అంత డబ్బు ఇవ్వలేం. ఏడాదికి రూ.15,000 మేరలో పరిమితి విధించి, నెలకు రూ.1,000 - 1,500 ఇవ్వొచ్చు. ఇది అదనపు భారం లేకుండానే ప్రభుత్వం చేయవచ్చు. ఇందుకు నేను ఒక మార్గం చూపాను. ఉదాహరణకు ఉపాధ్యాయులు ఏటా 3% మంది రిటైరవుతున్నారు. మన జనాభా పెరుగుదల వేగం తగ్గి క్రమంగా నియంత్రణలోకి వస్తూండటం వల్ల పిల్లల సంఖ్య తగ్గుతుంది. పిల్లల సంఖ్య పెద్దఎత్తున పెరుగుతుండటమనేది పూర్వకాలపు ఆలోచన. ఇప్పటికే మనకు ఒక్కో విద్యార్థికి 17, 18 నిష్పత్తిలో ఉపాధ్యాయులున్నారు. అందువల్ల టీచర్లను కొత్తగా పెట్టుకోకుండా రిటైరైన టీచర్లకు ఏటా ఇచ్చే డబ్బును పేదవిద్యార్థులకు ఇచ్చే ఏర్పాటు చేయవచ్చు. ఇలా ఏడాదికి 5 లక్షల మందికి పిల్లలకు ఆర్థికసాయం అందించవచ్చు. ఇలా చేస్తే ఓ మూడేళ్లలో పేదలందరికీ ఆర్థికసాయాన్ని ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థికభారం లేకుండానే అందించవచ్చు. కాబట్టి ప్రభుత్వమా, ప్రయివేటా అని కాకుండా.. పిల్లలకు మంచి విద్య అందటం, పేద తల్లిదండ్రులపై ఆర్థికభారం లేకుండా ఉండటం అనేవి గీటురాళ్లు కావాలి. ఇదే ధ్యేయంగా పెట్టుకుంటే విద్యారంగంలో మంచి ఫలితాల్ని సాధించగలం.

# ప్రయివేటు ఆస్పత్రుల ఆదాయంలో 15-17% వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రయివేటు ఆస్పత్రుల ఆదాయంలో 15-17 శాతం వృద్ధి నమోదైందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఒక నివేదికలో తెలిపింది. కొవిడ్-19 కేసులు అధికంగా నమోదు కావటం, పలువురు ఆస్పత్రి పాలవటం, మూడో దశ ప్రబలుతుందనే ఆందోళనలు వంటి కారణాలు ఈ వృద్ధికి కారణమై ఉండొచ్చని అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే కొవిడ్ రెండో దశ ఉధృతితో బాధితుల సంఖ్య ఒక్కసారిగా పెరగడంతో ఆస్పత్రుల ఆదాయాలూ బాగా పెరిగాయని తెలిపింది. 2020-21లో ఆర్జించిన మొత్తంతో పోలిస్తే 17% వరకు అధికంగా ఉండొచ్చని వెల్లడించింది. దీనివల్ల నిర్వహణ లాభాలు 100-200 బేసిస్ పాయింట్లు పెరిగి, 13-14 శాతానికి చేరుకోవచ్చని అంచనా వేసింది. కొవిడ్-19 రెండో దశ ఉధృతి నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆస్పత్రుల్లో పడకల ఆక్యుపెన్సీ నిష్పత్తి 75 శాతానికి మించే ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోలిస్తే ఇది రెట్టింపు. కొన్ని శస్త్రచికిత్సల కోసం వచ్చేవారి సంఖ్య తగ్గినప్పటికీ.. కొవిడ్ బాధితులు భారీగా ఉండటంతో ఆస్పత్రుల్లో చేరికలు తగ్గలేదు. జులై-సెప్టెంబర్‌లో కరోనా కేసులు తగ్గినప్పటికీ ఇతర చికిత్సల కోసం వచ్చేవారితో పడకలు నిండుతాయని క్రిసిల్ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో 58 శాతం ఆక్యుపెన్సీ ఉండగా, ఈసారి అది 65-70 శాతానికి తగ్గకుండా ఉండే అవకాశముందని తెలిపింది. ఆదాయం, లాభాల్లో వృద్ధి నమోదు కావడం వల్ల విస్తరణకు ఆస్పత్రులు ప్రణాళికలు వేసే అవకాశం ఉంది. ఇందులో ఇతర ఆస్పత్రుల విలీనం, పడకల సంఖ్య పెంచటం, మౌలిక వసతులను పెంపొందించటం లాంటి వాటికి ప్రాధాన్యం ఉండొచ్చని క్రిసిల్ అంచనా వేసింది. ✦

# సమస్య ప్రధానంగా ప్రాథమిక ఆరోగ్యం స్థాయిలో ఉంది: జేపీ

వైద్యరంగాన్ని బాగుచేయాలంటే దేశంలో ఉన్న నిధులు సరిపోవని ప్రభుత్వంలో, రాజకీయ పార్టీల్లో ఉన్నవారితో సహా చాలామంది భావిస్తున్నారు. ఈ అపోహకు ప్రజారోగ్యం పట్ల విపరీత నిర్లక్ష్యం తోడవటంతో సామాన్య ప్రజలకు ఆరోగ్యం అందకుండా పోతోంది. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా, బిల్లులు జేబులకు చిల్లులు పెడుతున్నాయి. కాస్త పెద్ద జబ్బు వస్తే పేద, మధ్యతరగతికి అప్పులు తప్ప మార్గం లేదు. కేవలం అనారోగ్యం వల్ల దేశంలో 5 కోట్లమందికి ఏటా పేదరికంలో కూరుకుపోతున్నారు. కానీ సంకల్పం ఉండాలేగానీ, భారత్‌కున్న కొన్ని రకాల అవకాశాల నేపథ్యంలో తక్కువ ఖర్చుతోనే అందరికీ ఆరోగ్యాన్ని అందించవచ్చని లోక్‌సత్తా సమగ్ర అధ్యయనంలో తేలింది. మన ప్రభుత్వాసుపత్రులకు ఇస్తున్న నిధుల్ని, అవి అందిస్తున్న సేవలని చూస్తే ఉన్నదాంట్లో అక్కడి వైద్యసేవలు అద్భుతమనే చెప్పుకోవాలి. కొవిడ్‌కు ముందు నుంచీ సగటున 1000 పడకలున్న సర్కారీ దవాఖానాల్లో 2000 పడకలకు సేవలందిస్తున్నారు. ఎందుకంటే రోజూ వేలసంఖ్యలో రోగులొస్తున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు రోజూ సగటున 3,000-4,000 మంది చొప్పున పేషెంట్లు వస్తుంటే, ఢిల్లీ ఎయిమ్స్‌లో 10,000 దాటిపోతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఒక్కో పడకకు జీతభత్యాలు సహా అన్నీ కలుపుకుని ఏడాదికి 8లక్షలు ఖర్చు చేస్తుంటే, ప్రయివేటు ఆసుపత్రుల్లో 1 కోటి రూపాయలు వరకు ఖర్చవుతోంది. కాబట్టి పెద్దాసుపత్రుల్ని నిందించటం పరిష్కారం కాదు. మనకున్న సమస్య ప్రధానంగా అట్టడుగు స్థాయిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ఉంది. గ్రామాల్లో ఉన్నవారికి ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వెంటనే డాక్టర్ అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. అట్టడుగుస్థాయి నుంచి, మనకున్న పరిమిత వనరుల్లో సరైన పరిష్కారాన్ని వెతకాలి. పైస్థాయి ఆస్పత్రుల్లో ఆధునిక పరికరాలతో సౌకర్యాల్ని మెరుగుపరచాలి. ప్రజలు జేబులో నుంచి రూపాయి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా అందరికీ ఆరోగ్యాన్ని అందించాలి. ఇప్పుడు వైద్య, ఆరోగ్య రంగాలపై కేంద్రం చేస్తున్న ఖర్చు స్థూల జాతీయాదాయంలో 1.3 శాతంకాగా, లోక్‌సత్తా నమూనాలో ఆ ఖర్చు మరో శాతం లోపే పెరుగుతుంది. అంటే 2శాతం పరిధిలోనే అందరికీ అందుబాటులో వైద్యం అందించవచ్చు. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత తక్కువ ఖర్చుతో ప్రజలకు ఆరోగ్యం అందించిన దాఖలాలు లేవు. కానీ మన దేశానికి ఆ వనరులు, అవకాశాలు ఉన్నాయి.

# విద్య, ఆరోగ్యం బాధ్యత ప్రభుత్వాలదే!



ఈ రోజు యావత్ ప్రపంచం భారతదేశం వైపే చూస్తోందంటే ప్రధాన కారణం– మనకున్న మానవ వనరులు! మన దేశ జనాభాలో సగం మంది 25 ఏళ్ల లోపువాళ్లే. 2030 నాటికి 18 నుంచి 65 ఏళ్లలోపు ఉన్నవాళ్లు దాదాపు 100 కోట్ల మంది ఉంటారని అంచనా. మనం శరవేగంగా వృద్ధిని సాధించి ప్రపంచంలో అగ్రస్థాయిలో నిలవగలమనే ఆత్మవిశ్వాసం మన పాలకుల మాటల్లో, మన యువత కళ్లల్లో కూడా ప్రతిఫలిస్తోంది. కానీ చాలామంది అనుకుంటున్నట్లు 2039నాటికి చైనాకు దీటుగా భారత్ అగ్రస్థాయి రాజ్యమవుతుందా? ఎవరేమనుకున్నా, ఎలాంటి అవరోధాలు వచ్చినా ఇది జరిగితీరుతుందా? 'ఉందిలే మంచికాలం ముందుముందునా' అని మనం భవిష్యత్తు పట్ల భరోసాతో దిలాసాగా గడిపేయొచ్చా?... అనడిగితే మాత్రం 'కాదు' అన్నదే సూటి సమాధానం.

మన లక్ష్యం స్పష్టంగా ఉంది, లక్ష్యసాధనకు కావలసిన అన్ని అర్హతలు, అవకాశాలూ ఉన్నాయి. కానీ లక్ష్యాన్ని ఛేదించగలమా లేదా అనేది మాత్రం మనం చేపట్టే 'సరైన చర్యల' మీదే ఆధారపడి ఉంటుంది.. ఇదీ వాస్తవం!

మన మానవ వనరులలోని శక్తిసామర్థ్యాలు వికసించకపోతే, ఎన్ని కోట్లమంది జనం ఉన్నా మన శక్తి అల్పమే. మనం ఒకరిని అనుకరించే అల్పజీవులుగా మిగిలిపోతాం తప్ప ప్రపంచానికి దిశానిర్దేశం చేయగల శక్తిమంతులం కాలేము. కేవలం కొన్ని సంపన్నదేశాల వ్యాపార ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగపడతాం. భారత్ ఓ మార్కెట్ కేంద్రంగా ఉంటుంది తప్ప అగ్రరాజ్యం కాలేదు.

మన మానవవనరులు మార్కెట్‌గా మిగిలిపోయేస్థాయిలో ఉన్నాయా లేక స్థిరమైన అభివృద్ధిని కొనసాగిస్తూ, అన్నిదేశాలనూ అధిగమించే దిశలో సాగుతున్నాయా?... మనల్ని మనం నిజాయతీగా ప్రశ్నించుకోవాలి.

సుస్థిరాభివృద్ధి సాధించే స్థితిలో ఉన్నామని, ఆ దిశలోనే వెళ్తున్నామని ఏ ఒక్కరం ధీమాగా చెప్పలేని పరిస్థితి. మానవాభివృద్ధి నివేదికలో మన అథమస్థానం కళ్లెదుటే కనిపిస్తోంది. భూగోళం మీద దాదాపు 130దేశాల ఆవల ఉంది మన మానవాభివృద్ధి! రాశి తప్ప వాసిలేప్పుడు మనం సుస్థిరాభివృద్ధిని సాధించగలమా? పోటీపడి నిలదొక్కుకోగలమా?... ఈరోజు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ప్రజలూ తీవ్ర చర్చ చేయాలి.

మన జనాభాలో ప్రతివ్యక్తీ స్వావలంబన, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో ఉంటే తప్ప మనం భవిష్యత్తు పట్ల ధీమాను వ్యక్తం చేయలేం. మానవాభివృద్ధితో సంబంధంలేదు, ఎవరో కొందరు వ్యక్తులు కేవలం ఫలానా తల్లిగర్భాన పుట్టిన కారణంగా, అదృష్టం కారణంగా ఎదిగి .. మిగిలినవారు తినటానికి కాస్త తిండి, అనుభవించటానికి కొంత వినోదం, మార్కెట్‌లో ఏదోకస్థాయి వినయోగదారులుగా ఉంటే చాలు అనే సామాజిక వాతావరణాన్నే కొనసాగించాలనుకుంటే, ఇక భవిష్యత్తు గురించి పెద్ద పెద్ద కలలు, చర్చలు అక్కర్లేదు. భారతదేశం ఒక మధ్యాదాయదేశంగా అలా నడుస్తుంటుందంతే.

అదృష్టవశాత్తూ మనలో చాలామంది అలా



ఆరోగ్యం కేవలం రాజ్యాంగంలో ఆదర్శాలుగా మిగిలిపోయాయితప్ప ఆచరణలోకి రాలేదు. ఉన్న కాసిని అవకాశాల్నీ వ్యవస్థలో కాస్త చైతన్యస్థాయిని కలిగిన వర్గాలు అందుకుని ఎదిగాయి. మిగిలినవారు ముడుచుకుపోయి బతకటమో, పొట్ట చేత పట్టుకుని వలసలు పోవటమో మామూలై పోయింది. కొందరు సంపన్నులు, ఎందరో పేదలు... ఇది భారతదేశ స్థూలచిత్రంగా మారింది.

లోపాలు మన రాజకీయంలోను, విధానాలలోను ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో రెంటినీ విడదీసి చూడటం సాధ్యంకాదు.

**ప్రజాస్వామ్యం- రాజకీయం- ప్రభుత్వ విధానాలు- విద్య, ఆరోగ్యం**

ముందుగా మనం రాజకీయాలు వేరు, విద్య, ఆరోగ్యం గురించిన చర్చ వేరు అనే చిరకాల భ్రమ నుంచి బైటికి రావటం అవసరం. రాజకీయాల్లో, తద్వారా పాలనలో విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యత లేకపోవటం వల్లే ఆ రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురై జాతి చాలా మూల్యం చెల్లించింది.

మనం ఇప్పటిదాకా రాజకీయానికి విద్యను, ఆరోగ్యాన్ని కేంద్రబిందువు చేయకపోవటంవల్ల ప్రపంచవ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి అవకాశాలు వచ్చినా కూడా వాటిని అందుకోలేక మనలో మెజారిటీ ప్రజలు నలిగిపోయారు. ప్రపంచీకరణలో ఎన్నో అవకాశాలు ఉన్నా సద్వినియోగం చేసుకోలేక వాటి చేతిలో పావులుగా ఉపయోగపడ్డారు. మార్కెట్‌గా మిగిలిపోయారు. ఉత్పత్తుల వివరాలను తెలుసుకునేందుకు మాత్రమే పల్లెల్లో అక్షరాస్యత ఉద్యమాలను నిర్వహించారు. అందుకోసం పెద్దఎత్తున నిధుల్ని వెచ్చించారు. దీనివల్ల అక్షరాలు మాత్రమే తెలిసిన నిరక్షరాస్యులు తయారయ్యారు. రాయటం, చదవటం, అంకగణిత పరిజ్ఞానం ప్రామాణిక అక్షరజ్ఞానంగా పరిగణిస్తే, మన జనాభాలో 25-30శాతంమందికి మాత్రమే అక్షరజ్ఞానం ఉంది.

విద్య ద్వారా అభివృద్ధిని ప్రజలు గుర్తించాక కూడా దాన్ని సరైన దిశలో మళ్లించకుండా విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చివేసి ప్రజల్ని దోచుకునేందుకు పాలకులే మార్గం వేశారు. టాటా, బిర్లావంటి కొందరిని మినహాయిస్తే.. తగిన అర్హతలు, విద్య పట్ల ఆపేక్ష లేనివారు కేవలం కరెన్సీ నోట్లతో, రాజకీయ అండతో విద్యాసంస్థల్ని స్థాపించేస్తున్నారు. మరోవైపు, అణగారినవర్గాలను, అగ్రవర్ణాలలోని పేదలను సంతృప్తిపరిచేందుకు పాఠశాలల, కళాశాలల సంఖ్యను పెంచారుతప్ప వాటిలో మౌలిక వసతులు లేవు. తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉండరు. సిలబస్‌లో, బోధనలో నాణ్యతా ప్రమాణాలు లేవు. ఈరకంగా డబ్బులేనివారికి మంచి చదువు అందదు అనే వ్యవస్థను మన దేశంలో నిర్మించారు.

మిగిలిపోవాలనుకోవటం లేదు. కొవిడ్ వంటి విధ్వంసకర పరిణామాల తర్వాత కూడా మనలో భవిష్యత్తు పట్ల ఆశ అడుగంటలేదు. ఎన్ని సమస్యలున్నా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాం. అలాగే భావితరాల పట్ల మనలో దాదాపు ప్రతి ఒక్కరికీ ఎంతో తపన ఉంది. ఆ ఆకాంక్షల్ని, తపనను 'సరైన చర్యల' దిశగా కృషిగా మలచాల్సిన సమయమిది. లక్ష్యానికి తగినట్టు కావలసిన మార్పులు, దానికి తగ్గ ప్రయత్నంలో ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదు.

"ఇది యథాతథ స్థితిని ఆమోదిస్తూ ఆదమరిచి గడపాల్సిన సమయం కాదు. లక్ష్యానికి తగినట్లు కొవిడ్ వంటి సంక్షోభాల్ని, మనల్నీ మలచుకుని దూసుకెళ్లాల్సిన తరుణం."

మానవాభివృద్ధిని, తద్వారా దేశాభివృద్ధిని సాధించాలంటే సమాజంలో అందరికీ మంచి ప్రమాణాలుగల విద్యని, ఆరోగ్యాన్ని అందించటం తప్ప వేరే మార్గం లేదు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం పునాది మీదే జాతి సౌధం నిర్మితం కావాలి. ఈ విషయాన్ని ఈవేళే హఠాత్తుగా గుర్తించామా అంటే.. కాదు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఎందుకని ఆ రెండు రంగాల్లో మనం చాలా వెనకబడి, అత్యంత బలహీనమైన స్థాయిలో ఉన్నామంటే మన పాలకుల హ్రస్వదృష్టే అందుకు కారణం. ప్రజల్ని యాచకులుగాకాకుండా ఆత్మగౌరవం గల ప్రభువులుగా నిలబడటంలో కీలకమైన విద్య, ఆరోగ్యాన్ని అందించాలనే స్పృహ కొందరు నేతల్లో వ్యక్తిగతంగా ఉన్నా, రాజకీయం సంప్రదాయ పెత్తందారీ వ్యవస్థగా మారిపోవటంతో ఆ పునాది రంగాలు కుదేలయ్యాయి. వ్యవస్థను కదిలించే శక్తిలేక.. ఆలోచనాపరులైన నేతలు కూడా ఉన్న రాజకీయంలోనే సర్దుకుపోతూ వచ్చారు. ప్రథమస్థాయి అవకాశాలున్నా అథమస్థాయి విధానాల వల్ల మన జాతి భవిష్యత్తుపై సందేహాలు ముసురుకుంటున్నాయి. విద్య,

చదువుపట్ల సర్కారు చూపిన బాధ్యతారాహిత్యం వల్ల డిగ్రీలున్నా పరిజ్ఞానం, నైపుణ్యంలేని యువత రూపొందారు. ఉపగ్రహ ఛానళ్లు వంటి సమాచార సాంకేతిక పరిజ్ఞాన సాధనాలు విజ్ఞాన విస్తరణకు కాకుండా, సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే పావులుగా మారిపోయాయి. నాణ్యమైన విద్య, అందులో ఉపాధి నైపుణ్యాల కోణం లోపించటం వల్ల చాలామంది ప్రజలు అభద్రతలో బతుకుబండి లాగుతున్నారు.

ఇదే తరహాలో మనం వైద్యారోగ్య వ్యవస్థనూ తయారుచేసుకున్నాం. ప్రజలకు విద్య, ఆరోగ్యం అవసరం పెరుగుతున్నకొద్దీ, సమాజంలో వీటికి డిమాండ్ పెరుగుతున్నకొద్దీ ప్రైవేటురంగం సేవలు విస్తరిస్తూ చివరికి సామాన్యుడి జీవితం భారంగా మారుతూ నిరుపేదల సంఖ్య ఏయేటికాయేడు పెరిగిపోతోంది.

సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో సగం ఆదాయం కేవలం పిల్లల చదువుల ఫీజులకే ఖర్చవుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఎంతో మౌలికమైన ఈ రంగాలను రాజకీయం పట్టించుకోకపోయినా ఇప్పటివరకూ తీవ్ర చర్చనీయాంశం కాకపోవటం చాలా ఆశ్చర్యం కలుగుతుంది. లోక్‌సత్తా, ఆ తర్వాత ఆమ్‌ఆద్మీ పార్టీని మినహాయిస్తే ఎన్నికల మేనిఫెస్టోలో మంచి చదువు, మంచి ఆరోగ్యానికి నిర్దిష్ట హామీ ఇచ్చిన పార్టీలు లేవు. ప్రజలకు విద్య, ఆరోగ్యం ఇవ్వకపోవటాన్ని సాంప్రదాయ పార్టీలు ఓ విధానంగా కొనసాగిస్తూ వస్తున్నాయి. ఈ రంగాల్లో మన పాలకులు కనీసం బ్రిటీషువారి పాటి శ్రద్ధను కూడా కనబర్చలేదు. చాలా అశాస్త్రీయంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అణగారినవర్గాల పరిస్థితి మరీ దారుణం. వారికి గుర్తింపు తెచ్చేందుకు ప్రవేశపెట్టిన రిజర్వేషన్ విధానం... చివరికి కలెక్టర్ల కొడుకులకు, మంత్రుల కూతుళ్లకు ఉపయోగపడుతూ ఆయా వర్గాల్లో 90శాతంమందికి సరైన స్కూలు విద్యే అందుబాటులోకి రాని పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంబంధం ఎలా ఉండాలి? అందులో భాగంగా ప్రభుత్వం నెరవేర్చాల్సిన మౌలిక బాధ్యతలు ఏమిటి? అనే అంశాల మీద మనకు పూర్తి స్పష్టత కావాలి. ముందు మార్పు ఇక్కడ్నుంచే మొదలవ్వాలి.

**పాత కాలానికి భిన్నం ఆధునిక ప్రభుత్వ బాధ్యతలు**

ఆధునికయుగంలో ప్రభుత్వం ప్రధాన బాధ్యతలు పాత కాలానికి భిన్నంగా ఉంటాయి. పూర్వం దేశరక్షణ, కరెన్సీ చెలామణి, శాంతిభద్రతలు, చట్టబద్ధపాలన, న్యాయాన్నందించటం రాజ్యం ఏర్పాటుకు కారణాలయ్యాయి. అవికాక ఆధునిక యుగంలో కొన్ని ప్రత్యేక అవసరాలను తీర్చటం ప్రభుత్వ కర్తవ్యమైంది. పుట్టుకతో వచ్చిన అసమానతలను తొలగించటం కోసం విద్యని, ఆరోగ్యాన్ని, సంపద సృష్టి కోసం కావలసిన నైపుణ్యాన్ని అందరు బిడ్డలకి అందించటం అతికీలకమైన బాధ్యతగా నాగరిక సమాజాలు ఈరోజు గుర్తిస్తున్నాయి. ఇక మన ఉమ్మడి అవసరాలు తీర్చటానికి, ఆర్థిక ప్రగతికి కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించటం, సహజ వనరుల్ని సరైన రీతిలో అభివృద్ధి చేయటం ప్రభుత్వ కర్తవ్యాలు. ఆపైన.. వివిధ కారణాల వల్ల అట్టడుగున ఉన్న వర్గాలకు చేయూతనిచ్చి, వారికి బతుకు భయం లేకుండా సామాజికభద్రతను కల్పించటం ప్రభుత్వ బాధ్యతగా రెండో ప్రపంచ యుద్ధానంతరం అన్ని సమాజాలు గుర్తించాయి. ఈ లక్ష్యాలు నెరవేర్చే క్రమంలోనే ప్రజాస్వామ్యాన్ని గురించి, ప్రజల పన్నుల డబ్బును గురించి, జాతి వనరులను గురించి మనలో ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం.

**ప్రభుత్వ బాధ్యతల్ని పణంగా పెట్టి పన్నుల డబ్బు వ్యయం**

ప్రజాస్వామ్య ప్రభుత్వం కేవలం ప్రజల సేవ కోసం ఉందని, ఆ డబ్బంతా మనం చెమటోడ్చి, కష్టించి సంపాదించిన డబ్బుని పన్నుల రూపంలో కట్టటం వల్లను, ఆపైన మన బిడ్డల భవిష్యత్తుని తాకట్టు పెట్టి సర్కారు అప్పులు చేయటం వల్లను వచ్చిందని పౌరులకు మళ్లీ, మళ్లీ గుర్తు చేయటం అవసరం. ఇంత చేసి వెచ్చిస్తున్న ఆ డబ్బులో ప్రతి పైసా సద్వినియోగం చేయాలన్న స్పృహ రాజకీయవ్యవస్థలో కొరవడితే సమాజానికి కలిగే నష్టం అంతాఇంతా కాదు. రాజకీయ వ్యవస్థలో ఆ వైఫల్యమే ఈరోజు మన భవిష్యత్తు పట్ల సందేహాల్ని, ఆందోళనల్ని కలిగిస్తోంది. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను, బిడ్డల భవిష్యత్తును తాకట్టుపెట్టి మరీ అప్పు తెచ్చిన డబ్బును ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేస్తే, ప్రభుత్వ బాధ్యత పరిధిలోని మరో కార్యక్రమానికి, లేదా రంగానికి డబ్బులు తగ్గుతాయి. ఉదాహరణకి కలర్ టీవీలు ఇచ్చే పథకాన్ని చేపడితే, పిల్లల చదువుకు, కుటుంబ ఆరోగ్యానికి డబ్బు ఉండదు. అనుత్పాదకంగా ఉచితంగా నెలనెలా డబ్బిచ్చే ఏర్పాటుచేస్తే, యువత ఉపాధికి కావలసిన నైపుణ్యం అందించటానికి, ఉపాధి కల్పన కోసం ఏర్పాటుచేయవలసిన మౌలిక సదుపాయాలకి వనరులు చాలవు. కేవలం కొన్ని వ్యాధులకు, కొన్ని దశల్లో ఉపయోగపడే స్కీము కోసమే వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తే, ప్రజలు వైద్య ఖర్చుల కోసం అప్పుల పాలవటాన్ని, పేదలుగా మారిపోవటాన్ని ఆపటానికి నిధులు చాలవు. ఆర్థికభారాన్ని మోయలేక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లేందుకు భయపడి అనారోగ్యంతో ఇంటి వద్దే నిస్సహాయంగా భరిస్తున్న లక్షలాది మందికి ఉచితంగా వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వ వైద్యశాలల్ని పటిష్టం చేయలేం. రుణమాఫీ వంటి తాత్కాలిక ఉపశమనాల్ని అమలు చేస్తే, రైతుకి లాభసాటి ధరనిచ్చే మార్కెటింగ్‌కి కావలసిన మౌలిక వసతుల్ని కల్పించటానికి నిధులుండవు. నిధుల కోసం మళ్లీ వ్యవసాయ చట్టాల్ని సంస్కరించి ప్రయివేటు రంగానికి ఎర్రతివాచీ పరచటం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఓట్లవేటలో ఆరితేరిన పార్టీలు ప్రజలకి ఈ వాస్తవాల్ని అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం చేయవు. ఏదోక విధంగా ప్రజలను మభ్యపెట్టో, ఓట్లు కొనుక్కునో, మద్యం పోయించో, తాత్కాలిక తాయిలాల పథకాలను ప్రకటించో అధికారంలోకి రావటం, ఒకసారి గద్దెనెక్కాక పెట్టిన పెట్టుబడికి పదింతలు ప్రజాధనాన్ని దోచుకోవటం– ఈ రెండు ప్రక్రియలు

మన రాజకీయ వ్యాపారంలో అంతర్భాగమయ్యాయి. పరిమితమైన ప్రజాధనాన్ని ప్రజల సుస్థిర అభివృద్ధి దిశగా ఎలా వినియోగించాలి అనే అంశం రాజకీయ చర్చలో చోటు చేసుకోవటం లేదు. కేవలం ఎత్తులకి పైఎత్తులు, కొందరు వ్యక్తుల అధికార దాహం మాత్రమే రాజకీయంగా చెలామణి అవుతోంది. ప్రజలకు వివిధ పథకాల మీద చేయాల్సిన ఖర్చుతోపాటు కొన్ని రకాల సబ్సిడీలు ఇవ్వటం కచ్చితంగా అవసరం. అయితే ఎలాంటి సబ్సిడీలను ఇవ్వటం ప్రజాసంక్షేమానికి అవసరం? అనే విచక్షణ, దాని మీద చర్చ లేకుండా పోయాయి. దాని వల్ల అపారమైన ప్రజాధనం, భవిష్యత్తు అభివృద్ధి నష్టపోవాల్సి వస్తోంది.

**మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన రాయితీలకు చివరి ప్రాధాన్యత ఇస్తున్నారు**

తొలి ప్రాథమ్యంగా సబ్సిడీ ఇవ్వాల్సిన రంగాల్లో అందరికీ మంచి ప్రమాణాల విద్య, అందరికీ ఉచితంగా సరైన ఆరోగ్యసేవలు కీలకంకాగా.. పారిశుద్ధ్యం, సహజవనరుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, కాలుష్య నివారణలను కూడా ఇందులో భాగంగా చేయవచ్చు. ఈ రంగాలలో సేవలకి రుసుము చెల్లించాల్సి వస్తే.. పుట్టుకతో వివక్షకి గురయ్యే వర్గాలు, పేద కుటుంబాలలో పుట్టిన పిల్లలు ఈ సేవలను అందుకోలేరు. అందుకే ఈ విభాగంలో ప్రభుత్వం సబ్సిడీలను ఇవ్వటం తప్పనిసరి. విద్య, ఆరోగ్యం కేవలం డబ్బున్నవారికే అందితే, తరతరాలుగా పుట్టుకతో వచ్చిన అసమానతలను కొనసాగించినవారమవుతాం. అందరికీ కనీస అవకాశాలు కల్పించాలంటే ఈ సేవలను మంచి ప్రమాణాలతో ఉచితంగా అందించాల్సిందే. రెండోది, కొన్ని సేవలు ఉమ్మడిగా అందరికీ పనికొస్తాయి. కాబట్టి, వాటికి రుసుము వసూలుచేయటం సాధ్యం కాదు. వీటికి ద్వితీయ ప్రాధాన్యత ఇవ్వాలి. ఉదాహరణకి, రహదారులు, అడవుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ. ఇవి అందరికీ ఉపయోగపడతాయి. వాటికి పౌరుల నుంచి ప్రత్యేక సందర్భాల్లో తప్ప రుసుము వసూలు చేయలేము. కాబట్టి పన్నుల డబ్బుతో వాటిని నిర్వహించటం అవసరం. ఈ రెండు రూపాలలో ప్రజాధనాన్ని సబ్సిడీగా వినియోగించాలి.

ఇలా ఉమ్మడి అవసరాలకు, కనీస అవసరాలు అందరికీ అందటానికి కాకుండా వ్యక్తులకి ప్రత్యక్షంగా సహాయం అందించే ఇతర సేవలు చాలా ఉన్నాయి. ఇలాంటి సేవలలో కూడా సబ్సిడీలు కొంతమేరకు అవసరం. ఈ రంగాలలో సేవలకు వెలకట్టవచ్చు. ఇవి ఉమ్మడి సేవలు కావు. ఆహారం, విద్యుత్తు, సాగునీరు, మంచినీటి సరఫరా, వడ్డీల రాయితీలు, నిరుపేదలను ఆదుకునేందుకు పథకాలు- ఇలాంటివన్నీ ఈ కోవకి చెందుతాయి. వీటికి సబ్సిడీల్లో మూడో ప్రాధాన్యత ఇవ్వాలి.

ఈ విధంగా.. కీలకమైన విద్య, ఆరోగ్యాలకు ప్రభుత్వం గరిష్ఠంగా సబ్సిడీలనివ్వటం అవసరంకాగా, వ్యక్తులకు రాయితీలనిచ్చే సేవలకు పరిమితంగానే సబ్సిడీలనందించాలి (నిస్సహాయులు, వృద్ధులు ఎంతమందున్నా వారికి అన్నీ ఉచితంగా ఇవ్వొచ్చు. వాటిని వ్యక్తులకిచ్చే సబ్సిడీల్లో భాగంగా చూడకూడదు).

ఉన్న డబ్బంతా వడ్డీ రాయితీలకో, ఉచితాలకో ఇచ్చేస్తే, విద్యకి, ఆరోగ్యానికి, ఉమ్మడి సేవలకు వనరులుండవు. కొండ నాలుకకి మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన అవుతుంది. ఇక్కడే సమస్య ఉత్పన్నమవుతోంది. మన దేశంలో, ముఖ్యంగా రాష్ట్రాల స్థాయిలో ప్రభుత్వాల ప్రాథమ్యాలు అధ్వాన్నంగా ఉన్నాయి. సబ్సిడీలలో 35శాతం విద్య, ఆరోగ్యం, ఉమ్మడి సేవలకు అందుతుండగా, 65శాతం వ్యక్తులకి రాయితీలనిచ్చే ఇతర సేవలకి అందుతోంది. సరైన రాజకీయానికి ఇది పూర్తి విరుద్ధం.

సరైన రాజకీయంలో మూడింట రెండువంతుల సబ్సిడీల్ని రాజ్యవ్యవస్థ బాధ్యతలకు సంబంధించిన సేవలకి వెచ్చించి, మిగిలిన ఒక భాగాన్ని మాత్రమే వ్యక్తులకిచ్చే రాయితీలకు అందించాలి. నేరుగా ఇచ్చే రాయితీల చుట్టూనే సంక్షేమాన్ని, పాలనను నడుపుతూ ప్రధానమై కీలక సేవలను విస్మరిస్తే ఈరోజు మన పబ్బం గడుపుకోవటం కోసం బిడ్డల భవిష్యత్తును తాకట్టుపెట్టిన వాళ్లమవుతాం. ఆకలిగొన్న మనిషి తన శరీర మాంసాన్ని తానే తింటే ఎంత ప్రమాదమో, రేపటి పిల్లల భవిష్యత్తును హరించి ఈవేళ ప్రజాధనంతో భ్రమలు కల్పించటం అంతే ప్రమాదం.

ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్యాలలోనూ తొలిదశలో ఇలాంటి అపరిపక్వత, అవినీతి చోటుచేసుకున్నాయి. అయితే కాలక్రమేణా ప్రజలలో విద్య, ఆలోచన, అవగాహన పెరగటంతో మంచి మార్పులు సాధ్యమయ్యాయి. గతంలో చోటుచేసుకున్న భావాలు నశించి వాటి స్థానంలో మానవ విలువలు నిలదొక్కుకున్నాయి. పుట్టుకతో నిమిత్తం లేకుండా ప్రతి మనిషీ సమాన గౌరవానికి అర్హుడు/ అర్హురాలు అనే భావన, అందరికీ సమాన హక్కులున్నాయనే స్పృహ పెరిగి ప్రజాస్వామ్యంలోని అపశృతులను ఆ సమాజాలు కాలక్రమేణా తొలగించగలిగాయి. అలా మంచి ప్రజాస్వామ్యానికి గట్టి పునాదులు పడ్డాయి. పేదరికాన్ని అతి త్వరగా, సమర్థంగా నిర్మూలించటానికి అందరికీ మంచి ప్రమాణాల విద్య, ప్రతి కుటుంబానికి ఉచితంగా మంచి ఆరోగ్య సేవలు మొట్టమొదటి అవసరాలు అని ప్రపంచమంతటా గత శతాబ్దకాలపు అనుభవాలు మనకు విలువైన పాఠాలను నేర్పాయి. కష్టంలో ఉన్నవారిని తక్షణం ఆదుకోవటం అవసరమే. కానీ ప్రజల్ని అక్కడికే పరిమితం చేసి తాత్కాలిక తాయిలాలతో ఆ కుటుంబాలు ఏనాటికీ ఆదాయం పెంచుకోకుండా, సంపద సృష్టిలో పాలుపంచుకోకుండా, ఆత్మగౌరవంతో తలెత్తుకు తిరగకుండా, శాశ్వతంగా వారిని పరాధీనులను చేస్తే అది పేదలు నిరంతరం పేదలుగా కొనసాగిస్తుందే తప్ప వారి జీవితాల్లో మార్పును తీసుకురాదు. చైనీస్ సామెతలో చెప్పినట్టుగా, ఆకలిగా ఉన్న వ్యక్తికి చేపల కూర

# దీర్ఘకాలిక దృష్టి లోపం వల్లే..

మంచి విద్య, ఆరోగ్యం... రాజకీయానికి కేంద్రబిందువు కావాలి. ప్రభుత్వానికి అవి తొట్టతొలి ప్రాథమ్యాలు కావాలి. మనకున్న వనరులు అపారం కాకపోయినా తక్కువేమీ కాదు. జాతీయస్థాయి ప్రభుత్వం బడ్జెట్ రూ.35 లక్షల కోట్లు దాకా ఉంటే, మన తెలుగు రాష్ట్రాల్లో ఒక్కొక్కటి సుమారు రూ.2 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నాయి. ఈ డబ్బంతా ప్రజల సొంతమే, వారి పన్నుల డబ్బే. పథకాల్లో అవినీతిని కాసేపు అలా ఉంచితే.. సంక్షేమాన్ని, అభివృద్ధిని తాత్కాలిక దృష్టితో, సంకుచిత దృక్పథంతో చూడటం వల్ల ప్రజలు స్వావలంబన, ఆత్మగౌరవాన్ని సాధించేదిశగా కాకుండా, నిరంతరం సహాయం కోసం ప్రభుత్వం ముందు చేతులు జాచేవారుగా మిగిలేరీతిలో ఆ డబ్బును ఖర్చు చేస్తున్నారు.

మనదేశంలో తొలి నుంచి పాలకులు అనుసరించిన విధానాలు మానవ వనరులను అభివృద్ధి చేసే పరిణామాలను అడ్డుకుంటున్నాయి. మొదటిది, వ్యక్తి వికాసానికి అవసరమైన విద్యని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయటం. పుట్టిన ప్రతి బిడ్డకి ప్రకృతి ఎన్నో తెలివితేటల్ని, శక్తిసామర్థ్యాలను ప్రసాదించింది. మనిషి ఆ తెలివిని వినియోగించటం నేర్చుకున్నాడు కాబట్టే మానవాళి ఒక సమాజంగా ఇంతగా ప్రగతి సాధించింది. ఇతరుల అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోవటం, ఇతరులకు తెలిసింది తాము నేర్చుకుని ఆచరణలో పెట్టటం, తరువాతి తరాల వారికి మన పరిజ్ఞానాన్ని అందించటం మానవాళికున్న ప్రత్యేక లక్షణాలు. అందుకు విద్య అవసరం. అలాగే నివారించగలిగిన జబ్బులని తొలగించి, ఆరోగ్యాన్నిచ్చి, సంపద సృష్టిలో అందరూ పాల్గొనేలా చేయటం తొలిసారిగా మానవజాతికే అందిన వరం. తగిన ఆయుర్దాయం, మంచి ఆరోగ్యం సమాజం మనుగడకి, సంపద సృష్టికి, జీవితంలో భవిష్యత్తు పట్ల భరోసాకి కీలకమైనవి. స్వతంత్ర భారతంలో మనం చేసిన అతిపెద్ద తప్పిదం ఈ విద్య, ఆరోగ్యాలకు పెద్దపీట వేయకపోవటం. రెండో ప్రపంచ యుద్ధం తరువాత వలస పాలన నుంచి విముక్తి చెందిన చాలా దేశాలు విద్య, ఆరోగ్యాలలో మనతో పోలిస్తే ఎంతో అభివృద్ధిని సాధించాయి. మన పొరుగున ఉన్న శ్రీలంక, ఆగ్నేయాసియాలోని మలేసియా ఇందుకు మంచి ఉదాహరణలు. అలాగే దుర్భర దారిద్ర్యంలో మగ్గిన టాంజానియాలాంటి ఆఫ్రికా దేశాలు కూడా అందరికీ మంచి ప్రమాణాల విద్యను అందించాయి. అందరికీ విద్య అందించని ఏ సమాజమూ దీర్ఘకాలిక అభివృద్ధిని సాధించలేదు. జపాన్‌లో 'మెయిజీ రెస్టొరేషన్' తర్వాత దేశంలో అందరికీ విద్యను అందించారు. ఆనాటి నుంచి జపాన్ ఆసియాలోని మేటిదేశంగా అభివృద్ధిని సాధించింది. మనదేశంలో విద్య, ఆరోగ్యాలని గురించి నేతలు 1947 నుంచి మాట్లాడుతూ వచ్చారు. కానీ అందరికీ వాటిని తక్షణ ప్రాధాన్యతతో అందించాలనే స్పృహ, అందుకు కావలసిన సంకల్పం కొరవడింది. అందుకే రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలో రాసుకున్నా, విద్యాహక్కు చట్టం తెచ్చినా అందరికీ విద్య నేటికీ కోట్లాదిమందికి ఎండమావి అయింది. విద్య కొందరికే అందటం, కులవివక్షకి, అసమానతలకి గురవుతున్న కుటుంబాలకి ఎదిగే అవకాశాలు కొరవడటం మన అభివృద్ధి నమూనాలో కీలకాంశాలుగా తయారయ్యాయి. దాంతో చట్టంలో అందరికీ సమాన హక్కుల్ని కల్పించుకున్నా, ఆచరణలో అమలు కాలేదు. విద్య అందకపోవటంతో కూలీ కొడుకు కూలీగాను, పనిమనిషి కూతురు పనిమనిషిగాను బతకాల్సి వస్తోంది. విద్య ద్వారా సంపద సృష్టించే శక్తి అందనప్పుడు సహజంగానే అసమానతలు పెరుగుతాయి. ఇలా పుట్టిన కులం, కుటుంబం కారణంగా వచ్చిన అసమానతలు కొనసాగటానికి మనం చేపట్టిన విధానాలు కారణమయ్యాయి. ఈ అవిద్య, పేదరికం మన ప్రజాస్వామ్యాన్ని, స్వపరిపాలనను మరింత బలహీనపరిచాయి. విద్య లేక పేదరికంలో మగ్గే ప్రజలు డబ్బుకో, మద్యానికో లొంగిపోవటం తేలిక. ఇలా పరాధీనులయి, ప్రలోభాలకు తేలిగ్గా లొంగే ఓటర్లుండటం పెత్తందారులకి అవసరం. ఈ విధంగా అపసవ్య విధానాలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచగా, ప్రజాస్వామ్యంలోని ఈ లోపాల వల్ల విద్య, ఆరోగ్య రంగాలపై శ్రద్ధ తగ్గింది. ఇలా ఒక విషవలయంలో చిక్కుకున్నాం. ఈ వలయాన్ని ఛేదించాలంటే అందరికీ మంచి ప్రమాణాల విద్యను, ఆరోగ్యాన్ని ఉచితంగా అందించే ఏర్పాటును ప్రభుత్వం తొలి ప్రాథమ్యం చేసుకోవాలి. అందుకోసం అవసరమైన నిధుల్ని కేటాయిస్తేనే, సక్రమంగా వినియోగిస్తేనే ప్రజల పన్నుల డబ్బును సద్వినియోగం చేసినట్టు.

వండి పెడితే ఆ పూటకి కడుపు నిండుతుంది. దాంతోపాటు ఆ వ్యక్తికి చేపలు పట్టటం నేర్పి గాలాన్ని ఇస్తే అతను/ ఆమె కుటుంబం శాశ్వతంగా ఆకలిబాధ నుంచి బైటపడుతుంది. ఈరోజు ఆకలి సమస్య పైకి పెద్దగా కన్పించకపోవచ్చు, కానీ పౌష్టికాహారం తినే పరిస్థితి ఇంకా లక్షలాది కుటుంబాలకు లేదు. అన్నీ చౌకగా అందుబాటులో ఉన్నట్టుంటాయి, సకల సౌకర్యాలూ కళ్లముందు కన్పిస్తుంటాయి కానీ ఏవీ అనుభవంలోకి రావు. పేదలు మధ్యతరగతిగా రూపుదిద్దుకున్నారన్న మాటేగాని, వారి జీవితం అనుక్షణం అనిశ్చితితో, అభద్రతతో నిండిపోయింది... పేదలు శాశ్వతంగా పేదరికంలో మగ్గాలని, అణగారిన వర్గాలు నిరంతరం అక్షర జ్ఞానం లేనివారిగానే ఉండాలని, సామాన్యులు ఆరోగ్యం అందకుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాలని కోరుకోవటం అమానుషం. ఈ రాజకీయ దృక్పథాన్ని మార్చి, అందరికీ అవకాశాలను కల్పించే ప్రజాస్వామ్య సంస్కృతిని ఏర్పరిస్తేనే మనం స్థిరమైన సంపద సృష్టి దిశగా వెళ్లగలం. ఈ పరిస్థితి సమూలంగా మార్చటానికి విద్య,

ఆరోగ్యరంగాల్లో పటిష్ఠ చర్యలే మార్గం.

విద్య, ఆరోగ్య రంగాల్లో సమూల ప్రక్షాళనతోపాటు వాటిని అమలుచేయటానికి వీలుగా పాలనావ్యవస్థను పూర్తిగా సంస్కరించాల్సి ఉంది. ఈ రెండు రంగాల్లో ప్రతి మార్పు అమలై ప్రజలు తలెత్తుకుని సొంతకాళ్ల మీద నిలబడాలంటే, అధికారాన్ని సంపూర్ణంగా వికేంద్రీకరించాలి. బలమైన స్థానిక ప్రభుత్వాలు, ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే మనం ఆశించిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం అమలులో పూర్తి విజయం సాధించగలుగుతాం. కొవిడ్ బహుముఖ సంక్షోభం తర్వాతైనా పాలకులు ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందిస్తూ సుపరిపాలనకు నాంది పలకాలి.

**(సోర్స్: లోక్‌సత్తా జేపీ ప్రసంగాలు)**

# భీమసింగి ఫ్యాక్టరీ ఆధునీకరణపై ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలి



విజయనగరం జిల్లాలో ఎంతో కీలకమైన భీమసింగి సహకార చక్కెర కర్మాగారాన్ని ఆధునీకరించి తిరిగి యధావిధిగా చెరకు గానుగయ్యేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష రాజకీయ నేతలు కోరారు. ఫ్యాక్టరీ వద్ద చెరకు రైతులతో కలసి సమావేశం నిర్వహించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి శతజయంతి నివాళులు అర్పించి, ఫ్యాక్టరీ ప్రాంగణంలోని పీవీజీ రాజు విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం చర్చ ప్రారంభించారు. సీపీఐ రాష్ట్ర ప్రతినిధి ఎం.కామేశ్వరరావు సభకు అధ్యక్షత వహిస్తూ, ప్రతిష్ఠాత్మకమైన సుగర్ ఫ్యాక్టరీని ఉద్దేశపూర్వకంగానే నష్టాలపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, ఫ్యాక్టరీని ఆధునీకరించి తిరిగి రైతులకు అందించేందుకు, కార్మికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటానని ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసినప్పుడు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, ముఖ్యమంత్రిగా మడమ తిప్పకుండా ఆ మాటను నిలబెట్టుకోవాలన్నారు. భీమసింగి సహకార ఫ్యాక్టరీ పునరుజ్జీవనానికి పార్టీలకతీతంగా లోక్‌సత్తా కృషి చేస్తోందన్నారు. ఇది ఏ ఒక్కరి ప్రయత్నం కాదని, జిల్లా మంత్రులు సహా అందరూ కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. జామి మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ జెడ్పీటీసీ బండారు పెదబాబు మాట్లాడుతూ, సుగర్ ఫ్యాక్టరీ కోసం ఎంతోమంది త్యాగాలు చేశారని, రూ.5 కోట్ల రూపాయలు వెచ్చిస్తే కర్మాగారం ఆధునీకరణ జరుగుతుందని అన్నారు. సీపీఎం నేత టీవీ రమణ పార్టీ తరపున చెరకు రైతులకు, కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. లాక్‌డౌన్ పూర్తిగా ఎత్తివేసిన అనంతరం రైతులతో పెద్దఎత్తున సమావేశం నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. అనంతరం అఖిలపక్ష నేతలు సుగర్ ఫ్యాక్టరీ ఎండీ విక్టర్ రాజుని కలిసి డిమాండ్లను తెలిపారు. ప్రభుత్వం అడిగిన అన్ని వివరాలనూ అందించామని, ఫ్యాక్టరీ తిరిగి తెరవాలని తాను కూడా కోరుకుంటున్నానని ఆయన అన్నారు. అఖిలపక్ష సమావేశంలో ఎస్.కోట మాజీ ఎంపీటీసీ భీశెట్టి అరుణ, గౌరి మిల్క్ సొసైటీ అధ్యక్షుడు సన్యాసి నాయుడు, జనసేన జిల్లా అధికార ప్రతినిధి మిడతాన రవి, యోగేష్, లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రతినిధి కాండ్రేగుల ప్రసాద్, రాజారావు, తెలుగుదేశం పార్టీ నేతలు బొద్దల నర్సింగరావు, పోలినాయుడు, నడుపూరి రాంబాబు, శ్రీనివాసరావు, గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర ప్రతినిధి ఇప్పలవలస గోపి, కార్మిక నాయకుడు కృష్ణంరాజు, రైతు నాయకులు వేండ్రపు ప్రకాశరావు, అప్పల నాయుడు, మాజీ సర్పంచ్‌లు స్వామినాయుడు, ఎన్నిటి అప్పలరాజు, మూర్తి నారాయణ, గొర్లి రామాంజనేయులు, అప్పుడు (జొన్నవలస) మాజీ జెడ్పీటీసీ దామోదరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సామాజిక కార్యకర్తలు గార పెంటయ్య, పాలుపర్తి సత్యం, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

**వ్యక్తిగత విమర్శల్ని అందరూ ఖండించాలి**

అంతకుముందు విజయనగరంలో భీశెట్టి బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ, తెదేపా సీనియర్ నేత అశోక్ గజపతి రాజుపై కొందరు వైకాపా నేతలు చేసిన వ్యక్తిగత విమర్శలను ఖండించారు. ఇది పార్టీల వ్యవహారం కాదని, వైకాపా కార్యకర్తల్లో కూడా పలువురు ఈ రకమైన విమర్శల పట్ల నొచ్చుకుంటున్నారని అన్నారు. అశోక్ గజపతి రాజు నేరం చేసి ఉంటే చట్టప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవచ్చని, అంతే తప్ప దశాబ్దాలపాటు మచ్చలేని రాజకీయ జీవితం గడిపిన నేతపై దిగజారుడు వ్యాఖ్యలు చేయటం సహించరానిదన్నారు. రాజకీయాలలో బహిరంగ చర్చ ప్రమాణాలను పాటించేలా ప్రతి పార్టీ చర్యలు తీసుకోవాలన్నారు.

# వీధి బాలల గుర్తింపులో మలుపు

**ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ 'ఆపరేషన్ ముస్కాన్'లో భాగంగా గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది మే మాసం మధ్యలో 34,037 మంది బాలల్ని సంరక్షించింది (వీరిలో అత్యధిక శాతం బీసీలు కాగా, ఆ తర్వాత ముస్లింలు, ఎస్.సి, ఎస్.టిలు). 2020 అక్టోబర్‌లో చేపట్టిన ఒక్క డ్రైవ్‌లోనే 16,400 మంది పిల్లల్ని గుర్తించారు. ఇది దేశంలోనే పెద్ద సంఖ్య అని రాష్ట్ర డీజీపీ అప్పట్లో వ్యాఖ్యానించారు. దానిపై అభివృద్ధి-సామాజిక అంశాల వ్యాఖ్యాత జాన్‌సన్ చోరగుడి 'సాక్షి' పత్రికలో ఒక వ్యాసం రాశారు. ఏపీలో ఇలా దయనీయ స్థితిలో బాలల ఉదంతాలు పెద్దసంఖ్యలో బయటపడుతున్నందున ఆ వ్యాసాన్ని జనబలం ఈ సంచికలో ప్రచురిస్తున్నాం..**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖ పోలీసు సంస్మరణ దినం సందర్భంగా 2020 అక్టోబర్‌లో 'ఆపరేషన్ ముస్కాన్' పేరుతో నాలుగు రోజులపాటు నిర్వహించిన 'మిస్సింగ్' పిల్లల గాలింపు చర్యల్లో 16,400 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లల్ని 'వీధి బాలలు'గా గుర్తించి రక్షణ కల్పించింది. ఒడిషా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఈ పిల్లల్లో పెద్దసంఖ్యలో బాలికలు కూడా ఉన్నారు. వీరంతా ఏపీలో పలు పరిశ్రమలు, రెస్టారెంట్లలోనూ, వ్యవసాయ పనులలోనూ, మరికొందరు భిక్షాటనలోనూ ఎటువంటి భద్రతలేని పరిస్థితుల్లో ఉన్నారు. గతంలో నిర్వహించిన ఆరవ 'డ్రైవ్'లో 4,800 మంది పిల్లల్ని గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించామనీ, అయితే ఈ ఏడవ డ్రైవ్‌లో 16,400 మంది దొరకడం అంటే ఇది దేశంలోనే పెద్దసంఖ్య అనీ డీజీపీ గౌతం సవాంగ్ అంటున్నారు.

ఈ పరిణామం మూలాల కోసం ఇక్కడ్నుంచి మనం కొన్ని నెలలు వెనక్కి వెళ్లి చూసినప్పుడు, అప్పటికి మన దేశం కొవిడ్ కారణంగా లాక్‌డౌన్‌లో ఉంది. ఏప్రిల్-మే నాటికి వలస కార్మికుల దుస్థితి, పరిష్కారానికి అలవికాని స్థాయికి చేరింది. ఈ దశలో అందరూ కేంద్ర ప్రభుత్వం వైపు ఆశగా చూసినప్పటికీ, 'అస్సలు వాళ్లంతా ఏ రాష్ట్రాలవారు, వాళ్లు ఎక్కడికి వలస వెళ్లి ఏమి చేస్తున్నారు వంటి గణాంకాలు ఏవీ తమ వద్ద లేవు" అని ప్రభుత్వం పార్లమెంట్‌లోనే నిస్సహాయతను వ్యక్తం చేసింది. అయితే పనిస్థలం నుంచి స్వస్థలాలకు తిరుగు ప్రయాణానికి ఇటు దక్షిణాది రాష్ట్రాలకు అటు సెంట్రల్ ఇండియాకు భౌగోళికంగా మధ్యన ఉన్న ఏపీ.. వలస కార్మికులకు ఒక వారధిగా నిలిచింది. అయితే ఇది జరిగిన ఆరు నెలలలోనే మళ్లీ అవే రాష్ట్రాలకు చెందిన బాలలు పెద్దసంఖ్యలో ఇక్కడ బతుకుతెరువు వెతుకులాటలో, అమానవీయ పరిస్థితుల్లో పరిపాలనా యంత్రాంగం నిఘా దృష్టికి రావడం, లోతైన అధ్యయనం అవసరమైన అంశం అవుతున్నది. అయితే గడచిన 3 దశాబ్దాల్లో ఇక్కడ సామాజిక శాస్త్రాల చదువులు అటకెక్కడం కూడా మనం మర్చిపోకూడదు.



కరోనా వైరస్ సమస్య 'ఎపిడమిక్' స్థాయికి చేరాక, మొదట ఈ పిల్లల తల్లిదండ్రులు, ఆ తర్వాత పిల్లలకు ఆంధ్రప్రదేశ్ మజిలీ స్థావరం కావడానికి, రాష్ట్ర భౌగోళిక 'ప్రాధాన్యతా స్థానం' ఒక్కటే కాకుండా, ఇతర కారణాలూ ఉన్నాయి. 1. తూర్పు కనుమలలో ఆ రాష్ట్రాలను కేంద్ర హోం శాఖ తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాలుగా వర్గీకరించడం 2. ఈ బాలలు పెద్దఎత్తున ఖనిజ వనరుల తవ్వకాలు జరుగుతున్న రాష్ట్రాలకు చెందినవారు కావడం, 3. ప్రాజెక్టు నిర్వాసితుల్లో ఇంకా కొందరికి ప్రభుత్వ రికార్డుల్లో చోటు లేక సహాయం అందకపోవడం 4. స్థానిక సామాజిక ఆర్థిక పరిస్థితుల్లో ఈ కుటుంబాలకు ఉపాధి లేకపోవడం వంటి అంశాలున్నాయి. లోతుల్లోకి వెళితే తెలియనివి ఎన్నో ఉండొచ్చు.


అయితే, అందుబాటులో ఇంత పెద్ద సంఖ్యలో వీధి బాలలు ఉంటే, రేపు వీరి నిస్సహాయతను క్యాష్ చేసుకునేవారికి వీరు చౌకైన కూలీలు అవుతారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే సంపూర్ణ మద్యనిషేధం వైపు అడుగులు వేస్తున్నప్పుడు, హిందీ భాష మాట్లాడగలిగిన ఈ పిల్లల్ని మున్ముందు ఇక్కడి చీకటి శక్తులు అసాంఘిక చర్యలకు వాడుకోవడం తేలిక. ప్రతిపాదిత పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం తర్వాత కోస్తాంధ్రలో రూపుతీసుకునే నేరమయ సామాజిక ముఖచిత్రం పట్ల, మన ముందస్తు అప్రమత్తత అవసరాన్ని '2020 ఆపరేషన్ ముస్కాన్' వెలుగులోకి తెచ్చింది.

ప్రాజెక్టుల నిర్వాసితులకు అసంపూర్ణ పునరావాస చర్యలు కూడా వీధిబాలల సమస్యలో భాగంగా ఉన్నాయి. భారత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 'ఆర్ – ఆర్ – 2013 ప్యాకేజీ' హైదరాబాద్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీలోనే తయారైంది. అది రూపొందించిన 'సామాజిక ప్రభావిత అంచనా' ప్రమాణాలు దక్షిణ ఆసియాలోనే అత్యంత సమగ్రమైనవిగా ప్రపంచ బ్యాంక్ గుర్తించింది. అటువంటప్పుడు ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ స్పృహ ఉంటుందనీ, ఉండాలనీ మనం ఆశిస్తాం. పోలవరం ఆదివాసీ నిర్వాసితుల పునరావాసం విషయంలో ఈ చట్టం స్ఫూర్తిని నిజాయతీతో మనం అమలు చేయాలి. అటువంటిదే నల్లమల అటవీ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కూడా. ✦

# ఎన్ని పథకాలున్నా ఆగని వలసలు

## డాక్టర్ పోలం సైదులు

ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలి వెళ్లడాన్ని వలసలు అంటారు. ఇవి విభిన్న రకాలుగా ఉంటాయి. ఒక ఊరి నుండి మరొక ఊరికి, పల్లె నుండి పట్నానికి, పట్నం నుండి పల్లెకు, ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి, ఒక దేశం నుండి మరొక దేశానికి, ఒక ఖండం నుండి మరొక ఖండానికి వలసలు వెళుతుంటారు. వలసలు వెళ్లడానికి సైతం విభిన్న పరిస్థితుల నేపథ్యం ఉంటుంది. పెళ్లిళ్ల రీత్యా, చదువుల నిమిత్తం కొందరైతే, బతుకుతెరువుకై కొందరు, వ్యాపార నిమిత్తం మరికొందరు వలసలు వెళ్తుంటారు. తెలంగాణ ప్రాంతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుండి వలస కూలీలు మహారాష్ట్ర, హైదరాబాద్, కువైట్, దుబాయ్ తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లిన సందర్భాలెన్నిటినో చూశాం. ప్రభుత్వం సైతం వాటిని నియంత్రించడానికి పలు పథకాలను ప్రవేశపెట్టినప్పటికీ అనుకున్నంత ప్రగతి సాధించలేదన్నది నిజం. పరిస్థితి ఏదో గుడ్డి కంటే మెల్ల నయం అన్నట్లుగా ఉన్నదన్నది నగ్న సత్యం.



మన తెలంగాణ రాష్ట్ర వలస బతుకులు అందరికీ తెలిసినవే. కానీ మన దేశంలోని ఇతర రాష్ట్రాల నుండి మన రాష్ట్రానికి వచ్చిన వారి బతుకులను ఒక్కసారి పరిశీలిస్తే.. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచమే ఒక కుగ్రామంగా తయారయ్యింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్లలో చేపట్టే అభివృద్ధి పథకాలను కాంట్రాక్టర్లకు అప్పగించటం ఆనవాయితీ. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, ఒడిషా, తెలంగాణ ప్రజలు భాగ్యనగరంలో చేసే పనులను చూస్తే.. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో పనిచేసేవారి గురించి తెలుసుకుంటే గుండె తరుక్కుమనక మానదు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి కూడా పట్నాలకు వలసలు వెళ్తున్నారు. ఈ కార్మికులు భవనాల నిర్మాణంలో ఎక్కువగా పనిచేస్తూ, చిన్న, చితక పనులు చేయడానికి సైతం మొగ్గు చూపుతున్నారు. వారి సంపాదన తక్కువగా ఉండి ఖర్చులు అధికంగా ఉండటం మూలంగా నగరాలలో దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటూ కాలం గడుపుతుంటారు. కొంతమంది తెలంగాణలోని ధనవంతులు జాతీయ రహదారులకు ఇరువైపుల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి అందులో వివిధ పండ్ల తోటల పెంపకం చేపడుతూ వాటిల్లో పనిచేయడానికి బీహార్ రాష్ట్రం నుంచి వచ్చే వలస కార్మికులను నియమించుకుంటున్నారు. అలాగే బడా కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో జరిగే వివిధ రహదారులు, రకరకాల బ్రిడ్జిలు, వంతెనలు, డ్యామ్‌ల నిర్మాణంలోనూ ఎక్కువగా ఆ ప్రాంతానికి చెందిన వారుంటారు. బోర్‌వెల్స్‌లో పనిచేసే కార్మికుల్లో అత్యధికమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీలై ఉంటారు. కుటుంబానికి దూరంగా ఉంటూ, ఎలాంటి లాభార్జన లేకుండా ఏదో మోటు కష్టానికే పరిమితమై పనిచేస్తూ, ఎప్పుడు ఎక్కడ ఉంటారో తమకే తెలియకుండా పనిచేస్తూ కాలం గడుపుతుంటారు.

భాగ్యనగరంలో ఇటుకల తయారీలో ఎక్కువగా ఒడిషా రాష్ట్రానికి చెందిన వారుంటారు. వారు నామమాత్రపు డబ్బులు తీసుకొని, యజమానుల క్రింద పనిచేస్తుంటారు. పేదరికంతో ముందుగానే వారి వద్ద డబ్బులు తీసుకొని, అప్పు తీర్చటానికి నెలలకొద్దీ పనిచేస్తుంటారు. ఉత్తర ప్రదేశ్ నుంచి సైతం తెలంగాణకు వలసలు వచ్చి పండ్ల తోటలలో పనిచేస్తున్నవారు కొందరైతే, జార్ఖండ్ నుంచి ఇక్కడకు వచ్చి ఆకలితో చనిపోవడం లాంటి వార్తలను కూడా వివిధ దినపత్రికల్లో చూశాము. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడ సమీపంలోకి వెళ్తే ప్రత్యక్షంగా వలస కూలీల బతుకులను దగ్గరగా చూడవచ్చు. వారితో సంభాషిస్తే బాధలను కథలుగా వినవచ్చు. ఏదో బతుకుతెరువుకై వచ్చి నాలుగు డబ్బులు సంపాదించుకుని సంతోషంగా గడుపుతున్నారా అంటే.. అదీ లేదు.

ఉద్యోగ భద్రత లేకుండా, వెట్టిచాకిరీ చేయటం వల్ల యజమానులకు కాసుల పంట పండుతోంది కానీ.. వీరికి మాత్రం దినదిన గండంగానే ఉంటోందనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఎన్నో కష్టాలు, మరెన్నో ఛీదరింపులు, వేధింపుల మధ్య పొట్టకూటి కోసం పనిచేస్తున్న వలస కూలీల బతుకులను మార్చేదెవరు?

అన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టినట్లు చెప్పుకుంటున్నాయి. ఆ పథకాల ఫలాలు ఎవరికెళ్తున్నాయో అర్థంగాని పరిస్థితి. దేశంలో సైతం వృద్ధి రేటు పెరుగుతుందని ఏవో సర్వేలు చేసి ఘనంగా చెప్పుకుంటున్నారు తప్ప, ఎక్కడున్నది అభివృద్ధి? వీరి బతుకులు మారేదెప్పుడు? వీరి భద్రతకు ఎవరు భరోసానిస్తారు?.. అర్థం కాకుండా ఉన్నదనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. మెరుగైన అవకాశాల కోసం వలసలు పోవడంలో తప్పులేదుగానీ, గతిలేక పొట్ట చేత పట్టుకుని వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఉండకూడదు. అలాంటి వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ రక్షణ గావిస్తూ, నాలుగు డబ్బులు సంపాదించుకుని కుటుంబంతో సంతోషంగా గడిపే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశంలో రోజురోజుకు నిరుద్యోగిత పెరిగిపోతున్నది. ఎలాంటి ఉన్నతమైన చదువులు అభ్యసించినా నేటికీ అనేకమంది యువత తల్లిదండ్రులపై ఆధారపడి జీవించే పరిస్థితులు నెలకొన్నాయి. పేదవారి పరిస్థితులను తెలపాలంటే.. రాస్తే రామాయణమంత, చెబితే మహాభారతమంత ఉంటుదనటంలో నిజం లేకపోలేదు. ఎక్కడ అభివృద్ధి జరుగుతోందో ప్రభుత్వాలు పునఃపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేటి ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలనాధికారులు ఇచ్చే ఉపన్యాసాల జోరు అంతా ఇంతా గాదు. కానీ ఆచరణలో మాత్రం ఉండాల్సినంత ఉండదు. ఎవరైనా అవే విషయాలను ప్రస్తావిస్తే, దాటవేసిన సందర్భాలు కోకొల్లలు. ఏ ప్రభుత్వం వచ్చినా పేద, నిమ్న వర్గాలకు చెందిన ప్రజల బతుకులకు భరోసా లేనప్పుడు ఈ ప్రభుత్వాలెందుకో అర్థం కాని పరిస్థితి. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా పాలకులు, పరిపాలనా యంత్రాంగం మాటలు ఆపి ఆచరణలో ప్రజలకోసం పనిచేయాల్సి ఉంది. వలసలు వెళ్లిన వారికి కనీస వసతులు, ఎదిగే అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. ఇక ముందు మెరుగైన అవకాశాల కోసం, ఇష్టపూర్వకంగా, బాంధవ్యాల కోసం తప్ప.. ఎవరూ పొట్ట చేత పట్టుకుని వలసలు పోవాల్సిన అవసరం లేకుండా స్థానికంగా ఎక్కడికక్కడ అభివృద్ధి జరిగేలా చేయాలి. మౌలిక వసతుల్ని బాగా అభివృద్ధి చేయాలి. విద్య, ఆరోగ్యాలను సమూలంగా బాగు చేయాలి. ఇవి చేయకుండా.. ఏవో పథకాలను చేపట్టి ఓట్లు దండుకోవటానికే పరిమితమైతే పేదరికాన్ని కొనసాగిస్తున్న పాపాన్ని మూటగట్టుకున్నవారే అవుతారు, చరిత్రహీనులవుతారు. ✦

# 'పటిష్ట వైద్యరంగమే' ప్రజారోగ్యానికి 'బీమా'

## -డా॥ జయప్రకాష్ నారాయణ్



నిరుపేదల్లో నెలకొన్న అసంతృప్తికి మొన్నటి లోక్‌సభ ఎన్నికల ఫలితం దర్పణం పట్టిందని చెప్పవచ్చు. అంతమాత్రాన, భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి దిశగా అడుగులు వేయడం లేదని ఎవరూ అనజాలరు. శక్తిసామర్థ్యాలకు తగినట్టుగా మన పనితీరు లేకపోయినా వృద్ధి రేటు మాత్రం ఆరు నుంచి ఏడు శాతం ఉందన్నది నిర్వివాదాంశం. ఇక్కడ రెండు ప్రధాన అంశాలపై దృష్టి సారించవలసిన అవసరం ఉంది. ఎనిమిది శాతం వృద్ధిరేటును సాధించడమన్నది అందులో ఒకటి. ఉత్పాదక రంగాలకు వనరుల కేటాయింపు, సంస్థల పునర్నిర్మాణం, ఖర్చు చేసే ప్రతి రూపాయికి సరైన విలువ రాబట్టడం ద్వారా ఎనిమిది శాతం సుస్థిర వృద్ధిరేటు సాధ్యమవుతుంది. సామాజికంగా, ప్రాంతీయ పరంగా అసమానతలు పెచ్చుమీరిపోతున్నాయన్నది రెండవ అంశం. అలాగే, పెరిగిపోతున్న ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వాలు తీసుకునే అరకొర చర్యలు నెరవేర్చలేకపోతున్నాయి. వీటిని దీటుగా ఎదుర్కోగలగాలి. వాస్తవానికి గత ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పు ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా కాదు, బడుగు జీవుల అవసరాలను, ఆకాంక్షలనూ తీర్చే విధంగా వృద్ధి ప్రక్రియ మరింత ఊపందుకోవాలన్నదే ప్రజాతీర్పులోని ఆంతర్యం.

మరింత వేగవంతంగా అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలన్న అభిప్రాయంతో అంతా ఏకీభవిస్తారు. నిజమే. అయితే, అభివృద్ధిని ఎలా సాధించాలనే విషయంలో స్పష్టత కొరవడింది. మనం కన్న కలలన్నీ సాకారమయ్యేట్టు ఉంటే, పేదరికాన్ని ఎప్పుడో అధిగమించి ఉండేవాళ్లం. వాస్తవంగా, పరిమిత వనరులకూ– అపరిమితమైన ప్రజల ఆకాంక్షలకూ మధ్య సమతూకం సాధించలేక ప్రభుత్వాలు సతమతమవుతూ ఉంటాయి. ధనిక దేశంగా అంతా చెప్పుకునే అమెరికాతో సహా ఏ దేశమూ అవసరాలకు మించిన అదనపు వనరులతో తులతూగటం లేదన్నది కఠోర సత్యం. దశాబ్దానికిపైగా చక్కటి వృద్ధి రేటుతో ప్రగతిబాటలో పయనించిన అమెరికా ఇప్పుడు అనూహ్యమైనరీతిలో ఆర్థిక లోటులో పడటానికి కారణమిదే. 2006 నాటికి అమెరికా ఆర్థికలోటు 82,500 కోట్ల డాలర్లకు (అమెరికా స్థూలదేశీయోత్పత్తిలో 6.4శాతం) చేరుకుంటుందని 'ది ఎకనమిస్ట్' పత్రిక విశ్లేషించింది. ప్రస్తుత మారక విలువ ప్రకారం చూస్తే, 2006 నాటికి అమెరికా ఆర్థికలోటు ఇండియా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) కంటే ఎక్కువగా ఉంటుంది. 'సూపర్ పవర్' అమెరికా పరిస్థితే ఇలా ఉన్నప్పుడు, ఇండియాలాంటి దేశాలు అవసరాలకు తగిన విధంగా వనరులను సమీకరించుకోవడంలో అవరోధాలు ఎదుర్కొంటున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?

**అవకాశాలు అపారం**

అభివృద్ధితోపాటే సమానతనూ సాధించడానికి మనం దృష్టి సారిస్తున్న రంగాలు ఏమైనా ఉన్నాయా? నిజానికి సిద్ధాంతకర్తలు అభివృద్ధిని, సమానతను ఒకదానితో ఒకటి పొంతన లేకుండా వాటిని రెండు భిన్నధృవాలకు పరిమితం చేశారు. గత అనుభవాల నుంచి మనం గుణపాఠాలను నేర్చుకున్నట్లయితే, వృద్ధి, సమానత ఒకదానిని ఒకటి పరస్పరం బలోపేతం చేసినప్పుడే అవి సుస్థిరంగా ఉండగలుగుతాయి. విద్య, ఆరోగ్య పరిరక్షణ, మౌలిక సదుపాయాలు, సహజ వనరుల అభివృద్ధి, చట్టసంస్థలు, సుపరిపాలన వంటి రంగాలన్నీ వృద్ధినీ, సమానతనూ పెంపొందించేవే. ఇతర దేశాలతో పోలిస్తే, కొన్ని రంగాల్లో ఇండియాలో తక్కువ పెట్టుబడులతో ప్రజలకు గరిష్టంగా

మేలుచేసే అవకాశాలు అపారంగా ఉన్నాయి. ఈ రంగాలపై దృష్టి సారించడం ద్వారా వనరులు, వృద్ధి-సమానత వంటి అంశాలలో ఎదురవుతున్న సమస్యలను ఏకకాలంలో అధిగమించవచ్చు.

ఆరోగ్యరంగంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభానికి గల కారణాలు ఎంతో ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. ఆధునిక ప్రమాణాల ప్రకారం మన ఆరోగ్య సూచికలు అథమస్థాయిని అంటుతున్నాయి. ప్రజారోగ్యంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయం జీడీపీలో 0.9శాతం మాత్రమే. 1990లో ఇది 1.3శాతంగా ఉండేది. ఆరోగ్యంపై వెచ్చిస్తున్న మొత్తంలో ప్రభుత్వ వాటా కేవలం 17శాతం, రోగాల వాతపడుతున్న వారిలో 80శాతం మంది అవుట్ పేషెంట్లు, 60శాతం మంది ఇన్‌పేషెంట్లు ప్రయివేటు క్లినిక్‌లను, నర్సింగ్ హోంలను ఆశ్రయిస్తున్నారు. రోగాల బారినపడి ఆసుపత్రిపాలయ్యే భారతీయులు తమ వార్షికాదాయంలో 60శాతం డబ్బును వైద్యసేవలకే వెచ్చించవలసి వస్తోంది. దీంతో వారి ఆర్థిక పరిస్థితి తలకిందులవుతోంది. ఆసుపత్రులలో చేరినవారిలో 40శాతంమంది ఖర్చులు భరించే స్తోమత లేక ఆస్తుల్ని తెగనమ్ముకోవడమో, అధిక వడ్డీలకు డబ్బు తీసుకుని అప్పులపాలు కావడమో జరుగుతోంది. వీరిలో 25శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన చేరుతున్నారు. ఇలాంటివారి సంఖ్య కేరళలో 17శాతం ఉంటే, బీహార్‌లో 35శాతంగా ఉంది. పరిస్థితి ఇంత ఆందోళన కలిగించేదిగా ఉన్నప్పటికీ మనదేశంలో ఆరోగ్యరంగం అభివృద్ధిపై ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఇతర నిరుపేద దేశాలతో పోలిస్తే ఇండియాకు ఎన్నో అంశాలు సానుకూలంగా ఉన్నాయి. నిపుణతతో కూడిన మానవనరులకు మనకు కొదవలేదు.

మారుతున్న అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరచుకునే శక్తిసామర్థ్యాలు మనకున్నాయి. ప్రయివేటు ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు గణనీయంగా వృద్ధి చెందుతున్నాయి. మనదేశంలోని ఔషధ పరిశ్రమ అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఎదిగింది. ఇక్కడ ఔషధాలు అతి తక్కువ ధరలకు లభిస్తాయి. మశూచి వంటి వ్యాధులపై భారీస్థాయిలో ప్రచారభేరి మోగించాం. పోలియో, కుష్టు వ్యాధులను దాదాపుగా నిర్మూలించగలిగాం. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఐదు లక్షల మంది ఆర్.ఎం.పిలు రోగుల ప్రాథమిక వైద్య అవసరాలను తీర్చగలుగుతున్నారు. ఆరోగ్య రంగాన్ని పటిష్టంగా తీర్చిదిద్దేందుకు, వృద్ధి సమానతలను పెంపొందించేందుకు ఈ సానుకూలతలన్నింటినీ ఉపయోగించుకోవాలి. ఆరోగ్య పరిరక్షణకు అమెరికా చేస్తున్న తలసరి వ్యయం 4600 డాలర్లుకాగా, ఇందులో మూడోవంతు... 1700 డాలర్ల వ్యయంతోనే బ్రిటన్ అత్యున్నతమైన వైద్యసేవలు అందించగలుగుతోంది. ఇందుకు కారణం అక్కడ అందరికీ ఆరోగ్యాన్నిచ్చే జాతీయ వైద్య ఆరోగ్య విధానం (నేషనల్ హెల్త్ సర్వీస్)ని ప్రవేశపెట్టడమే. 1948లో అప్పటి బ్రిటీష్ ప్రధాని అట్లీ ప్రవేశపెట్టిన ఈ విధానం ఎన్నో సత్ఫలితాలను అందిస్తోంది. బ్రిటన్ తరహాలో మనదేశంలోనూ ఇలాంటి విధానాన్ని అమలుచేయడం ద్వారా ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావచ్చు.

యు.పి.ఎ ప్రభుత్వం తన కనీస ఉమ్మడి కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చింది. ఆరోగ్యరంగంపై ప్రభుత్వ వ్యయాన్ని జీడీపీలో 0.9శాతం నుంచి రెండు లేదా మూడు శాతానికి పెంచుతామని హామీ ఇచ్చింది. నిజానికి- జీడీపీలో 0.3శాతం అదనపు వ్యయంతోనైనా ఆరోగ్య రంగంలో సమూలమైన మార్పుల్ని తీసుకురావచ్చు. ప్రజారోగ్య వ్యవస్థను పటుతరం చేసేందుకు జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ- ఇందులో జేపీ కూడా సభ్యులుగా చేశారు) ఓ సమగ్రమైన పథకాన్ని రూపొందించి, ప్రధానమంత్రికి అందచేసింది.

**అందరి తోడ్పాటు అవసరం**

వైద్యరంగంలో మౌలిక సదుపాయాల వృద్ధి, స్థానికంగా జవాబుదారీతనం పెంచటానికి, ప్రజల ముందు మరిన్ని ప్రత్యామ్నాయాలు ఉంచటానికి ఎన్ఏసీ ప్రతిపాదనలు దోహదపడతాయి. ఒక విధంగా చెప్పాలంటే- ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో అందరికీ ఆరోగ్యం అందించే జాతీయ వైద్య ఆరోగ్య సర్వీస్ ఏర్పాటుకి ఇవి పునాదులవంటివి.

ఈ ఆధునిక యుగంలో కూడా లక్షలాదిమంది పేద మధ్యతరగతి ప్రజలు అనారోగ్యంతో తీవ్ర అవస్థలుపడటం సిగ్గుచేటైన విషయం. నాణ్యతతో కూడిన వైద్యసేవలు అందించేలా ఆరోగ్యరంగాన్ని తీర్చిదిద్దేందుకు, వృద్ధి ఉత్పాదకతనూ పెంచేందుకు కావలసిన మౌలిక సదుపాయాలు, సంస్థాగతమైన శక్తిసామర్థ్యాలు.. అన్నింటినీ మించిన నైపుణ్యత మనకున్నాయి. వీటన్నిటినీ ఉపయోగించుకుని చక్కటి ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ ఏర్పాటుపై రాజకీయ నాయకులు, ఆర్థికవేత్తలు, విధానకర్తలు దృష్టి సారించాలి. తక్కువ ఖర్చుతో ప్రతి ఒక్కరికీ జేబులో నుంచి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యసేవలు అందించే నేషనల్ హెల్త్ సర్వీస్ రూపకల్పనకు నడుంబిగించాలి.

# అభివృద్ధికి ప్రధాన సంకేతం ఆరోగ్యం: జేపీ

అభివృద్ధికి ప్రధాన సంకేతం మనిషి ఆరోగ్యం. కానీ మనదేశంలో ఇప్పటికీ అకాల మరణాలు, నివారించదగ్గ వ్యాధులు, సులభంగా చికిత్స చేయదగ్గ జబ్బులు అసంఖ్యాకంగా అమాయకుల్ని బలితీసుకుంటున్నాయి. నివారించదగ్గ క్లేశాలు భారతదేశంలో ఉన్నంతగా మరెక్కడా కానరావు. ఇందుకు చాలా సులభ పరిష్కారాలు మన ముందున్నాయి. చాలా తక్కువ ఖర్చుతో అమలయ్యే మార్గాలనేకం ఉన్నాయి. ఉదాహరణకు మహారాష్ట్రలో అహ్మద్‌నగర్ జిల్లాలోని జాంఖేడ్‌లో డాక్టర్ అరోలీ దంపతులు దశాబ్దాల క్రితం తక్కువ ఖర్చుతో, స్థానిక వనరులతో, అక్కడి ప్రజల భాగస్వామ్యంతో సాధించిన ఆరోగ్య ఫలితాలు చూస్తే- మన సమస్యలను ఎంత సులభంగా పరిష్కరించవచ్చో విశదమవుతుంది. వెల్లూరు వైద్య కళాశాలలో పట్టభద్రులయిన డాక్టర్ రజనీకాంత్ అరోలీ, ఆయన భార్య మేబెల్- ఇరువురూ అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేసి 1970లో మహారాష్ట్రలో మారుమూల ప్రాంతమయిన జాంఖేడ్‌లో నివాసమేర్పరచుకున్నారు. ఆ దంపతులకు ఆనాటికే ఓ విషయం స్పష్టంగా తెలిసివచ్చింది. నూటికి 90 జబ్బులకు ఖరీదయిన వైద్యం అక్కర్లేదు. ఎన్నో అంటువ్యాధులను సులభంగా గుర్తించి చికిత్స చేయవచ్చు. చాలా రోగాలకు వ్యాధి నిరోధక టీకాలిస్తే జబ్బు రాకుండా నివారించవచ్చు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే ఎన్నో రకాల జబ్బుల నుంచి కాపాడుకోవచ్చు. పౌష్టికాహారం మెళకువలను పాటిస్తే చాలా వ్యాధులను నిరోధించవచ్చు. మాతాశిశుసంరక్షణ సూత్రాలను పాటిస్తే ఎందరో గర్భిణులను, పసిపాపలను రక్షించవచ్చు. వీటన్నింటికీ వైద్యులే అవసరం లేదు. అలాగని అసలు వైద్యులు అవసరమే లేదని కాదు. కొన్ని క్లిష్టమయిన వ్యాధులను గుర్తించడానికి, సరైన చికిత్స చేయటానికి, శస్త్రచికిత్సలకు, కొన్ని మందుల వాడకానికి విధిగా వైద్యులు కావాలి. ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణనివ్వటం కోసం, వైద్యుడి సహాయం అవసరమున్న రోగులకు చికిత్సనందించటం కోసం జాంఖేడ్‌లో అరోలీ దంపతులు ఓ చిన్న ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. వారి కృషి వల్ల అనతికాలంలోనే అసాధారణ ఫలితాలు వచ్చాయి. 1970ల చివరినాటికి ఆ 70 గ్రామాలలోని లక్ష జనాభాకు ఆధునిక ఆరోగ్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఆ ప్రజల ఆరోగ్య ప్రమాణాలు-జీవన కాలపరిమితి, మాతా శిశు మరణాలు, వివిధ వ్యాధులకు గురయ్యేవారి సంఖ్య వగైరా అంశాలలో- ప్రపంచంలో సంపన్న దేశాలకు ఏరకంగానూ తీసిపోకుండా అద్భుత ఫలితాలు సాధించగలిగారు. 1979లో అరోలీ దంపతులకు మెగసెసే అవార్డు అందింది. ఆరో పంచవర్ష ప్రణాళికకు ఆరోగ్యరంగంలో జాతీయ సలహాదారుగా అరోలీని మన ప్రభుత్వం నియమించింది. ఆయన కృషిని అందరూ పొగిడారు. కాగితం మీద ఆ విధానాలనే రాసిపెట్టారు. కానీ వాస్తవానికి ప్రజలకు ఆరోగ్యం అందకుండా చేశారు. గ్రామీణ మహిళలను ఎంపికచేసి శిక్షణనిచ్చేది పోయి, పలుకుబడి గలవాళ్ల పిల్లలను ఎంపికచేశారు. ప్రజలకు ఆరోగ్యం అందించే లక్ష్యంతోకాక ప్రభుత్వోద్యోగం దక్కి నెల జీతం వస్తుందనే ఆశతో వేలమంది యువకులు లంచాలిచ్చి ఆరోగ్య కార్యకర్తలుగా చేరారు. నాయకులకు, అధికారులకు చిత్తశుద్ధి, సంకల్పం, అవగాహన, సామర్థ్యం కొరవడటంతో ఆ పథకం నీరుగారిపోయింది. ఇప్పుడు పాలకులలో చాలామందికి అసలు అరోలీ పేరే తెలియదు. గూండాలకు నీరాజనాలందించి, లంచగొండులను నెత్తికెక్కించుకుని, అసమర్థులను అందలాలెక్కించే వ్యవస్థలో నిజంగా దేశాన్ని సమూలంగా సంస్కరించగల మహనీయుల కృషి ఫలితాలను పొందే విజ్ఞత కూడా కరవయింది. చీటికీమాటికీ వేలు, లక్షలు ఖర్చు చేసి ఖరీదయిన ఆసుపత్రులలో వైద్యం పొందగల సంపన్నులకు, నిజాం ఆసుపత్రిలో ఉచిత చికిత్స పొందే అవకాశమున్న నాయకులకు, అధికారులకు సామాన్యుల కడగండ్లు కానరావు. లక్షలమంది పేదలు, అల్పాదాయ వర్గాలవారు చిన్నచిన్న జబ్బులకు కూడా సరైన వైద్యసౌకర్యం లేక, వైద్యం అందుబాటులో లేక సతమతమవుతున్నారు. సంపన్నులు, విద్యావంతుల కంటే చిన్న రుగ్మతలకు పేదలు ఎక్కువ ఖర్చుపెడుతున్నారు. అమూల్యమయిన కాలాన్ని పోగొట్టుకుంటున్నారు. జబ్బు పడుతున్నామనే భావనే సగటు మనుషుల్ని కుంగదీస్తోంది. ఒక్కోసారి జబ్బుపడితే- సగటు మనిషి తన సాంవత్సరిక ఆదాయంలో 60శాతాన్ని వైద్యానికే వెచ్చించాల్సి వస్తోందని అంచనా. వైద్యం అంత ఖరీదు అయిపోబట్టే ఆసుపత్రుల్లో చేరినవారిలో 40శాతం తమకున్న కొద్దిపాటి ఆస్తుల్ని అమ్ముకునో, ఎవరి దగ్గరన్నా వడ్డీకి డబ్బు తీసుకొనో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆసుపత్రులపాలైన వారిలో 25శాతం మంది అలా ఖర్చు పెట్టిన తరువాత నిరుపేదలుగా మారుతున్నారు. అందరికీ ఆరోగ్యం అందించాలన్న సంకల్పం ఉండాలేగానీ, అతి తక్కువ ఖర్చుతో, స్థానికుల సహకారంతో ఎవరికీ తీసిపోని ఆరోగ్య ప్రమాణాలను సాధించటం చిటికెలో పని. ఆ ఫలితాలను అందరికీ అందించటం నాగరికులమనుకునే మన ప్రథమ కర్తవ్యం. బీదరికాన్ని నిర్మూలించాలంటే ఆరోగ్యాన్ని అందరికీ అందించే వ్యవస్థను నిర్మించాలి. ఒక వ్యక్తి పుట్టుక, కులం, హోదా, ఆస్తిపాస్తులు.. ఇందులో దేనితోనూ సంబంధం లేకుండా సహేతుకమైన, సరైన ప్రమాణాలుగల వైద్యసదుపాయాలు అందరికీ అందాలి.



డాక్టర్ రజనీకాంత్ అరోలీ

**(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా 2002, 2004లో ఈనాడులో ప్రచురితమైన వ్యాసాల నుంచి)** ✦

# అందరికీ అందుబాటులో ఔషధాలు - జన్ఔషధి కేంద్రాలతోనే సాధ్యం

**- అమ్ముల మోహిత్ నాగప్రసాద్**



భారతీయులందరికీ జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. సకాలంలో సరైన వైద్యం అందక, అందుబాటు ధరల్లో ఔషధాలు లభించక ఏ ఒక్కరు మరణించినా అది వ్యవస్థ వైఫల్యమే! ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం 65 శాతం భారతీయులు ఆధునిక వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్నారు. మరోవైపు, గ్రామీణ ప్రాంత వైద్య వ్యయంలో దాదాపు 79 శాతం ఔషధాల కోసమే ఖర్చవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలకు అత్యవసరమైన ఔషధాలను తక్కువ ధరకు అందుబాటులో ఉంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2008లో జన్ఔషధి పథకానికి (జేఏఎస్) రూపకల్పన చేసింది. 2014 నాటికి దేశవ్యాప్తంగా 104 జన్ఔషధి కేంద్రాలు ఏర్పాటైనా, 87 మాత్రమే పనిచేశాయి. 361 రకాల మందులను అందుబాటులో ఉంచాలని నాటి ప్రభుత్వం భావించినా, క్షేత్రస్థాయిలో 130 మాత్రమే లభించేవి. ఔషధాల సరఫరా సక్రమంగా జరగకపోవడం, ప్రజలకు వీటిపై అవగాహన కల్పించకపోవడంతో ఆశించిన ఫలితాలు రాలేదు.

**తగ్గనున్న ఆర్థిక భారం**

సాధారణంగా పారాసెటమాల్‌ను జ్వరం, ఒళ్లు నొప్పులు తగ్గించడానికి ఉపయోగిస్తారు. కానీ, విపణిలో మాత్రం వివిధ బ్రాండ్ల పేరిట అనేక జ్వరం మాత్రలుంటాయి. వాస్తవానికి ఔషధ తయారీకి ఉపయోగించే మూలపదార్థం ఒకటే. ఆయా సంస్థల బ్రాండ్ విలువల జోడింపుతో మందుల ధరలు పదుల రెట్లకు పెరుగుతాయి. బ్రాండెడ్‌తో పోల్చుకుంటే అంతే నాణ్యమైన అవే మందులు జన్ఔషధి కేంద్రాల్లో 50 నుంచి 90 శాతం తక్కువ ధరలకు లభిస్తాయి. పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుంది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జేఏఎస్‌ను 'ప్రధానమంత్రి జన ఔషధి పరియోజన'గా మార్చింది. 2016 నవంబర్‌లో 'ప్రధానమంత్రి భారతీయ జన్ఔషధి పరియోజన' (పీఎంబీజేపీ)గా మళ్లీ నామకరణం చేశారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడు వేల జన్ఔషధి కేంద్రాలు తెరుస్తామని 2016-17 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. జన్ఔషధి కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. జనరిక్ మందులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏటా మార్చి ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జన్ ఔషధీ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వారోత్సవాల్లో భాగంగా దేశంలో 7,500వ జన్ఔషధి కేంద్రాన్ని (షిల్లాంగ్) ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. వైద్య వ్యయాల భారం నుంచి పేదలకు సాంత్వన కలిగించడానికి జన్ఔషధి కేంద్రాలు అక్కరకొస్తాయని ఆయన పేర్కొన్నారు.

జన్ఔషధి కేంద్రాల్లో 1600 రకాల ఔషధాలను అందుబాటులో ఉంచాలని కేంద్రం తీర్మానించింది. ప్రస్తుతం వీటిలో 1449 రకాల మందులు, శస్త్ర చికిత్సలకు సంబంధించిన 204 ఉత్పత్తులు లభిస్తున్నాయి. కేంద్ర ఆయుష్ శాఖకు సంబంధించిన 75 రకాల ఆయుర్వేద ఉత్పత్తులనూ వీటిలో విక్రయిస్తున్నారు. శానిటరీ నాప్కిన్స్‌ను నామమాత్రపు ధరకే (రూపాయి) అందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో విక్రయించే మందుల నాణ్యతను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కేలిబరేషన్ లేబరేటరీస్ (ఎన్ఏబీఎల్) తనిఖీ చేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశిత ప్రమాణాలకు తగిన ఔషధాలనే అనుమతిస్తుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 732 జిల్లాల్లో 7668 జన్ఔషధి కేంద్రాలు ప్రజలకు తక్కువ ధరలకు అత్యవసర మందులను అందిస్తున్నాయి. వీటి వల్ల రూ.3,600 కోట్ల ప్రజాధనం ఆదా అవుతోంది. జనరిక్ ఔషధాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు 'జన్ఔషధి సుగమ్' పేరుతో మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఇందులో కేంద్రాల సమాచారం, వాటిలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు ఉంటాయి. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు ఈ కేంద్రాల నిర్వహణలో ప్రాధాన్యమిచ్చి, ఆర్థిక స్వావలంబన కల్పించాలని కేంద్రం సంకల్పించింది.

**క్షేత్రస్థాయిలో సమస్యలు**

పీఎంబీజేపీ విస్తరణకు క్షేత్రస్థాయిలో అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. గతంతో పోలిస్తే దేశంలో జన్ఔషధి కేంద్రాలు పెరిగినా, వాస్తవ అవసరాలకు అవి దూరంగానే ఉన్నాయి. ఇప్పటికీ మధుమేహం, బీపీ, గ్యాస్ట్రబుల్ తదితర నిత్యావసర ఔషధాల కొరత ఈ కేంద్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కువ కేంద్రాల్లో 500 నుంచి 700 రకాల మందులే ఉంటున్నాయి. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే ఔషధాలు అసలే ఉండటం లేదు. ప్రజల అవసరాలకు తగిన రీతిలో నాణ్యమైన జనరిక్ మందుల ఉత్పత్తి జరగడం లేదు. దేశీయ, బహుళ జాతి ఔషధ సంస్థలకు, ప్రైవేటు వైద్యులకు ఉన్న సంబంధాల కారణంగా ఆసుపత్రుల్లో జనరిక్ ఔషధాలను సూచించడం లేదనే విమర్శ ఉంది. జనరిక్ ఔషధాల ఉత్పత్తి, కేంద్రాల నిర్వహణ, మందుల అందుబాటు నుంచి ప్రజల్లో వీటిపై అవగాహన కల్పించడం వరకు కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయరాహిత్యం కనిపిస్తోంది. పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతున్న ఔషధ వ్యయాన్ని తగ్గించాలంటే, ఈ సమస్యలను తక్షణం పరిష్కరించాలి. జనరిక్ ఔషధాలను ప్రోత్సహిస్తేనే స్వస్థ భారతం సాకారమవుతుంది. (కర్టెసీ: ఈనాడు)

# కొత్త దారుల వెతుకులాట

## - యోగేంద్ర యాదవ్, స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షులు

రాజ్యాంగానికి, సమాజానికి మధ్య అగాధాన్ని పూరించటమే రాజకీయం లక్ష్యం అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెబుతుంటారు. అందుకే లోక్‌సత్తా విధానాలు లక్ష్యాలకు, రాజ్యాంగంలోని అంశాలకు తేడా ఉండదంటారు. ఒక ఉదాత్త రాజ్యాంగాన్ని ఆచరణలోకి తెచ్చే పని భారత్ వంటి దేశంలో చేయటం బహుశా ప్రపంచంలోనే అతి పెద్ద సవాలు కావటం వల్లే.. లోక్‌సత్తాను రాజకీయ పార్టీగా కూడా ప్రారంభిస్తామని చెప్పినప్పుడు పలువురు రాజకీయ, పౌర సమాజ నేతలు, చివరికి మీడియా వారు కూడా నిరుత్సాహ పరిచారు. లోక్‌సత్తా పార్టీని ప్రారంభించేటప్పుడు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేకమందిని జేపీ కలిసి తన లక్ష్యాన్ని వివరించారు. రాజ్యాంగాన్ని సాకారం చేయటానికి కొత్త తరానికి కొత్త రాజకీయం అవసరమని, అందుకే కష్టమని తెలిసినా కూడా లోక్‌సత్తా పార్టీని ప్రారంభించాలనుకుంటున్నామని సలహా కోరారు. పెదవి విరిచినవారితోపాటు జాగ్రత్తలు చెబుతూ ప్రోత్సహించినవారిలో అప్పటి ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ కూడా ఉన్నారు. జేపీ! ఇలాంటి కష్టమైన పని నీలాంటి మొండివాళ్లు తప్ప ఎవరూ చేయలేరు అని వెన్నుతట్టారు. అలా భారతదేశంలో కొత్త రాజకీయానికి నాంది పలికిన లోక్‌సత్తా పార్టీ ఎందరికో స్ఫూర్తినిచ్చింది. లోక్‌సత్తా భావాలతో విభేదించేవారు కూడా లోక్‌సత్తా విజయం సాధించాలని కోరుకున్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా సుదీర్ఘకాలం పనిచేసిన, పలు సామాజిక పోరాటాల్లో కూడా పాలుపంచుకున్న తెలుగు ప్రముఖుడొకరు ఓ సందర్భంలో జేపీ గురించి వ్యాఖ్యానిస్తూ, 'ఆయన తన పోరాటంలో ఓడిపోతాడేమోనని భయం కలుగుతుంటుంది. జేపీతో విభేదించినా.. ఆయన నిజాయతీ, ప్రజల కోసం ఢిల్లీ నుంచి రాష్ట్రం దాకా పడుతున్న కష్టం చూస్తుంటాను కాబట్టి ఆయన గెలవాలని కోరుకుంటున్నాను' అన్నారు. 'సరైన ప్రయత్నం చేయటమే విజయం అంటే' అంటారు మహాత్మాగాంధీ. తన ప్రయత్నంలో లోక్‌సత్తా పార్టీ ఆమ్‌ఆద్మీ వంటి పార్టీలకు మార్గం వేసింది. ఆ పార్టీ నుంచే వచ్చిన యోగేంద్ర యాదవ్ ఆ తర్వాత స్వరాజ్ ఇండియా పేరుతో ఇంకో రాజకీయ పార్టీని ప్రారంభించారు. రాజ్యాంగానికి, సమాజానికి మధ్య అగాధాన్ని పూరించే కొత్త రాజకీయంపై ఆయన ఆలోచనలు 'ఆంధ్రజ్యోతి'లో వ్యాసంగా ప్రచురితమయ్యాయి. అందులోని అంశాలు 'జనబలం' పాఠకుల కోసం..




వర్తమాన భారతదేశానికి ఒక భావజాల సమతౌల్యత అవసరం. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అత్యంత నిరాశామయ కాలంలో మనం ఉన్నాం. భవిష్యత్తు మీద పరిపూర్ణ విశ్వాసాన్ని కలిగించే ఒక కొత్త మధ్యే మార్గ భావజాలాన్ని ఆవిష్కరించుకోవలసి ఉంది. మన రాజ్యాంగ విలువల పట్ల ప్రజల మనఃస్థితి సంపూర్ణ సానుకూలతతో ఉండేలా ఒక భావజాల ఏకాభిప్రాయాన్ని సృష్టించవలసిన అవసరముంది. ఈ కర్తవ్య నిర్వహణ అంత సులువు కాదు. ఉత్తేజపూరితమూ కాదు. చికాకు పరిచే కార్యమది. అయితే మన ప్రజాస్వామ్యం లేదా మన గణతంత్ర రాజ్య భవిష్యత్తు అతి, మితవాదాలకు భిన్నమైన ప్రాతిపదికలతో కూడిన భావజాలాన్ని రూపొందించుకుని అనుసరించడంపై ఆధారపడి ఉంది. అత్యవసరంగా పరిష్కరించుకోవల్సిన ప్రస్తుత మేధా, రాజకీయ సమస్యల్లో ఇది ఒకటి.

పాతిక సంవత్సరాలుగా ప్రజలు మృదు నిరంకుశాధికారతత్వం, కలహశీల, సంకుచిత జాతీయవాదం, మార్కెట్ ఆరాధన, అధిక సంఖ్యాకవాద ధోరణులు, కుల దురభిమానాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ భావజాల వైఖరులు మన రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధమైనవి. సామాజిక అంతరాలు, ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లిపోయేందుకు దోహదం చేస్తున్న ఈ విషపూరిత భావజాలం గురించి ప్రతి భారతీయుడూ కలవరపడి తీరాలి. సమాజంలో ఎటువంటి సుస్థిరతకు దోహదం చేయని ఈ భావజాలం మన గణతంత్ర రాజ్య నిర్మాతల స్వప్నాలు, ఆశయాలు, సంకల్పాలకు పూర్తిగా భిన్నమైన భారత్‌ను రూపొందిస్తుంది. అదే జరిగిన పక్షంలో దేశంలో సమైక్యత, సమగ్రత కొరవడుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

నిజమే. మన ప్రస్తుత రాజకీయ పరిస్థితులు చాలా బాధాకరంగా ఉన్నాయి. అయితే ఈ దుస్థితి నుంచి బయటపడేందుకు మనం తొలినాటి 'నెహ్రూవియన్' భావజాల ఏకాభిప్రాయానికి వెళ్లలేము. వామపక్ష ఉదారవాద ప్రగతిశీల రాజకీయాలు నెహ్రూవియన్ పద్ధతులు పోవాలని కోరుతున్నాయి. అయితే అది సాధ్యమూ కాదు, వాంఛనీయమూ కాదు. ఎందుకంటే, పాత భావజాల ఏకాభిప్రాయం భ్రష్టమయింది. పర్యావరణ సమస్యలకు అది ప్రాధాన్యమివ్వలేదు.

కులం, జెండార్ అసమానతలను, ప్రజల సాంస్కృతిక, మతపరమైన మనోభావాలను పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో కొత్త భావజాల సమైక్యతను సృష్టించుకోవడం మినహా మనకు ప్రత్యామ్నాయం లేదు. కొత్త భావజాల సమతౌల్యతలో ఉండి తీరాల్సిన ఏడు అంశాల గురించి విశదంగా చూద్దాం.

కొత్త సైద్ధాంతిక సమతౌల్యత నిజమైన, ఆత్మవిశ్వాసపూరితమైన జాతీయవాదం నుంచి ప్రభవించి తీరాలి. ప్రస్తుతం ప్రజల మనస్సులను బలీయంగా ప్రభావితం చేస్తున్న నిస్సార, కర్కశ జాతీయవాదానికి అమూర్త అంతర్జాతీయవాదం, జాతీయవాదానంతర వాదాలు సమాధానాలు కానేకావు. యూరోపియన్ మేధావులలాగా మనం జాతీయవాదాన్ని ఉపేక్షించలేము. మన మహోన్నత జాతీయోద్యమం, స్వాతంత్ర్య పోరాట సంప్రదాయాలు, విలువల నుంచి ప్రేరణ పొందిన దేశభక్తి ప్రపూరిత జాతీయవాదాన్ని ఇప్పుడు మనం పెంపొందించుకోవాలి. భారత్‌ను గర్వకారణంగా భావిస్తూ ఆ భావనకు వాస్తవిక అర్థాన్ని సమకూర్చాలి. బాహ్యంగా, అంతర్జాతీయ సమాజంలో మనదైన ప్రముఖ స్థానాన్ని సాధించుకోవడం, అంతర్గతంగా, మన సమాజంలోని సకల వైవిధ్యాలను సమాదరించే జాతీయ సమైక్యతను నిర్మించుకోవడం ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుంది.

రెండో అంశం- మన సాంస్కృతిక, ధార్మిక విలువలతో దృఢంగా పెనవేసుకున్న లౌకికవాదాన్ని అభివృద్ధి పరచుకోవలసిన అవసరం ఉంది. ఈ పుణ్యభూమి సంప్రదాయాలలో మూలాలు లేని లౌకికవాదం మతసంకుచితత్వాన్ని ఓడించలేదు. లౌకికవాదం గురించి పాశ్చాత్య విజ్ఞులు సాగించే చర్చలో, రాజ్యానికి మతానికి ఎటువంటి సంబంధముండకూడదనేది ఒక ప్రధాన అంశం. అయితే మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ప్రజల మధ్య మతపరమైన ఘర్షణలు, మత తెగల మధ్య కలహాలు, 'సర్వ ధర్మ సంభవమ్' అన్న ఆదర్శాన్ని ఆచరించే రాజ్యవ్యవస్థ మనకు కావాలి. రాజ్యం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ అన్ని మతాలకు సమాన దూరంలో ఉండాలి. ఏ మతసమూహం పట్ల ఎటువంటి వివక్ష చూపకూడదు. అదే సమయంలో ఏ మత సమూహంలోనైనా అణచివేత, అన్యాయాలకు వ్యతిరేకంగా నిష్పాక్షిక చర్యలు చేపట్టాలి. మత సంప్రదాయాలను ఉపక్షించడం వల్ల లౌకిక రాజ్యవ్యవస్థను నిర్మించలేం. మన మత సంప్రదాయాలు అన్నిటితోనూ సమరీతిలో అనుబంధాన్ని నెలకొల్పుకోవాలి.

మూడో అంశం- అట్టడుగు స్థాయి వ్యక్తి శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చే మార్కెట్ సోషలిజాన్ని అభివృద్ధి పరచుకునేందుకు మనం కృషి చేయాలి. పెట్టుబడిదారీ వ్యవస్థలోని అసమానతలకు ఉద్యోగి స్వామ్య వ్యవస్థ ఆధ్వర్యంలోని రాజ్య సామ్యవాదం సమాధానం కానే కాదు. మార్కెట్ మన జీవితంలో ఒక అంతర్భాగం అన్న సత్యాన్ని మనం అంగీకరించి తీరాలి. మన అర్థనీతి 'eco-norm-ics'గా పరిణమించాలి. అంటే నైతిక విలువలు, పర్యావరణ సుస్థిరతతో ఆర్థిక హేతుబద్ధతను సమన్వయ పరచాలి. సంక్షేమ విధానాల ప్రాధాన్యం మౌలిక అవసరాలయిన ఆహారం, గృహవసతి నుంచి ఉపాధి, విద్య, ఆరోగ్య భద్రతకు మారాలి.

నాలుగో అంశం సామాజిక న్యాయం. ఈ లక్ష్యసాధనకు బహుముఖ దృక్పథాన్ని అనుసరించాలి. దీనివల్ల వర్తమాన రాజకీయాలను అమితంగా ప్రభావితం చేస్తున్న అస్తిత్వ నిరాకరణ, అస్తిత్వ ఆరాట ధోరణులను అధిగమించడం సాధ్యమవుతుంది. అయితే ఇందుకు వర్తమాన భారతదేశంలోని కుల అసమానతలను అంగీకరించి, వాటి నిర్మూలనకు గతంలో కంటే మరింత చిత్తశుద్ధితో కృషి చేయవలసిన అవసరముంది. అలాగే ఇతర సామాజిక అసమానతలను- (జెండర్, లైంగికత, వర్గం, ప్రాంతం, మతసమూహం, గ్రామీణ-పట్టణ అంతరాలు) గుర్తించి తీరాలి. ఈ సమస్యల పరిష్కారానికి రాజ్యవ్యవస్థ విధానపరంగా ప్రతిస్పందించాలి. సామాజిక న్యాయ సాధనకు ప్రధాన ఉపకరణంగా పరిగణిస్తున్న కుల ఆధారిత రిజర్వేషన్ల విధానంలో స్వల్ప మార్పులు చేయాలి. అలాగే చట్టసభలలోను, రాజకీయ వ్యవస్థలలోనూ మహిళలు, అణగారిన వర్గాల వారికి సముచిత ప్రాతినిధ్యం కల్పించటంపై మరింత శ్రద్ధాసక్తులు చూపాలి.

ఐదో అంశం పర్యావరణ పరిరక్షణ. ప్రతి రాజకీయ ఎజెండాలోనూ దీనికి అగ్రప్రాధాన్యం ఉండితీరాలి. అభివృద్ధి పేరిట జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని, ముఖ్యంగా ఆదివాసీ సమాజాల విచ్ఛిన్నతనూ ఇంకెంత మాత్రం ఉపేక్షించకూడదు. అలాగే వాతావరణ మార్పును నిరాకరించడం అవివేకమే అవుతుంది. జల్-జంగల్-జమీన్‌పై ప్రజల నియంత్రణ కోసం జరిగిన ఉద్యమాలే ప్రజా పర్యావరణవాదానికి పునాదులు వేశాయి. వ్యవసాయ విధానాలు, పద్ధతులలో కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరో అంశం- మన సాంస్కృతిక విధానాలు, రాజకీయాలు భారతీయ ఆధునికతను అన్వేషించాలి. ఆ అన్వేషణే వాటికి స్ఫూర్తి కావాలి. ఆ అన్వేషణ మన స్వాతంత్ర్యోద్యమ విలువలను నిండుగా ప్రతిబింబించి తీరాలి. దీనివల్ల మనం నిస్సారమైన, అనుకరణ ప్రాయమైన ఆధునికతను త్యజించగలుగుతాము. ఇందుకు గాను మనం సమున్నత నాగరికతా వారసత్వాన్ని పునర్నిర్వచించుకోవాలి. అదే సమయంలో విశాల దృక్పథంతో ప్రపంచవ్యాప్తంగా ప్రతి సమాజం నుంచి నేర్చుకోవాలి. భారతీయ భాషల సమగ్ర వికాసానికి కృషి చేయాలి. పాఠశాల స్థాయి నుంచే మన జ్ఞానసంప్రదాయాలను సముచిత రీతిలో గౌరవించే విద్యావిధానాలను రూపొందించుకోవాలి.

ఆఖరి అంశం- ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యవాదానికి మనం నిబద్ధమై తీరాలి. అది ఒక లక్ష్యంగా, ఒక సాధనా మార్గంగా ఉండాలి. ప్రజాస్వామ్యమంటే రాజ్యాంగాన్ని రూపొందించుకోవడం, సంస్థల నిర్మాణం, ఎన్నికల నిర్వహణ మాత్రమే కాదనే వాస్తవాన్ని మనం గుర్తించి తీరాలి. వివేకశీలురైన, సమాన ప్రతిపత్తి గల పౌరులతో కూడిన ఒక రాజకీయ సమాజాన్ని నిర్మించుకోవడమే ప్రజాస్వామ్యం పరమార్థం. రాజకీయ అధికారాల వికేంద్రీకరణ, సహజ వనరుల సమలభ్యత, విధాన నిర్ణయాలలో ప్రజలకు ప్రత్యక్ష పాత్ర కల్పించడం ద్వారా ఆ సమున్నత ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి పరచుకోవాలి.

నిజానికి ఇవేవీ కొత్త అంశాలు కావు. అవన్నీ మన రాజ్యాంగంలో ఉన్న విలువలే. వాటిని విశదీకరించాను. ప్రజల జీవితాలతో వాటికి ప్రగాఢ సంబంధం నెలకొల్పేందుకు ప్రయత్నించాను. ఈ దృష్ట్యా ఒక కొత్త భావజాల సమతౌల్యతను సృష్టించడం కేవలం విద్యావిషయిక లేదా మేధా కర్తవ్యం కాదు. అందుకు ప్రజాభిప్రాయాన్ని మౌలికంగా మార్చివేయవలసి ఉంది. ఇదొక రాజకీయ సవాల్.

# తెలుగు కథకు శాశ్వతత్వాన్ని చేకూర్చిన 'కారా' మాష్టారు

## రాసి కన్నా వాసి కలిగిన రచయిత.. కథానిలయంతో కథల యజ్ఞం

**-బండారు రామ్మోహనరావు**



ప్రసిద్ధ రచయిత, కథకుడు, విమర్శకుడు, కథానిలయం వ్యవస్థాపకుడు, తెలుగు సాహితీ ప్రపంచం కారా మాష్టారుగా పిలుచుకునే కాళీపట్నం రామారావు గారితో నాకున్న సాహితీ అనుబంధం చిన్నదే అయినా ఎంతో అపురూపమైనది. వారిని నేను మూడుసార్లు కలిశాను. చివరగా 2017 అక్టోబర్ 12న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారితో కలిసి శ్రీకాకుళం జిల్లాలో కలిశాం. గంటకు పైగా ఆయనతో కూర్చున్నప్పుడు తెలుగు సాహిత్యం గురించి ఒక అర్థవంతమైన చర్చ జరిగింది. ఆయన స్థాపించిన కథానిలయంలో ఆయన సేకరించిన కథలు, జీవిత విశేషాలు చూసి ఆశ్చర్యపోయాను. వంద సంవత్సరాలకు పైబడి పూర్వం నుండి తెలుగు సాహిత్యంలో వచ్చిన కథలు కథానికలు లక్షకుపైగా సేకరించడం ఒక గొప్ప విషయం.

నేను ఇంటర్మీడియెట్‌లో ఉండగానే 1974లో కారా మాష్టారు రాసిన 'యజ్ఞం' కథ చదివి ప్రభావితుడయ్యాను. ఆ తరువాత చాలా సంవత్సరాలకి ఒక సాహిత్య సమావేశంలో ఆయనను మొదటిసారి కలిశాను. ఆ అనుభూతి ఇప్పటికీ నాకు గుర్తుండిపోయింది.


ఆయన రచనలు చాలా తక్కువే అయినా 'రాసి కంటే వాసి మిక్కిలి' కలవి కనుక తెలుగు సాహితీ ప్రపంచం ఉన్నన్ని రోజులూ అజరామరంగా ఉండిపోతాయి. తెలుగు కథకు శాశ్వతత్వాన్ని చేకూర్చే దిశగా కాళీపట్నం రామారావు విశేష కృషి చేశారు. ఆనాటి ఆంధ్రభూమి దినపత్రికలో 'నేటి కథ' అనే శీర్షికను నిర్వహించారు. కొత్త రచయితలకు అవకాశమిచ్చారు. ఆరు దశాబ్దాలుగా ఈ కథలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. తన జీవితంలో అనుభవించి, పరిశీలించిన కష్టనష్టాలను, సంఘర్షణలను తన కథలలో రాశారు. ఆయన కథలలో ఉన్న పాత్రలు ఆనాటి మన సమాజాన్ని కళ్ల ముందు సాక్షాత్కరిస్తాయి. సమాజంలో ఉన్న అట్టడుగు వర్గాల జీవన సమరాల్ని సునిశితంగా పరిశీలించి తన రచనల్లో ఎత్తిచూపారు. 1964లో వెలువడిన 'యజ్ఞం' కథ ఫ్యూడల్ సమాజంలో విశృంఖలంగా జరుగుతున్న దోపిడీని మన కళ్లకు కట్టినట్లు చూపుతుంది. ఆ కథ తెలుగు నేల మీదనే కాకుండా ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. యజ్ఞం మీద జరిగినంత చర్చ తెలుగులో ఏ ఒక్క కథ మీద జరగలేదంటే అతిశయోక్తి కాదు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన కారా మాష్టారు సామాన్య జ్ఞానం గల పాఠకులను సైతం తాను రాసిన కథలలో లీనమయ్యేలా చేశారు. అందుకే ఆయన రాసిన పది పన్నెండు కథలు రష్యన్, ఇంగ్లీషు భాషలలోకి అనువదించబడ్డాయి.

యజ్ఞం కథకి 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించారు. అవార్డుతో వచ్చిన సొమ్ముతోపాటు పలువురు ఆత్మీయులు ఇచ్చిన ప్రోత్సాహంతో దాన్ని మూలధనంగా పెట్టి కాళీపట్నం రామారావు గారు కథానిలయానికి పునాది వేశారు. రామారావు గారి కథా సాహిత్య దీక్షకు ప్రతిబింబమైన కథానిలయం ఒక విశిష్ట ప్రయత్నం, మహాయజ్ఞం! శ్రీకాకుళంలో రెండు అంతస్తుల భవనంగా ఉన్న కథానిలయం తెలుగు కథలకు పెద్ద నెలవైంది. అక్కడ దొరకని తెలుగు కథ అంటూ ఏదీ ఉండకూడదని కారా మాష్టారి ఆశయం. ప్రచురితమైన ప్రతి తెలుగు కథ అక్కడ ఉండాలి. కథలతోపాటు కథారచయితల జీవిత విశేషాల ఛాయాచిత్రాల సేకరణ కూడా చేపట్టారు. ఎక్కడెక్కడి పాత పత్రికల కాపీలు సంపాదించడంలో విపరీతంగా శ్రమించారు. కథానిలయం భవనంలో కింది అంతస్తు ప్రధాన పుస్తక భాండాగారంగా ఉంది. వెనకవైపు అరుదైన పుస్తకాలు బీరువాలలో ఉన్నాయి. ఆ కథానిలయంలోకి ప్రవేశించగానే తెలుగు కథకు త్రిమూర్తులు అనదగ్గ గురజాడ అప్పారావు, కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రిల

తైలవర్ణ చిత్రాలు పెట్టారు. పై అంతస్తులో సుమారు 100 మంది కూర్చోవడానికి వీలుగా ఒక సమావేశ మందిరం ఉంది. ఆ హాలు గోడల నిండా అంగుళం కూడా ఖాళీ వదలకుండా వందలాది మంది తెలుగు కథారచయితల ఫోటోలు, వారి వివరాలు కనబడతాయి. 1997 ఫిబ్రవరి 22న ప్రారంభించిన కథానిలయం తెలుగు కథల సేకరణకు అంకితమైన ఒక అరుదైన గ్రంథాలయం. తెలుగు సాహిత్యంలో ప్రచురించబడిన కథలను భావితరాల వారికి అందించాలన్న మహత్తర ఆశయంతో ఈ గ్రంథాలయాన్ని కథానిలయం పేరుతో స్థాపించారు. తెలుగు కథకు అత్యుత్తమమైన రిఫరెన్స్ గ్రంథాలయం. ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో ఇలాంటి ప్రయత్నం జరగలేదు. సుమారు పాతికేళ్ల క్రితం ప్రారంభించిన ఈ గ్రంథాలయంలో వేలసంఖ్యలో వారపత్రికలు, మాసపత్రికలు, విశేష సంచికలు ఉన్నాయి. ఆనాటి యువ, జ్యోతి, జాగృతి, ఆంధ్రపత్రిక, భారతి, జయంతి, సంవేదన, అభ్యుదయ వంటి అనేక పత్రికల అమూల్యమైన సేకరణతో ఒక అద్భుతమైన గ్రంథాలయంగా దీన్ని తీర్చిదిద్దారు. 1946 నుంచి భారతి పత్రిక ప్రతుల్ని సేకరించారు.

కాళీపట్నం రామారావుగారి రచనలలో యజ్ఞంతో పాటు అభిమానాలు, రాగమయి, జీవధార, రుతుపవనాలు, కథాసంకలనం, కారా కథలు ముఖ్యమైనవి. తొంభై ఆరు సంవత్సరాల సంపూర్ణ జీవితం అనుభవించి తెలుగు సాహితీరంగంలో కాళీపట్నం రామారావు ఒక ధృవతారగా మిగిలిపోయారు. ఒక పండుటాకు రాలిపోయింది. కానీ వసంతం మళ్లీ వస్తుంది. అలాంటి మహారచయితల స్ఫూర్తితో రచనలు చేసే వేలమంది రచయితలు తెలుగు సాహితీ ప్రపంచంలో పుట్టుకొస్తారు, రూపుదిద్దుకుంటారు. అందుకే ఆయన మరణాన్ని జాతస్య మరణం ధృవం అనే జీవిత వాస్తవంగా మనం అర్థం చేసుకోవాలి. కాళీపట్నం రామారావుగారికి ఇదే అక్షరాంజలి.





**2017లో సురాజ్య యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన జేపీ.. 'కారా' మాస్టారుని మర్యాదాపూర్వకంగా కలిశారు. కథానిలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సందర్శన పుస్తకంలో ఆయన గురించి జయప్రకాష్ నారాయణ్ రాసిన వాక్యాలివి:**

**పూజ్యులు కాళీపట్నం రామారావుగారిని మరోసారి కలవడం అదృష్టంగా భావిస్తున్నాను. తెలుగు సాహిత్యంలోనే కథకి, కథానికకి చాలా ప్రత్యేకత ఉంది. ఈ ప్రక్రియలో చిరస్థాయిగా నిలిచిపోయే సాహితీకర్త కా.రా. గారు.**

**ఓ గొప్ప రచయితగా, మానవీయుడుగా, ఆదర్శపారుడుగా మాత్రమే కాక, ఒక సాహిత్య ప్రోత్సాహకులుగా, శతాబ్దకాలంనాటి కథాసాహిత్యాన్ని భద్రపరచి మనందరికి, తరువాత తరాలకి అందిస్తున్న, అందించిన ఒక దార్శనికుడిగా ఆయన చేసిన, చేస్తున్న కృషి తెలుగు జాతి, సాహితీ ప్రపంచం ఏనాటికి మరవలేనిది. 94 సంవత్సరాల ప్రాయంలో మాటలో స్పష్టత, భావంలో స్వచ్ఛత, మేధస్సులో సృజనశక్తి, జ్ఞాపకశక్తి, వ్యక్తిత్వంలో ఔన్నత్యం మరింత ఇనుమడించాయి కా.రా. గారిలో.**

**భావితరాలకి వారి సాహిత్యం, జీవనం, కృషి ఆదర్శాన్ని, స్ఫూర్తిని ఇస్తాయి.**

ప్రేమాభిమానాలతో,
భవదీయుడు,
జయప్రకాష్
12/10/2017

# ఆధునిక ప్రజాస్వామ్య అంశాలతో మరిన్ని జనభాష రచనలు రావాలి

## - డా॥ జయప్రకాశ్ నారాయణ్





శతక సాహిత్యం తెలుగులోలా మరే ఇతర భాషలోనూ వృద్ధి చెందినట్లు కన్పించదు. పద్యం తెలుగువారి సొంతమనిపించేలా దాదాపు వెయ్యేళ్లుగా వర్థిల్లుతూ వస్తోంది. తేలిగ్గా ప్రజల్లోకి వెళ్లి స్పందింపచేయటం వల్ల శతకాలు జనజీవనంలో భాగమయ్యాయి. శతక ప్రక్రియ ఇంతగా విస్తరించటానికి సార్వకాలీన భావాలతోపాటు.. తెలుగు భాషకు మాత్రమే ప్రత్యేకమైన శబ్ద సౌందర్యం కూడా కారణం. బహుశా ప్రపంచంలో మరే భాషా పలుకులూ ఇంత వీనుల విందు అనిపించవు. అందుకే అచ్చు కరదీపికగానో, ఈ-పుస్తక రూపంలోనో, బ్లాగ్‌ల లాగానో శతకాలు వస్తూనే ఉన్నాయి. అత్యధిక శాతం శతకాలు నీతి ఉపదేశాలు, భక్తి సందేశాలతో కూడినవే. కొన్ని తరాల జీవితాల నుంచి కాచివడపోసి శతకాల్లో పొందుపరిచిన నీతిసూత్రాలు తెలుగువారి వ్యక్తిత్వ నిర్మాణాల్లో కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నాయి. అందుకే పిల్లలకు స్కూలుకు వెళ్లటానికి ముందు నుంచీ, ప్రాథమిక తరగతుల్లోనూ సుమతి, వేమన వంటి శతకాల నుంచి పద్యాలను విధిగా నేర్పిస్తుంటాం. నైతిక విలువలకు, మన బాల్యానికి, పాఠశాల విద్యకు, శతకాలకు అవినాభావ సంబంధం ఉంది. అయితే శతక సాహిత్య వస్తువుగా ఉన్న ఆ వ్యక్తిగత, సామాజిక నైతికత్వాన్ని ఆధునిక ప్రజాస్వామ్య అవసరాలకు విస్తరించే ప్రయత్నం చేశారు ముప్పాళ్ళ శ్రీరామరాజు గారు.

నీతి అనేది ప్రధానంగా సామాజికం. సమాజంలో ఆ నీతిని కాపాడితేనే వ్యక్తి, కుటుంబం ఎదగగలుగుతాయి. కానీ నీతి సూత్రాలు వల్లించటానికే పరిమితమైతే.. ఒక స్థాయి దాటి నీతి జనంలోకి ఇంకదు. మనం తెలుసుకున్న, ఇతరులనుంచి ఆశించే నీతిసూత్రాల్ని ఆచరించేందుకు తగిన ప్రోత్సాహాన్నిచ్చే వ్యవస్థ లేకపోతే ఆ నైతిక విలువలు అంతరాత్మ అట్టడుగు పొరల్లో మిగిలిపోతాయి. పిల్లలకు నీతులు బోధిస్తూ తల్లిదండ్రులు, రాజకీయ నేతలు అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తుండటం వల్ల దుష్పరిణామాలు ఎలా పెరుగుతున్నాయో చూస్తూనే ఉన్నాం. కాబట్టి స్థూలంగా అందరూ ఆమోదించిన నైతికల విలువల్ని అనివార్యంగా ఆచరించాల్సిన సామాజిక కట్టుబాట్లని మనం చట్టాలు వంటి వివిధ మార్గాలలో రాజ్యవ్యవస్థ ద్వారా నిర్మించుకోవాలి. కానీ మన కవుల్లో చాలామంది ఇంకా రాజకీయం, పాలన వంటి అంశాలను సీరియస్ సాహిత్య వస్తువులుగా తీసుకోవటం లేదు. కొందరు ప్రయత్నించినా.. సమస్యను వర్ణించినంతగా, అధికార రాజకీయాలను దుమ్మెత్తిపోసినంతగా లోతుపాతుల్ని స్పృశించలేకపోతున్నారు, పరిష్కారాల్ని అందించలేకపోతున్నారు. మన జీవితంలోని ప్రతి పరిణామం వెనుక దాగివుండే రాజకీయాల్ని గుర్తించి పరిష్కారాల్ని కవిత్వీకరించటం అంత సులభం కాదు. ప్రజల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన శతక సాహిత్య ప్రక్రియ ద్వారా శ్రీరామరాజు ఆ ప్రయత్నం చేయటం చాలా ప్రశంసనీయం.

ప్రజాస్వామ్య సమాజంలో అందరి గొంతునూ వినాలి, అందరికీ ఎదిగే అవకాశాలనివ్వాలి. కానీ సమస్యల వర్ణన, పడికట్టు నినాదాలతో ఒక పరిధి దాటాక ఫలితం ఉండదు. నిర్దిష్టమైన పరిష్కారాలు చూపాలి. ప్రభుత్వాలు ఏం చేయాలో ప్రజలు మొట్టమొదట స్పష్టంగా గుర్తించాలి. ప్రభుత్వాలు చేయాల్సిన పనుల్లో నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, స్థానిక సాధికారత, చట్టబద్ధపాలన మౌలికమైనవి. కానీ వీటన్నిటిలో మనం

అధ్వాన్నంగా ఉన్నాం. ఈ వైఫల్యాన్ని శ్రీరామరాజు పోలీసు శాఖలో తన సుదీర్ఘ ఉద్యోగానుభవంతో ప్రస్తావించారు. ప్రభుత్వోద్యోగంలో చేరినవారిలో అత్యధికులు ఆదర్శవంతంగా పనిచేయాలనే చేరుతుంటారు. కానీ జవాబుదారీతనం లేకపోవటం, జీతం కన్నా ఎక్కువ ఆదాయాన్నిచ్చే అడ్డదారులు, పెత్తందారీ స్వభావం వారిలో ఎక్కువమందిని కలుషితం చేస్తాయి. కొందరు కలుషితం కాకపోయినా కలుషిత వ్యవస్థతో సర్దుకుపోతుంటారు. ఇలా కలుషితం కాకుండా, సర్దుకుపోకుండా ప్రజాసేవకుడిగా తన బాధ్యతను సర్వీసు పర్యంతం చాకచక్యంగా నిర్వర్తిస్తూ నిబద్ధతతో పనిచేశారు శ్రీరామరాజు. కేవలం వ్యక్తిగత నిజాయతీగా ఉండటమేకాకుండా.. వ్యవస్థలో నిజాయతీని పెంచేందుకు సానుకూల దృష్టితో సమస్యల్ని ఎప్పటికప్పుడు అక్షరీకరిస్తూ వచ్చారు. వాటిని ఇప్పుడు శతక పద్యాల రూపంలో మనకు అందించారు. నిజానికి మనలో చాలామంది డైరీలు రాసుకుంటుంటాం. ప్లానర్లను ఉపయోగిస్తుంటాం. కేవలం మన వ్యక్తిగత అవసరాలకే కాకుండా.. మన చుట్టూ అంశాలపైన కూడా డైరీలు రాసుకుంటూ, పరిష్కారాలకు మన వంతు చేయాల్సిన ప్రయత్నాల్ని కూడా నమోదు చేసుకుంటే.. రోజుకో సంచలనం మధ్య కీలకమైన సామాజిక అంశాలు, బాధ్యతలు మరుగున పడకుండా ఉంటాయి.

**శ్రీరామరాజు రాసిన శతక పద్యాలు చాలావరకూ ప్రజలకు అర్థమయ్యే భాషలో సరళంగా ఉన్నాయి. మచ్చుకు కొన్ని.**

- రాజకీయ జోక్యాల నియామకాలు/ పక్షపాతము యవినీతి పరిఢవిల్ల/పారదర్శకమను మాట పగటి కలయె!
- రాజకీయ మెంత దిగజారగను జూసి/నోరు మెదపక పౌరులు వూరుకున్న/పరమ నీచులు దిగుదురు పాలకులుగ!
- జనులు మతదానములనమ్ముకొనుచునుండ/మంచి నేతలు దొరుకునా మనకు నేడు/లంచగొండితనము నిట్లు పెంచదగునె?
- ప్రజల మతదానుములగొను ప్రతినిధులకు/ సంవిధానము పట్ల నాసక్తి యేది?/హక్కులనుచు ఘోషింపగ దిక్కు ఎవరు?
- కనుడు నక్షత్ర వైద్యయాకాశ హార్మ్య/ ములను సాగు పరీక్షల ముట్టడిలను/ పైసలను గుంజు పలు వృథా పనుల నాపు
- తెలుగు నేలను కమ్మిన తిమిరమెల్ల/తొలగిపోకున్న నష్టాలు తొలచుచుండు!/పాలకుల ఐక్యభావన ప్రజలకు రక్ష!
- పర్యవేక్షణ పదమును పారదోలి/పనుల యందున ప్రత్యక్ష పాత్ర చేత/ఫలిత మధికము యవినీతి పాలు తరుగు!
- రట్టు యధికార కేంద్రీకరణము నొదలి/లక్షణమగు పద్ధతుల పాలనము జేయ/తక్షణపు పరిష్కారము తథ్యమగును!
- పడుచువారల శ్రమశక్తి పరిగణించి/ పల్లె సీమల ప్రగతిని పాదుకొలుప
- పతనమాయె సమన్యాయ పాలనంబు/ధనము కులముల పాత్రంబు తరుగదేమి?
- వ్యక్తుల పరిపాలన యనర్థాల తెచ్చు/పాలన విధానముల పరంబైన యెడల/సమసిపోవు సమస్యలు చక్కగనని
- నాయకుడనగ ముందుండి నడుపువాడు/ఉన్నతాధికారి మరియట్లుండ కెపుడు
- న్యాయమెపుడును కారాదు నాక సుమము/ సగటు జీవికి అందాలి సరళముగను/ ఖర్చుపెంచెడి న్యాయము ఖర్మ గదుర!
- న్యాయ పంచాయితీలు సంశయము తీర్చి/చక్కనైన తీర్పులిడగ సత్వరమున/సజ్జనాళి సంతసమొందు సౌఖ్యమెరిగి!
- తిరుగ పలుమార్లు మోకాళ్లు యరుగు గాని/పనులు మాత్రము జరుగవు పైసలిడక!
- నేరములరి కట్టు విధము లరయలేక/విధిగ కొందరి నిరికించి వెతలు పంచు/దుష్ట యధికార గణముల దౌష్ట్యములను
- లోకమునకు తెలియవలయుకద నీతి/శాఖనుగల యన్యాయము సొంతముగను/ సర్వజనుల కామోదమౌ సవరణలను
- గబ్బిలాలను తలపించు గమనములతొ/తీర్పరాలయముల యందు తిరుగు చుండు/ నిత్య జీవన పోరాట నిర్ధనులను

'తెలుగు వెలుగు', 'తెలుగు వీర' పేరుతో రాసిన రెండు శతకాలలో శ్రీరామరాజు లేవనెత్తిన అంశాలు, వారు ఆశించిన పరిష్కారాలు ఎంతో కీలకమైనవి. వారు తెలుగువారి గురించి మాత్రమే ప్రస్తావించినా, ఆ సమస్యలు మొత్తం భారతదేశానికి వర్తించేవి. సార్వజనీనమైనవి. ఆ పరిష్కారాలను సాధించే నిర్దిష్ట సంస్కరణలను రూపొందించి వాటి సాధన కోసం లోక్‌సత్తా చాలా కాలంగా కృషి చేస్తోంది. ఈ అంశాలన్నిటిపై ప్రజల్లో అవగాహన పెంచటానికి శ్రీరామరాజు గారి శతకాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలి. అందుకు అందరూ చొరవతో సహకారం అందించాలి.

తన శతకాల్లో శ్రీరామరాజు మన వ్యవస్థల్లో పేరుకుపోయిన సమస్యల్ని లేవనెత్తినా నిరాశావాదం లేదు. 'తెలివిహీనులుగారులే తెలుగువారు/వెలుగుబాట కొరకెపుడు యెదురు చూచు/ ఇడుములు బడయగలరు వారెనుకబడరు!' అన్నారు. అలాగే వారి మకుటాలలోని తెలివి, తెలుగు, వెలుగు, తెలుసుకొనుమ, వీర వంటి పదాలు తెలుగువారిని కర్తవ్యోన్ముఖం చేసేవే.

శత వత్సరాలు మనిషి నిండు జీవితానికి సంకేతం. శతక పద్యాలు మానవ పరిపూర్ణ జీవితానికి కావలసిన కొన్ని అంశాలను ఎంచుకుని సంపూర్ణ సమాహారంలా అందించే ప్రయత్నం. ఎంతో తపనతో, చిత్తశుద్ధితో ఈ ప్రయత్నం చేసిన ముప్పాళ్ళ శ్రీరామరాజుగారికి, వారికి సహాయ సహకారాలనందిస్తున్న టి. బాలగంగాధరరావు, ఇతర మిత్రులకు మనస్ఫూర్తిగా అభినందనలు.

**(తెలుగు వెలుగు, తెలుగు వీర శతకాలకు జేపీ ముందుమాట)**

# ఈ-కోర్టులతో భూముల అనుసంధానం..

## కొనుగోలుదారులు కేసుల్లో ఇరుక్కోకుండా చట్టసవరణ చేయాలని 2016లోనే జేపీ లేఖ





నిజమైన కొనుగోలుదారులు వివాదాల్లో ఇరుక్కోకుండా తగిన సమాచారం అందేలా ఈ-కోర్టులు, భూముల రికార్డులు, రిజిస్ట్రేషన్ సమాచార నిధిని అనుసంధానించాలని జాతీయ స్థాయి ప్రభుత్వం భావిస్తోంది. ఏదైనా భూమికి సంబంధించి.. సమాచారం ఏమిటి? వివాదాలు ఏమైనా ఉన్నాయా? అని తెలుసుకోవడానికి ఇది ఉపకరిస్తుంది. దీనిపై మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, హర్యానాల్లో చేపట్టిన పైలట్ ప్రాజెక్టులు సత్ఫలితాలు ఇవ్వటంతో దేశమంతటా విస్తరించాలని నిర్ణయించింది. వివాదాస్పద భూములపై కొనుగోలుదారులు ముందుగానే జాగ్రత్తపడేందుకు వీలుగా భూముల రికార్డులు, రిజిస్ట్రేషన్ సమాచార నిధిని ఈ-కోర్టులు, నేషనల్ జ్యుడీషియల్ డాటా గ్రిడ్ (ఎన్‌జేడీజీ)తో అనుసంధానం చేసేలా రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ యూనియన్ న్యాయశాఖ అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్‌కు సూచించింది. దీనిపై త్రిపుర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, నాగాలాండ్, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టులు ఇప్పటికే సానుకూలంగా స్పందించాయి.

కాగా, స్థిరాస్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు ఎటువంటి కోర్టు కేసుల్లో ఇరుక్కోకుండా గ్యారంటీ పట్టా పొందేలా రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దాదాపు ఐదేళ్ల క్రితమే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు.

ఏప్రిల్ 5, 2016న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులకు జేపీ రాసిన లేఖ మీడియా రిలీజ్..

**కొనుగోలుదారులు కోర్టుల చుట్టూ తిరక్కుండా స్థిరాస్తి కేసుల వివరాలు తెలిపేలా రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరించండి: తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులకు జేపీ లేఖలు**

స్థిరాస్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు ఎటువంటి కోర్టు కేసుల్లో ఇరుక్కోకుండా గ్యారంటీ పట్టా పొందేలా రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులకు మంగళవారం వేర్వేరుగా లేఖలు రాశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న చట్టం ప్రకారం ఎంతో డబ్బు చెల్లించి స్థిరాస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నా పట్టాకు గ్యారంటీ లేదని, ఏమైనా కోర్టు కేసుల్లో ఆ ఆస్తి ఉంటే అమాయకులైన కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇలా భూ మాఫియాల వలలో చిక్కుకుని తాము జీవితకాలం కూడబెట్టిన డబ్బుతో స్థిరాస్తిని కొనుకున్నవారు అనేకమంది విలవిలలాడిపోతున్నారన్నారు. పరిష్కారం ఎప్పుడో తెలియకుండా ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఏటా అమాయకులు రూ.750 కోట్లు ఖర్చుచేస్తున్నారన్నారు. మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలు స్థిరాస్తి బదిలీ, భారత రిజిస్ట్రేషన్ (బోంబే సవరణ) చట్టంలోని సెక్షన్లను రాష్ట్ర ప్రభుత్వ చట్టంతో సవరించి కోర్టు గొడవల్లో స్థిరాస్తి కొనుగోలుదారులు చిక్కుకోకుండా చర్యలు తీసుకున్నాయని, అదేతరహాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కూడా కోర్టు వివాదాల్లో ఉన్న భూముల వివరాలను తప్పనిసరిగా కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ సమయంలో తెలియచేసేలా ఆస్తి బదిలీ చట్టం, 1882లోని సెక్షన్ 52ను, భారత రిజిస్ట్రేషన్ చట్టం, 1908 సెక్షన్ 17 లేదా 18ని సవరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టసవరణ ముసాయిదాను కూడా లేఖలకు జత చేశారు. భూ రికార్డులను డిజిటలైజ్ చేయటం ప్రభుత్వ భూములకే పరిమితం చేయకుండా పట్టా భూములకు కూడా వర్తింపచేయాలని జయప్రకాష్ నారాయణ్ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు.

స్థిరాస్తి రిజిస్ట్రేషన్ చట్ట సవరణ కోరుతూ తెలంగాణ,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులకు జయప్రకాష్ నారాయణ్ వేర్వేరుగా రాసిన లేఖల్ని లోక్‌సత్తా వర్గాలు మంగళవారం హైదరాబాద్‌లో మీడియాకు విడుదల చేశాయి. లేఖల స్థూలపాఠం:

"అనేకమంది స్థిరాస్తి కొనుగోలుదారులు రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో, ఇతర పట్టణ ప్రాంతాలలో భూ మాఫియా మోసాలకు గురవుతున్నారు. మన చట్టపరమైన నిబంధనలు బలహీనంగా ఉన్నాయి. స్థిరాస్తిని కొనుగోలు చేసే మధ్యతరగతి, పేదవారు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కింద భారీ మొత్తం డబ్బును చెల్లిస్తున్నా భూమి పట్టాకు గ్యారంటీ ఉండటం లేదు. ప్రస్తుతం విధిస్తున్న స్టాంప్ డ్యూటీ వల్ల తెలంగాణ ప్రభుత్వానికి రూ. 4,219.99, ఆంధ్రప్రదేశ్ సర్కారుకు రూ. 5,180 కోట్లు ఆదాయం వస్తుందని 2016-17 బడ్జెట్ అంచనాలు తెలియచేస్తున్నాయి. దురదృష్టవశాత్తూ, అమాయక కొనుగోలుదారునికి పలు సందర్భాలలో ఆ భూమిపై కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదం గురించి తెలియదు. విలువైన భూమిని కొనుగోలు చేయడానికి ఒక మధ్యతరగతి లేదా పేద కుటుంబం తన జీవితకాలం దాచుకున్న డబ్బును వెచ్చిస్తుంది. అట్లా కొన్న స్థిరాస్తి వ్యాజ్యంలో ఉందని తెలిసినా లేదా ఆ అమ్మినవ్యక్తి ఇంకెవరికో కూడా అదే భూమిని అమ్మినా లేదా అమ్మినవ్యక్తి ఆ స్థలానికి అసలైన హక్కుదారు కాకున్నా అమాయక కొనుగోలుదారు వేదన వర్ణనాతీతం. ఆ కొనుగోలుదారు ఎంతో ఆందోళనకు గురవుతూ కోర్టు కేసుల్లో చిక్కుకోవటంతోపాటు జీవితకాలం రూపాయిరూపాయిగా కూడబెట్టిన సొమ్మును కోల్పోయి రోడ్డున పడతాడు.

2006లో నిజామాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన 'భూ భారతి' ప్రాజెక్టు స్థిరాస్తి అమ్మకందారులు, ప్రమోటర్లు, పేద కొనుగోలుదారులతోపాటు డాక్యుమెంట్ల ఆధారంగా రుణాలిచ్చే బ్యాంకులలో కూడా ఎన్నో ఆశలు రేకెత్తించింది. అయితే ఆ కార్యక్రమం అమలవకుండా ప్రజల ఆశలకు గండికొట్టింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నమెంట్ అధ్యయనం ప్రకారం, పట్టణ శివారు భూముల్లో 28శాతం వివాదాల్లో ఉన్నాయి, పరిష్కారం ఎప్పుడో తెలియకుండా ఏటా రూ. 750కోట్లు కక్షిదారులు ఖర్చుచేస్తున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కింద ప్రజల నుంచి పెద్ద మొత్తాన్ని వసూలు చేస్తున్న ప్రభుత్వానికి అమాయక ప్రజలు కొనుగోలు చేస్తున్న ఆస్తుల టైటిల్‌ను పరిరక్షించాల్సిన బాధ్యత ఉంది.

భూ రికార్డులను బ్యాంకులకపర్యవేక్షణకు అందుబాటులో ఉంచాలని, రైతులకు తేలిగ్గా రుణాలు అందే ఏర్పాటుచేయాలని, ఒకే భూమికి రెండు రిజిస్ట్రేషన్లను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సానుకూలమైనవి. ఇటీవల రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రారంభించిన భూ రికార్డుల డిజిటలైజేషన్ కార్యక్రమం ప్రభుత్వ భూములనే కాకుండా పట్టా భూములను కూడా పరిరక్షించాలి. అయితే చట్టపరమైన కొన్ని లొసుగుల్ని సవరించి, ఆచరణాత్మకమైన కొన్ని చర్యల్ని చేపట్టాల్సుంది.

ఇక ముందు కొనుగోలుదారులు తాము కొనాలనుకుంటున్న స్థిరాస్తిపై ఏవైనా వ్యాజ్యాలు నడుస్తున్నాయా, డిక్రీ, అటాచ్‌మెంట్ వంటి వాటి పరిధిలో ఉందా అనే అంశాలను తెలుసుకోవటానికి ఒక ఏర్పాటును చేయాల్సిన అవసరం గురించే ఈ లేఖ రాస్తున్నాను. ఏటా స్థిరాస్తిని కొనుగోలుచేస్తున్న వేలాదిమందికి తాము కొంటున్న భూములపై న్యాయవివాదాల గురించి తెలియదు. తీరా కొన్నాక వివాదాలుంటే తీవ్ర వేదనకు గురవుతూ నష్టపోతూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. స్థిరాస్తిని అమ్మే వ్యక్తి న్యాయసమస్య గురించి చెప్పకపోయినా, ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టినా కొనుగోలుదారునికి తెలిసే అవకాశం ప్రస్తుతమున్న చట్టంలో లేకపోవటం వల్ల అమాయక ప్రజలకు ఈ తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

ఏ ఆస్తి రిజిస్ట్రేషన్‌లోనైనా ఈ రెండు అంశాలుండాలి:

1) ఎటువంటి ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నా అది స్పష్టమైన పట్టా గ్యారంటీ కావాలి.

2) పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాల వివరాలను కొనుగోలుదారులకు విధిగా అందించాలి. ఇటువంటి ఏర్పాట్లు లేకపోవటం వల్లే వేలాదిమంది న్యాయవివాదాల్లో చిక్కుకుని కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

స్థిరాస్తి బదిలీ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం ప్రస్తుతం ఎవరైనా యాజమాన్య హక్కుపై వ్యాజ్యాల్లో ఉన్న ఆస్తిని కొనుగోలు చేస్తే కొనుగోలుదారుని హక్కు కోర్టు నిర్ణయం మీదే ఆధారపడివుంటుంది. జీవితకాలం కూడబెట్టిన డబ్బుతో కొనుగోలు చేసిన స్థిరాస్తి కోర్టు వివాదంలో ఉందని తెలియటం వల్ల కొనుగోలుదారునికి జీవితకాల షాక్‌ని ఎదుర్కోవలసి వస్తోంది. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగాక పట్టా దక్కకపోవచ్చు.

ఈ సమస్యను అధిగమించటానికి మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలకు ఆస్తి బదిలీ చట్టంలోని 52వ సెక్షన్, ఇండియన్ రిజిస్ట్రేషన్ (బోంబే సవరణ) చటం, 1939కి రాష్ట్ర చట్టం ద్వారా సవరణ చేసి స్థిరాస్తిపై పెండింగ్ కేసులుంటే ఎన్‌కంబరెన్స్‌లతోపాటే సబ్‌రిజిస్ట్రార్ కొనుగోలుదారులకు తెలియచేయటం తప్పనిసరి చేశారు. సుప్రీంకోర్టు 2010లో ఈ చట్టాన్ని ఉటంకిస్తూ వ్యాజ్యాల్లో చిక్కుకున్న భూముల వల్ల కొనుగోలుదారులకు నష్టం లేకుండా వివరాలను వెల్లడించేందుకు ఇలాంటి సవరణనో లేదా తగిన ఇతర సవరణల్నో చేయాలని లా కమిషన్‌కి, పార్లమెంటుకి సూచించింది. ఏప్రిల్ 1998లో సమర్పించిన లా కమిషన్ కూడా ఈ రెండు సెక్షన్లకి సవరణల్ని సిఫార్సు చేసింది. ఈ సవరణ వల్ల తాను కొన్న స్థిరాస్తిపై వ్యాజ్యం పెండింగ్‌లో ఉందని తనకు తెలియదని కొనుగోలుదారులు వాదించే అవకాశం ఇక ఉండదని 2011లో గుజరాత్ హైకోర్టు వ్యాఖ్యానించింది. కొనేసమయంలోనే పెండింగ్ లిటిగేషన్ వివరాలు తెలియటం వల్ల తమ ప్రయోజనాలను కొనుగోలుదారులు పరిరక్షించుకోగలుగుతారు.

భూముల కొనుగోళ్లలో అనవసర లిటిగేషన్లను తొలగించి ప్రజల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు సానుకూలంగా ఉన్నందున ఆస్తి బదిలీ చట్టం, 1882లోని సెక్షన్ 52ను, భారత రిజిస్ట్రేషన్ చట్టం, 1908 సెక్షన్ 17 లేదా 18ని సవరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

చట్ట సవరణ ముసాయిదాలను కూడా జతచేస్తున్నాం".

అభివాదాలతో,

డా॥ జయప్రకాష్ నారాయణ్

# ఆటపాఠాల విలియమ్సన్






మొట్టమొదటి ప్రపంచ టెస్ట్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో విజేతగా ఇటీవల న్యూజిలాండ్ చరిత్ర సృష్టించింది. 2009లో ప్రారంభమైన టెస్ట్ ఛాంపియన్‌షిప్ ప్రతిపాదన 2019లో టోర్నమెంట్ రూపం దాల్చింది. ఈ రెండేళ్లలో ప్రపంచపు అత్యుత్తమ 9 జట్లు పోటీపడ్డాయి. 61 మ్యాచ్‌లు ఆడారు. 2021 జూన్‌లో ఇంగ్లండ్ సౌథాంప్టన్‌లో జరిగిన ఫైనల్‌లో భారత్‌పై న్యూజిలాండ్ విజయం సాధించి టెస్టుల్లో తొలి ప్రపంచ ఛాంపియన్ టైటిల్‌ను అందుకుంది. కేవలం గెలుపోటములే అయితే ఇది అందరికీ పెద్దచర్చనీయాంశం కాదు. కానీ న్యూజిలాండ్ గెలుపు ప్రస్థానం వెనక రాజకీయాలు సహా సమాజంలోని ప్రతి రంగం లోని వారూ నేర్చుకోవాల్సిన కొన్ని అంశాలున్నాయి. అవి న్యూజిలాంట్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ నాయకత్వ వ్యక్తిత్వంలోని అంశాలు.

ఎప్పుడో 2000లో ఛాంపియన్స్ ట్రోఫీని గెలవటం మినహా ఐసీసీ టోర్నీల్లో గెలిచిన రికార్డు న్యూజిలాండ్‌కు లేదు. కానీ విలియమ్సన్ సారథి అయ్యాక ఆ జట్టు గణనీయమైన పురోగమనాన్ని సాధించింది. తాజాగా మొట్టమొదటి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను గెలవటంతో తన వైఫల్యాల్ని అధిగమించింది. ఎటువంటి హడావుడీ లేకుండా.

మనలో చాలామందికి గుర్తుండే ఉంటుంది.. సరిగ్గా ఇదే ఇంగ్లండ్‌లో 2019లో ప్రపంచకప్ ఫైనల్‌లో గెలిచే అవకాశం న్యూజిలాండ్ చేతుల్లో నుంచి ఎలా జారిపోయిందో! 2019 జులై 14న చరిత్రాత్మక లార్డ్స్ మైదానంలో న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన టైటిల్ పోరులో ఇద్దరూ 241 పరుగులు చేశారు. సూపర్ ఓవర్ వేయాలని నిర్ణయించారు. ఆ ఓవర్ కూడా టైగా ముగిసింది. చివరికి బౌండరీల తేడాతో ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించారు. నిబంధనలను ప్రశ్నించి వివాదాస్పదం చేసే అవకాశం న్యూజిలాండ్‌కు ఉంది. కానీ ఎటువంటి వివాదానికీ ఆ జట్టు ప్రయత్నించలేదు. క్రీడాస్ఫూర్తిని ప్రతిఫలించని అడ్డగోలు నిబంధనలే అయినా వాటిని అనుసరించే ఓటమిని హుందాగా అంగీకరించి ఇంగ్లండ్‌ను అభినందించింది. ఓడి గెలిచింది. ప్రపంచకప్‌ను మించిన విజయాన్ని ప్రపంచ ప్రజల మనసుల్లో సాధించింది. ఇందుకు ప్రధాన కారణం విలియమ్సన్ నాయకత్వ వ్యక్తిత్వం.

న్యూజిలాండ్ బృందం 2019 ప్రపంచకప్ ఫైనల్లో బాధాకర ఓటమిని చవిచూసిన సందర్భంలో ఒక సీనియర్ జర్నలిస్టు విలియమ్సన్‌పై స్ఫూర్తిదాయక వ్యాసం రాశారు. న్యూజిలాండ్ ఆటగాడిగానే కాకుండా ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ ద్వారా కూడా మనందరికీ పరిచితుడైన విలియమ్సన్ వ్యక్తిత్వాన్ని అందులో ఇలా విశ్లేషించారు..

“డియర్ విలియమ్సన్... నచ్చేశావు. నిజంగా నచ్చేశావు. పిచ్చపిచ్చగా నచ్చేశావు. ఉద్విగ్న ప్రజ్ఞ (ఎమోషనల్ ఇంటెలిజెన్స్) అనే మాటను మానసిక విశ్లేషకుల ఉపన్యాసాల్లో విన్నాం, వ్యక్తిత్వ వికాస పుస్తకాల్లో మాత్రమే చదివాం. అదెట్ల ఉంటదో చూళ్లేదు. ఆ పదానికో ఆకారం ఇస్తే అది నూటికి నూరు శాతం నీలాగే ఉంటుంది. ఇంగ్లీషు డిక్షనరీలో చెప్పే 'సెల్ఫ్ పొయిజ్డ్' అనే మాటకు మనిషి రూపం లాగానే నువ్వు కనిపిస్తున్నవ్. రిచర్డ్ హాడ్లీని “సర్” అని గౌరవంగా సంబోధించినట్లే, నిన్ను సెయింట్ విలియమ్సన్ అని పిలవాలని అనిపిస్తుంది. నీ గడ్డాలు, మీసాలను చూసి కాదు. నీలోని రుషిని చూసి, నిజమైన మనిషిని చూసి ఆ కోరిక కలుగుతున్నది. ఎడమ చేత్తో రాసి, కుడి చేత్తో ఆడుతున్న నిన్ను సవ్యసాచి అని కూడా అనాలి.

స్థితప్రజ్ఞత గురించి శ్రీకృష్ణుడు చెప్పిన హితోక్తులు వింటూంటాం. బైబిల్‌లో ఇలాంటి పదమో, దీనికి సమానార్థమైన మరో పదమో.. ఉంటుందో లేదో తెలియదు. నువ్వు స్థితప్రజ్ఞుడిలా ఉండడం ఎలా నేర్చుకున్నావో కూడా మాకు తెలియదు. కానీ నీలో ఉన్న స్థితప్రజ్ఞతలో వెయ్యో వంతైనా మాకు లేదే అని భగవద్గీత అనుసరించేవారు కూడా అసూయ పడేలా చేశావు చూడూ- అక్కడ నచ్చేశావు.

క్రికెట్ మక్కా 'లార్డ్స్' మైదానంలో నీ న్యూజిలాండ్ జట్టుకు, సొంతగడ్డ అడ్వాంటేజ్ ఉన్న ఇంగ్లండ్‌తో జరిగిన ప్రపంచ కప్పు ఫైనల్స్‌లో ఫీల్డర్ల తప్పిదం ఏమాత్రం లేకున్నా సరే, ఓవర్ త్రో రూపంలో నాలుగు పరుగులు అదనంగా, అప్పనంగా ప్రత్యర్థి జట్టుకు సమర్పించుకోవాల్సి వచ్చినప్పుడు నువ్వు నిబంధనలను నిందించలేదు. అంపైర్ల మీదకు ఎగేసుకుని ఉరకలేదు సరికదా, ఇంకోసారి ఇలా 'ఓవర్' కాకుండా చూసుకోవాలని నిన్ను నీవు సంభాళించుకున్నావు కదూ.. అక్కడా నచ్చేశావు.

సూపర్ ఓవర్‌లో పరుగులు సమమైనప్పుడు బౌండరీల సంఖ్య ప్రామాణికతతోనే విజేతను నిర్ణయిస్తారని ప్రపంచ కప్పు చూసే వారందరికీ తెలిసుండకపోవచ్చు కానీ, ఆడే ప్రతి ఆటగాడికీ తెలుసు. అయినా సరే, ఫలితం వచ్చిన తర్వాత నిబంధనల గురించి వెర్రి అభిమానులు బట్టలు చింపుకున్నారు. తలలు పండిన క్రికెట్ పెద్దలు జుట్టు పీక్కున్నారు. భావోద్వేగాలను పిండుకోవాలి కాబట్టి.. పేపర్లలో వ్యాసాలు, టీవీల్లో చర్చలు జోరుగా జరిగాయి. నువ్వు మాత్రం అవేమీ మాట్లాడ లేదు. ఆడేటప్పుడే నిబంధనలు చూసుకోవాలి గానీ, ఓడాక కాదు అన్నట్లు విలేకరుల ప్రశ్నకు సమాధానంగా నువ్వు ఓ నవ్వు నవ్వావు కదా– మీసం, గడ్డం మధ్యలో నుంచి సన్నగా జాలువారిన ఆ చిరునవ్వులో అహం, ఆత్మవంచనలను చీల్చిచెండాడే ఖడ్గపు మెరుపుంది. సెమీఫైనల్లో ఓడాక ప్లే ఆఫ్ నిబంధనలు మార్చాలని డిమాండు చేసిన మా కథానాయకుల అతిశయాన్ని, పలాయనవాదాన్ని అంతం చేయడానికి, ఆ నవ్వు ద్వారా నువ్వు ప్రదర్శించిన ఉద్విగ్న ప్రజ్ఞ ఉపయోగపడుతుందేమో అనే ఆశ కల్పించినందుకు నచ్చేశావు. అడ్డగోలు నిబంధనల వల్లే న్యూజిలాండ్ ఓడిందని ప్రపంచమంతా సానుభూతి కురిపిస్తుంటే, మరో 20 పరుగులు చేసి ఉంటే కప్పు గెలిచేవాళ్లం అని ప్రకటించుకున్న నీ సంయమనం నచ్చేసింది. ఇంగ్లండును విశ్వవిజేతగా అంగీకరించలేని మానసిక రుగ్మతలో క్రికెట్ మేధావులుంటే, నువ్వు లక్ష అడుగులు ముందుకేసి ప్రత్యర్థిని మనసారా అభినందించి, పెద్దరికం చూపినందుకు నచ్చేశావు.


ఆఫ్ఘనిస్తాన్ లాంటి అనామక జట్టుపై చివరి ఓవర్‌లో పొందిన విజయాన్ని కూడా ఆకాశానికి ఎగిరి, గాలిలో పిడిగుద్దులు గుద్ది సంబురం చేసుకున్న పిచ్చి అభిమానులం మేము. మరి నువ్వేంటి? ప్రపంచ నెంబర్‌వన్ జట్టును మట్టికరిపించి, ఫైనల్ చేరినప్పుడు కూడా 'హుర్రే' అని మొత్తుకోలేదు. ఎగిరి గంతేయలేదు. గ్రౌండంతా పరిగెత్తలేదు. సాధారణ అభిమానులకే కాదు, సన్యాసులకు కూడా తత్వం నేర్పే నీలోని నిజమైన సాధువు పిచ్చిగా నచ్చేశాడు.

దేశవాళీ ఆటలో చిన్న పొరపాటు చేస్తేనే కెప్టెనిజం ప్రదర్శించి, ముఖం చిట్లించుకుని, సహచరుడు అని కూడా చూడకుండా బండబూతులు తిట్టే నాయకులున్న క్రికెట్ ఇది. అలాంటిది, ప్రపంచ కప్పు ఫైనల్లో పట్టిన క్యాచ్‌ను నిలుపుకోకుండా, ఎదుటి జట్టుకు ఆరు పరుగులు ధారపోస్తే కూడా బౌల్ట్ పట్ల అంత ఉదారంగా ఎట్ల ఉండగలిగావు. అదే బౌల్ట్‌లో మరుక్షణంలో పుష్కలమైన ఆత్మవిశ్వాసం నింపావు. బౌల్ట్‌తోనే ఇన్నింగ్స్ చివరి ఓవర్, సూపర్ ఓవర్.. వరుసగా రెండు ఓవర్లను వేయించి, లక్ష్యం ఛేదించకుండా ఇంగ్లండ్‌ను నిలువరించేంత శక్తి నింపావు. కెప్టెన్ అంటే పెత్తందారీ కాదు, స్ఫూర్తినింపే 'మెంటార్' అని నిరూపించినందుకు నచ్చేశావు.

సెమీఫైనల్‌కు ముందు నువ్వో మాట చెప్పావు. భారత్ మాకన్నా బలమైన జట్టు. ఓడించడం కష్టం. కాకుంటే విరాట్, రోహిత్‌లతో కూడిన టాప్ ఆర్డర్ కీలకం. వారిని ఔట్ చేసేందుకు మావద్ద కొన్ని ప్లాన్స్ ఉన్నాయి. అవి వర్కవుట్ అయితే మేమే గెలుస్తాం అన్నావు. వరల్డ్ కప్పు సన్నాహక మ్యాచులో భారత్‌పై నీ జట్టును గెలిపించి హెచ్చరికలు పంపావు కూడా. వాటన్నింటినీ మాలాంటి సగటు పక్షపాత అభిమానులు, ప్రపంచ నెంబర్‌వన్ జట్టు ఆటగాళ్లు పెద్దగా పట్టించుకోలేదు. కానీ నీ కచ్చితత్వం, నీ అంచనాయే నిజమైంది. మా దేశ జట్టును ఓడించినందుకు నీ మీద కోపం లేదు, నీ బలగాన్ని బలంగా మార్చుకోవడానికి నిజాయతీగా నువ్వు చేసే ప్రయత్నమే నిన్ను మాకందరికీ నచ్చేలా చేసింది. క్రికెట్ ఈజ్ నాట్ ఎ గేమ్, ఇట్స్ యాన్ ఎమోషన్ అని ఫేస్‌బుక్కులో పోస్టింగులు పెట్టి మరీ భావోద్వేగాలు ప్రదర్శించుకునేవారికి, క్రికెట్ ఈజ్ నాట్ యాన్ ఎమోషన్, ఇటీజ్ ఎ జెంటిల్మన్ గేమ్ అని నిరూపించడానికి నువ్వు ఆచరించే మార్గం నచ్చుతున్నది.

2014లో నువ్వు పాకిస్తాన్ టూర్లో ఉన్నప్పుడే పెషావర్‌లో ఉగ్రవాదులు ఊచకోతకు తెగబడ్డారు. ఐదు వన్డేల మ్యాచ్ ఫీజునంతా ఊచకోత బాధితులకు విరాళం ఇచ్చేశావు. పరాయి దేశంతో శతృత్వాన్ని మాత్రమే పెంచిపోషించి, లబ్ధి పొందే సంకుచితులున్న ప్రపంచంలో నీ ఔదార్యం నచ్చేసింది. అందరికీ తెగ నచ్చేసిన నువ్వు ఏడెనిమిది నెలల్లో ఐపీఎల్ ఆడేందుకు భారత్ వస్తావు. హైదరాబాద్ జట్టుకు సారథ్యం వహించే విలియమ్సన్‌ను మనోళ్ల ఖాతాలో వేసుకుని మేమంతా తెగ అభిమానించేస్తాం. మేమెట్లున్నా, నువ్వు నీలాగే ఉండు".

.. విలియమ్సన్ నాయకత్వ వ్యక్తిత్వాన్ని మనసు లోతుల్లో నుంచి ఇంత ఆర్తితో విశ్లేషించిన ఆ సీనియర్ జర్నలిస్టు చివర్లో మాత్రం 'మేమెట్లున్నా, నువ్వు నీలాగే ఉండు విలియమ్సన్" అన్నారు. అంటే సమాజానికి, మానవాళికి ఆదర్శంగా నిలిచే వ్యక్తులకు పొగిడేసి, దండేసి మనం మాత్రం ఎలా ప్రవర్తించినా పర్లేదు అనుకోవటమన్నమాట. సరిగ్గా ఇలాంటి ధోరణే లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్‌కు రాజకీయాల్లో సమాజం నుంచి ఎదురైంది. జేపీ గారూ, మీలాంటి వాళ్లు ఉండాలి. మేం ఓటు వేసినా వేయకపోయినా, విరాళాలిచ్చినా ఇవ్వకపోయినా మీరు మాత్రం రాజకీయాల్లో కొనసాగాలి అని తెలుగునాటే కాదు, భారతదేశంలోని పలు రాష్ట్రాల్లోని ప్రజలు, పౌర సమాజం, చివరికి అన్ని పార్టీల్లోని రాజకీయ నాయకులు కూడా అన్నారు. భగత్ సింగ్‌లు, గాంధీలు, అంబేద్కర్‌లు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌లు, ఆజాద్‌లు ఎవరో ఇంట్లో పుట్టాలి, మనం మాత్రం కనీసం వారికి అండగా నిలవటానికి కూడా చొరవ చూపం. మన తాత్కాలిక సుఖాలు, తక్షణావసరాలు, కులం, మతం, ప్రాంతం, భాష.. ఇవన్నీ దాటాక ఏమన్నా మిగిలితే, అప్పుడు కూడా మనకు బద్ధకంగా అనిపించకుండా ఉంటే.. అప్పుడు అలాంటి వారిని గురించి పట్టించుకుంటాం. మనం ఎలా చేసినా కూడా.. జేపీలాంటి నాయకులు అలా దీపస్తంభాల్లా నిలబడి ఉండాల్సిందే, ఎన్నో సాధించే అవకాశాలున్నా కొన్ని విజయాలకే పరిమితమవ్వాల్సిందే, మార్పు కోసం నిరంతర ఆశావాదంతో అలా సంస్కరణల పని చేస్తుండాల్సిందే.. మనం అంగీకరించే, ఆరాధించే విలువలు కావచ్చు, విధానాలు కావచ్చు లేదా మరే విషయమైనా కావచ్చు.. మన వంతు ఆచరించకపోతే చివరికి మనకే నష్టం చేసుకున్నవారమవుతాం. వ్యక్తిగత ప్రవర్తనలో, మన జీవితాల్ని అడుగడుగునా ప్రభావితం చేసే రాజకీయంలో మన ఆచరణ వైఫల్యాల్ని ఆలస్యంగానైనా సరిదిద్దుకుందాం. ✦


THE INDIAN EXPRESS
Bombay: Saturday June 28 1975
No
but

It was its framed blank editorial, representing censorship by the Indira Gandhi government in the na[t] of Emergency, which gained maximum attention and would go on to be remembered for years dow[n] the line. (Express Archive)



# ఎమర్జెన్సీ తర్వాత దేశం మారింది కానీ..

ఎమర్జెన్సీ కాలం 1975 తర్వాత భారతదేశం మారింది. 44వ రాజ్యాంగ సవరణ, బొమ్మయి కేసు తీర్పు, లైసెన్స్ పర్మిట్ రాజ్‌కు చెల్లుచీటీ, ప్రాంతీయ పార్టీల పెరుగుదల, ఆర్థిక సంఘాల ద్వారా కొంత మెరుగ్గా వనరుల వికేంద్రీకరణ వల్ల మనం ఉదారవాద, సమాఖ్య దేశమని చెప్పుకోగల స్థాయిని సంతరించుకున్నాం. కానీ రాజకీయ పార్టీల నియంతృత్వం, బలహీన చట్టబద్ధపాలన, నిర్వీర్య స్థానిక ప్రభుత్వాలు, ప్రధానమంత్రి-ముఖ్యమంత్రి-జిల్లా కలెక్టర్ (పీఎం-సీఎం-డీఎం) సంస్కృతి, అధికారం పట్ల అంతులేని ఆరాధన మనల్ని బలహీనపరుస్తున్నాయి.

- డా॥ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th July, 2021 Posting Date 15 &16th of every month

# సమగ్ర ప్రజారోగ్య విధానం సిద్ధం..
# ఇక అమలు బాధ్యత
# మీదే!



**జాతీయ ఆదాయంలో కేవలం 2% లోపు ఖర్చుతో భారతదేశంలోని ప్రతి ఒక్కరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని జేబులపై ఆర్థిక భారం లేకుండా అందించే సమగ్ర ప్రజారోగ్య వ్యవస్థ విధానాన్ని రూపొందించి ప్రభుత్వం, ప్రజల ముందుంచుతున్నాం. దేశ ఆరోగ్య వ్యవస్థలో మౌలిక మార్పు ఇప్పటికైనా రావాలి. నివారించదగ్గ మరణాలు, పేదరికం, కన్నీళ్లు ఇకనైనా ఆగాలి. కొవిడ్ సంక్షోభాన్ని ఇందుకు అవకాశంగా మలచుకోవాలి. పాతికేళ్ల లోక్‌సత్తా కృషిని, ప్రపంచ దేశాల అనుభవాల్ని, మన ఆరోగ్య వ్యవస్థలోని లోపాల్ని, కొవిడ్ ప్రభావాన్ని, భారత్‌కున్న వనరుల్ని మదింపు చేసి దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఉపాధితో కూడిన జవజీవాలందించేలా 180 పైచిలుకు పేజీలతో రూపొందించిన ఈ ప్రజారోగ్య విధానాన్ని చర్చించి అమల్లోకి తేవాల్సిన బాధ్యత ఇక రాజకీయం, మీడియా, ప్రజలదే.**

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020